

మా కలం - సామాన్యుడి బలం
# నంది పత్రిక
జాతీయ తెలుగు దిన పత్రిక
RNI-APTEL/2023/88162
GSTIN 37AMRPM5719R1ZX

27న సీతారామ కల్యాణం



ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 84 | బుధవారం 25 - 03 -2026 | పేజీలు : 12 | వెల-3




# మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం

ఏపీలో ప్రతిష్ఠాత్మకమైన ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు నిన్న అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద శంకస్థాపన జరగడం తెలిసిందే. దీనిపై సీఎం చంద్రబాబు నేడు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఓ దిక్సూచి అని అభివర్ణించారు. డబుల్ ఇంజన్ సర్కారుతోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ సాధ్యమైందంటూ ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. “మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం. ప్రజలు ఇచ్చిన అధికారంతో ప్రతీ రంగంలో, ప్రతీ ప్రాంతంలో మార్పు తెచ్చి చూపిస్తున్నాం. ఉత్తరాంధ్రలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ రాకతో గొప్ప ముందడుగు వేశాం. 21 నెలల క్రితం కబ్జాలు, కూల్చివేతలు, కేసులతో అభద్రత, భయం, మానసిక క్షోభతో అల్లాడిన ఉత్తరాంధ్ర ప్రాంతంలో... నేడు అభివృద్ధి, అవకాశాలు, ఆకాంక్షలతో అన్ని చోట్లా ఆనందాన్ని, భవిష్యత్ పై భరోసాను తీసుకువచ్చాం.



# పునర్విభజనతో మరిన్ని అవకాశాలు

**పునర్విభజనపై వాస్తవిక దృక్పథంతో ముందుకు వెళ్దాం**

**గెలుపే లక్ష్యంగా స్థానిక పోరుకు సిద్ధమవ్వండి**

**నిలబడిన ప్రతి చోటా జనసేన జెండా ఎగిరేలా కష్టపడండి**

**నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్ళాలి**

**వారంలో ఒకరోజు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడం తప్పనిసరి**

**పార్టీ బలంగా ఉంటేనే ప్రజాప్రతినిధులు బలంగా ఉంటారు**

**పార్టీ నేతలకు జనసేనాని పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం**

2లో

నియోజకవర్గాల పునర్విభజన వల్ల అవకాశాలు మరింత పెరుగుతాయని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో ఆయన సుమారు మూడు గంటలకు పైగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. సభ్యత్వ నమోదు, పార్టీ కమిటీలపై చర్చించారు. నియోజకవర్గాల్లో సమస్యలపై ఆరా తీశారు. కమిటీల ఏర్పాటు విషయంలో పిఠాపురం మోడల్‌ని మిగతా నియోజక వర్గాల్లోనూ అమలు చేయాలని సూచించారు. కూటమి పార్టీల సయోధ్య విషయంలో దిశానిర్దేశం చేశారు.పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమై పలు ముఖ్య అంశాలపై చర్చించారు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులు, తాజా రాజకీయ పరిణామాలపై సమగ్రంగా చర్చించి నేతలకు పవన్ దిశానిర్దేశం చేశారు.నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంలో ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా, వాస్తవిక దృక్పథంతో ప్రజాప్రతినిధులు ముందుకు వెళ్లాలని పవన్ కళ్యాణ్ ఉద్ఘాటించారు. 2009లో చివరిసారిగా పునర్విభజన జరిగినప్పుడు రాష్ట్రం, దేశంలో చోటు చేసుకున్న అంశాలను ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకోవా లన్నారు. నిబంధనలకు అనుగుణంగా, ప్రజాప్రయోజనమే పరమార్థంగా, సహేతుకంగా పునర్విభజన జరిగేలా జనసేన ప్రజా ప్రతినిధులు ముందుకు వెళ్లాలని సూచించారు. ముఖ్యంగా జనసేన ప్రజాప్రతినిధులు అన్ని వర్గాలకు చేరువలో (రీచ్ అవుట్) ఉంటూ... నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. రాష్ట్ర మంత్రులు,

# అమరావతిలో వరుస అగ్నిప్రమాదాలు

## కుట్రకోణంపై దర్యాప్తు: హోంమంత్రి




రాజధాని అమరావతిపై ఎవరు కుట్రలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. అమరావతిలో వరుసగా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవడం.. అది కూడా ఒకే తరహాలో జరుగుతుండటంపై విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. మంగళవారం రాజధాని అమరావతిలో మంత్రి అనిత విలేకర్లతో మాట్లాడుతూ.. అమరావతిలోని రాయపూడి సమీపంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శుల బంగ్లాల వద్ద గత అర్థరాత్రి జరిగిన భారీ అగ్నిప్రమాదాన్ని.. ఐదు అగ్నిమాపక శకటాలతో చాలా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్లు వివరించారు.అమరావతిలో ఇటీవల జిల్లా కలెక్టర్ల సదస్సు నిర్వహించారన్నారు. ఆ రోజు సైతం జరిగిన అగ్నిప్రమాదం కూడా ఉద్దేశపూర్వకంగా జరిగిందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. అమరావతి ప్రాంతంలో గత కొద్ది రోజులుగా వర్షం కురిసినందున ఈ తరహా ఘటనలు జరగటానికి అవకాశాలు చాలా స్వల్పమని మంత్రి అనిత అభిప్రాయపడ్డారు.

## ఇది తెలుగుదేశం పార్టీ 3.0 వెర్షన్.. మధ్యవర్తులు ఉండరు




“ఇది తెలుగుదేశం పార్టీ 3.0 వర్షన్. పార్టీలో సమూల మార్పులు తీసుకువచ్చి, మరింత బలంగా ముందుకు వెళతాం“ అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసే కార్యకర్తలను మధ్యవర్తులు లేకుండా నేరుగా గుర్తించడమే తమ లక్ష్యమని ఆయన ప్రకటించారు.

## విజయవాడలో ఉగ్ర కలకలం... ముగ్గురు యువకుల అరెస్ట్




ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నాయనే ఆరోపణలపై ఆంధ్రప్రదేశ్ పోలీసులు విజయవాడలో ముగ్గురు యువకులను అరెస్ట్ చేశారు. కౌంటర్ ఇంటెలిజెన్స్ (సీఐ) సెల్ అధికారులు మంగళవారం ఈ ఆపరేషన్ నిర్వహించారు. సోషల్ మీడియా వేదికగా తీవ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నారనే ఆరోపణలపై మహమ్మద్ రహమతుల్లా షరీఫ్



## పశ్చిమాసియా పరిస్థితులు... రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రకటన

2లో

పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో, గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న భారతీయుల భద్రతే ప్రథమ ప్రాధాన్యతగా తీసుకున్నామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఆయా దేశాల్లో చిక్కుకున్న మనవారిని సురక్షితంగా తీసుకువచ్చామని తెలిపారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులపై ఆయన రాజ్యసభలో మాట్లాడుతూ, పశ్చిమాసియా పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని అన్నారు. అక్కడ యుద్ధం జరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక సమస్యలు వస్తున్నాయని, ఇంధన సంక్షోభానికి దారితీసిందని ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశంలో ముడి చమురు, గ్యాస్, ఎరువుల రవాణాకు ఎలాంటి ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం మనకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని తెలిపారు. మరోవైపు, హర్మూజ్ జలసంధి మీదుగా భారత చమురు నౌకలు వస్తున్నాయని వెల్లడించారు.ఆ నౌకలు సురక్షితంగా మన పోర్టులకు చేరేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా అక్కడి నుంచి 3.54 లక్షల మంది భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చామని అన్నారు. ఈ దాడుల్లో కొంతమంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారని సభకు తెలిపారు. గల్ఫ్ దేశాలతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. సమస్యలకు చర్చలు, సంప్రదింపులే ఏకైక పరిష్కారమని ప్రధాని మోదీ అన్నారు.



## పశ్చిమాసియా సంక్షోభం...

2లో

పశ్చిమాసియాలో ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలను చల్లార్చేందుకు పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహిస్తోందంటూ వస్తున్న వార్తలను రాజకీయ విశ్లేషకుడు తెహసీన్ పూనావాలా తీవ్రంగా ఖండించారు. ఇదంతా పూర్తిగా ‘ఫేక్ న్యూస్‘ అని ఆయన కొట్టిపారేశారు. ఇలాంటి నిరాధార వార్తలను ఎవరూ నమ్మవద్దని ఆయన స్పష్టం చేశారు.

## కొలంబియాలో కుప్పకూలిన సైనిక విమానం..

**66 మంది దుర్మరణం**



కొలంబియాలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. కొలంబియన్ వైమానిక దళానికి చెందిన ఓ విమానం ఈక్వెడార్ సరిహద్దు సమీపంలోని అటవీ ప్రాంతంలో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న 66 మంది సిబ్బంది, ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో సైనిక సిబ్బందితో పాటు వారి కుటుంబసభ్యులు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. కాగా, ప్రమాద సమయంలో విమానంలో మొత్తం 120 మంది ఉన్నారని సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన అధికారులు పలువురిని కాపాడినట్లు తెలుస్తోంది.

# చంద్రబాబుతో సంజయ్ దత్ భేటీ..

**ఏపీలో ఫిల్మ్ సిటీ, షూటింగ్‌లపై కీలక చర్చలు**



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వేదికగా ఒక ఆసక్తికరమైన సన్నివేశం చోటుచేసుకుంది. బాలీవుడ్ దిగ్గజ నటుడు సంజయ్ దత్, తన బృందంతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. సచివాలయంలోని సీఎం ఛాంబర్‌లో జరిగిన ఈ సమావేశం జరిగింది. సంజయ్ దత్‌తో పాటు గౌరవ్ దూబే, కునాల్ పటేల్, అనుజ్ కుమార్ వంటి ప్రముఖులు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు, సంజయ్ దత్ కాసేపు ఏకాంతంగా కూడా మాట్లాడుకున్నారు. రాష్ట్రంలో సినిమా రంగానికి సంబంధించి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్టు సంజయ్ దత్ ముఖ్యమంత్రికి వివరించారు.

# పశ్చిమాసియా సంక్షోభం...

ఈ విషయంపై ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడుతూ, "పాకిస్థాన్ మధ్యవర్తిత్వం చేస్తుందనే వార్తను ప్రచురించిన వారు పాక్ కు చెందిన వారై ఉంటారు. ఇది నమ్మశక్యం కాని విషయం" అని పూనావాలా ఘాటుగా వ్యాఖ్యానించారు. ఓవైపు అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) నుంచి ఆర్థిక సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్న పాకిస్థాన్, ఇంతటి పెద్ద వివాదంలో మధ్యవర్తిగా ఎలా వ్యవహరిస్తుందని ఆయన ప్రశ్నించారు. అమెరికా, చైనా, సౌదీ అరేబియా వంటి దేశాలపై పాక్ ఆధారపడి ఉందని, అలాంటిది ఈ దేశాల మధ్య ఉన్న విభేదాల్లో తలదూర్చే స్థాయి పాకిస్థాన్ కు ఉందా?" అని సందేహం వ్యక్తం చేశారు. "కొన్నేళ్ల క్రితం ఇరాన్, పాకిస్థాన్‌లు ఒకరిపై ఒకరు క్షిపణులు ప్రయోగించుకున్నాయి. ఇటీవలే రంజాన్ మాసంలో ఆఫ్ఘనిస్థాన్‌పై పాక్ బాంబుల వర్షం కురిపించింది. ఇలాంటి చరిత్ర ఉన్న దేశం శాంతి కోసం మధ్యవర్తిత్వం ఎలా చేస్తుంది?" అని పూనావాలా విమర్శించారు. ఒకవేళ నిజంగా మధ్యవర్తిత్వం చేస్తుంటే, దాన్ని బహిరంగంగా ఎందుకు ప్రచారం చేసుకుంటారని ఆయన నిలదీశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో మధ్యవర్తిత్వం వహించే సత్తా కేవలం ఖతార్, ఒమన్, భారత్‌లకు మాత్రమే ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. పశ్చిమాసియాలో యుద్ధాన్ని ప్రపంచం కోరుకోవడం లేదని, చమురు సంక్షోభానికి ముగింపు పలికేందుకు భారత్ సహా అన్ని దేశాలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## కొలంబియాలో కుప్పకూలిన సైనిక విమానం..

విమానం భూమిని ఢీకొట్టడానికి ముందు గాల్లోనే అదుపు తప్పి వేగంగా పల్టీలు కొడుతూ కిందకు పడిపోతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. స్థానికులు తీసిన వీడియోలో ఈ భయానక దృశ్యాలు రికార్డ్ అయ్యాయి. విమానం కూలిన వెంటనే భారీగా మంటలు చెలరేగడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఇంజిన్‌లో సాంకేతిక లోపం లేదా ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్లే ఈ ఘటన జరిగి ఉండవచ్చని నిపుణులు అనుమానిస్తున్నారు. కొలంబియా ప్రభుత్వం ఈ ప్రమాదంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. ఘటనా స్థలంలో విమాన బ్లాక్ బాక్స్ కోసం అధికారులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ విషాద ఘటనపై కొలంబియా అధ్యక్షుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంతో దేశంలో విమాన ప్రయాణాల భద్రతా ప్రమాణాలు, పాత విమానాల నిర్వహణపై మరోసారి విస్తృత చర్చ మొదలైంది.

# విజయవాడలో ఉగ్ర కలకలం...

(23), ఎండీ డానిష్ (27), మీర్జా సోహైల్ బేగ్ (23)లను అదుపులోకి తీసుకున్నారు.

విజయవాడలోని వించిపేటలో నిందితుల నివాసాల సమీపంలో వారిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరి నివాసాల్లో సోదాలు నిర్వహించి ఎలక్ట్రానిక్ పరికరాలు, పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు ఐసిస్, ఏక్యూఐఎస్ వంటి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. 'అల్ మాలిక్ ఇస్లామిక్ యూత్' అనే బృందాన్ని ఏర్పాటు చేసి, యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు. భారత జాతీయ జెండా స్థానంలో ఐసిస్ జెండాను ఉంచాలంటూ వీరు ప్రచారం చేసినట్లు ఆరోపణలున్నాయి. ఆన్‌లైన్ కార్యకలాపాలపై నిఘా ఉంచిన సీఐ సెల్, పాకిస్థాన్ నుంచి నిందితులకు నిధులు అందుతున్నట్లు పక్కా సమాచారంతో ఈ అరెస్టులు చేసింది. దేశవ్యాప్తంగా సుమారు 10 మంది యువకులతో వీరు నెట్‌వర్క్ ఏర్పాటు చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. అరెస్ట్ చేసిన ముగ్గురిని చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా, వారికి ఏప్రిల్ 6 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశించారు. అనంతరం వారిని విజయవాడ సెంట్రల్ జైలుకు తరలించారు. నిందితులపై చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ), ఐటీ చట్టం కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# 27న సీతారామ కల్యాణం

ఉత్తరాంధ్రప్రాంతానికి ప్రముఖమైన క్షేత్రంగా వెలుగొందు తున్న నెల్లిమర్ల మండల రామతీర్థంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారామ కల్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఉచిత దర్శనం, శీఘ్ర దర్శనం, వీఐపీ దర్శనం, క్యూలైన్‌లో ఉండే భక్తులకు తాగునీరు, ఉచిత ప్రసాదం పంపిణీకి ఇప్పటినుంచి ప్రణాళికతో అడుగులు వేస్తున్నారు. కల్యాణం ఆవరణంలో భక్తులకు ఎండ తగలకుండా చూడనున్నారు. ఎక్కడి నుంచైనా కల్యాణం వీక్షించేలా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నారు. అన్నప్రసాదం, తాగునీరు, మజ్జిగ నిరంతరం సరఫరా చేయనున్నారు. ఆనవాయితీ ప్రకారం సింహాచల స్వామి వరాహలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలు సమకూరుస్తారు. నవమి ఉత్సవాలను పురస్కరించుకుని మార్చి 25న గిరిప్రదక్షిణను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి సొంత వాహనాల్లో వచ్చే అవకాశం ఉన్నందున ఆయా వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేయనున్నారు. ఆలయం వద్ద రెండు ఫైర్ ఇంజన్లు సిద్ధంగా ఉంచనున్నారు. పారిశుధ్య నిర్వహణ, శానిటేషన్‌ను పంచాయతీరాజ్‌శాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగాలు చేపట్టనున్నాయి. ఆర్టీసీ ఆధ్వర్యంలో భోగాపురం, ముక్కాం, కోనాడ తదితర మత్స్యకార గ్రామాలకు నాలుగు బస్సులు ఏర్పాటు చేయనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి.

## పోరుమామిళ్లలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం హార్ట్ చెకప్ క్యాంప్ ఏర్పాటు



**పోరుమామిళ్ల, మార్చి 24 (నంది పత్రిక):** పోరుమామిళ్ల పట్టణంలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మెగా ఉచిత కంటి వైద్య శిబిరం మరియు హార్ట్ చెకప్ క్యాంప్ (జుజ+) నిర్వహించనున్నారు. పట్టణ మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం (26-03-2026)న గాంధీ బొమ్మ సమీపంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఈ శిబిరం జరుగనుంది. ఈ శిబిరాన్ని శాంతిరాం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కంటి విభాగం వైద్యులు నిర్వహించనున్నారు. శిబిరంలో ప్రతి ఒక్కరికి ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతో పాటు, కంటి శుక్లం (కాటరాక్ట్) మరియు ఇతర కంటి సమస్యలు ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్లు కూడా చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే, హార్ట్ చెకప్ కోసం ఇ. సి. జి పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహించనున్నారు. శిబిరంలో పరీక్ష చేయించుకున్న వారికి అవసరమైతే ఆపరేషన్ కోసం రానుపోను ఉచిత బస్సు సౌకర్యం కల్పించబడింది. ఆపరేషన్ అవసరమయ్యే వారు ఒరిజినల్ ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు, తమ మొబైల్ నంబర్, రెండు జతల బట్టలు మరియు దుప్పటి తీసుకురావాలని సూచించారు. పోరుమామిళ్ల పట్టణం మరియు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ యనమల సుధాకర్ కోరారు. ఈ శిబిరం గురువారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పంచాయతీ కార్యాలయంలో నిర్వహించబడుతుంది.

## గ్యాస్ రీఫిల్ బుకింగ్ గడువు మరోసారి పెంపు

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, చమురు కంపెనీలు గ్యాస్ సరఫరా కోసం కొత్త నిబంధనలను తీసుకువస్తున్నాయి. రెండు సిలిండర్లు ఉన్న వారికి ఇకపై 35 రోజులకు ఒక గ్యాస్ సిలిండర్ లభించనుంది. అదే సమయంలో, ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన కింద ఉన్న వినియోగదారులకు ప్రతి 45 రోజులకు ఒక సిలిండర్ అందుతుంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఇదే నిబంధన వర్తిస్తుంది.

డబుల్ సిలిండర్ వినియోగదారులకు రీఫిల్ బుకింగ్ మధ్య అంతరాన్ని మరింత పెంచుతూ చమురు సంస్థలు తాజాగా నిర్ణయం తీసుకున్నాయి. మొదట్లో ఈ గడువు 21 రోజులు ఉండగా, మార్చి రెండో వారంలో 25 రోజులకు పెంచిన చమురు సంస్థలు, తాజాగా 35 రోజులకు సవరించాయి. సింగిల్ సిలిండర్ ఉంటే పట్టణాల్లో 25 రోజుల తర్వాత, గ్రామాల్లో 45 రోజుల తర్వాత బుక్ చేయాల్సి ఉంటుంది.

## కలెక్టర్ నిధులతో ఆర్ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభం

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, మార్చి 24(నంది పత్రిక):-** లారీ డ్రైవర్లకు శుద్ధమైన తాగునీరు అందుబాటులో ఉండేలా జిల్లా పరిపాలన ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యుల విజ్ఞప్తి మేరకు, నంద్యాల పట్టణంలోని విజయ పాల డైరీ సమీపంలో రూ. 2.40 లక్షల వ్యయంతో, గంటకు 1000 లీటర్ల సామర్థ్యం గల ఆధునిక ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత జనవరి 31న లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 37వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు డ్రైవర్లు శుద్ధమైన తాగునీటి అవసరాన్ని తన దృష్టికి తీసుకువచ్చారని గుర్తుచేశారు. వారి అవసరాన్ని ప్రాధాన్యంగా తీసుకుని తక్షణమే ఆర్ఓ ప్లాంట్ మంజూరు చేసి, నిర్ణీత గడువులో పూర్తి చేయించడం జరిగిందన్నారు. ఈ ఆర్ఓ ప్లాంట్ ద్వారా లారీ, ఆటో డ్రైవర్లకు మాత్రమే కాకుండా సమీప ప్రాంత ప్రజలకు కూడా శుద్ధమైన తాగునీరు అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛమైన నీటి వినియోగం వల్ల నీటి ద్వారా వ్యాపించే వ్యాధులను గణనీయంగా తగ్గించవచ్చని, ప్రజల ఆరోగ్య రక్షణలో ఈ ప్లాంట్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్లాంట్‌లో అధునాతన ఫిల్ట్రేషన్ సాంకేతికత, సమృద్ధిగా నిల్వ ట్యాంకులు, సురక్షిత పంపిణీ వ్యవస్థలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ అభినందించారు. భవిష్యత్తులో కూడా ప్లాంట్ నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆర్ఓ ప్లాంట్ ప్రారంభంతో లారీ మరియు ఆటో డ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు. తమ విజ్ఞప్తిని గౌరవించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన జిల్లా కలెక్టర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాసులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 31 నాటికి విద్యుత్ స్తంభాల ఏర్పాటు పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



**నంద్యాల బ్యూరో, మార్చి 24(నంది పత్రిక):-** ఆర్డీఎస్ఎస్ పథకం కింద వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ స్తంభాల పనులను సంబంధిత శాఖలు సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేసి, మార్చి 31వ తేదీ నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆర్డీఎస్ఎస్ పథకం అమలు, విద్యుత్ స్తంభాల ఏర్పాటుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, శ్రీశైలం సబ్ డీఎఫ్ఓ బబితా కుమారి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తోగట ప్రియాంక, విద్యుత్ శాఖ ఎస్ఈ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో త్రీ-ఫేజ్ విద్యుత్ సరఫరా అందిస్తూ నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా విద్యుత్ ట్రిప్పులు తగ్గించి, లో వోల్టేజ్ సమస్యలను నివారిస్తూ స్థిరమైన విద్యుత్ సరఫరాను అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆర్ & బీ రహదారులకు సంబంధించిన 7 ప్రదేశాల్లో ఇరువైపుల విద్యుత్ స్తంభాల ఏర్పాటు జరుగుతున్న నేపథ్యంలో ఎటువంటి అంతరాయాలు లేకుండా సంబంధిత శాఖలు, రెవెన్యూ సిబ్బంది పరస్పర సమన్వయంతో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. నేషనల్ హైవే పరిధిలోని 11 ప్రదేశాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను సంబంధిత అధికారులు సంయుక్తంగా పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అటవీ శాఖ పరిధిలోని 4 ప్రదేశాల్లో పెండింగ్ పనులపై సంబంధిత అధికారులతో చర్చించి వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు పరిసరాల్లో ఏర్పాటు చేసిన 15 విద్యుత్ స్తంభాల పనులను కూడా సంబంధిత శాఖలతో కలిసి పరిశీలించి పూర్తి చేయాలని ఆదేశించారు. టోల్ గేట్ల పరిసరాల్లో అధిక సాంద్రతతో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల వల్ల పంటల దిగుబడిపై ప్రభావం పడుతోందని రైతుల నుంచి పీజీఆర్ఎస్‌లో వినతులు వస్తున్న నేపథ్యంలో, ఆ సమస్యలను గమనించి తగిన పరిష్కార చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సూచించారు.

## ఆదాయ పెంపులో జిల్లాను ముందంజలో నిలపాలి

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల బ్యూరో, మార్చి 24(నంది పత్రిక):-** జిల్లాలో ప్రధాన ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి సారించి, అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత వార్షిక లక్ష్యాలను అధిగమించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, రిజిస్ట్రేషన్, రవాణా తదితర విభాగాల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ రాము నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తోగట ప్రియాంకతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఆదాయ వృద్ధి సాధించేందుకు ప్రతి శాఖ స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖకు వార్షికంగా రూ.1200 కోట్ల లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు రూ.1159 కోట్ల ఆదాయం సాధించడం జరిగిందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది సుమారు 10 శాతం వృద్ధి నమోదైందని వెల్లడించారు. మైనింగ్ శాఖకు రూ.247 కోట్ల లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు రూ.231 కోట్ల ఆదాయం సమీకరించారని చెప్పారు. వాణిజ్య పన్నుల శాఖకు రూ.757.89 కోట్ల లక్ష్యం ఉండగా, ఇప్పటివరకు రూ.584.27 కోట్ల మేర ఆదాయం వసూలు చేసినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో మిగిలిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అలాగే, జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో రూ.15 వేలకుపైగా వేతనం పొందుతున్న ఉద్యోగుల నుండి ప్రొఫెషనల్ టాక్స్ వసూలు చేయడానికి అవసరమైన వివరాలను సేకరించి సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారికి (డీఈఓ) కలెక్టర్ ఆదేశించారు. రిజిస్ట్రేషన్ శాఖకు రూ.201 కోట్ల లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు రూ.183 కోట్ల ఆదాయం నమోదైందని తెలిపారు. రవాణా శాఖకు రూ.160.54 కోట్ల లక్ష్యం ఉండగా, ఇప్పటి వరకు రూ.117.33 కోట్ల ఆదాయం సమీకరించినట్లు చెప్పారు. అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేసి గత ఆర్థిక సంవత్సరాన్ని మించి లక్ష్యాలను అధిగమించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో విద్యుత్ ఉపకరణాల లభ్యతపై సమీక్ష.. జిల్లాలో గ్యాస్ కొరత లేదని పేర్కొంటూ ప్రత్యామ్నాయంగా వినియోగించే విద్యుత్ ఉపకరణాలు కూడా సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని విద్యుత్ దుకాణాల్లో ప్రస్తుతం 12 ఇండక్షన్ స్టవ్లు, 47 మైక్రో ఓవెన్లు, 97 రైస్ కుక్కర్లు, 24 ఎలక్ట్రిక్ ఓవెన్ టోస్టర్లు నిల్వలో ఉన్నాయని తెలిపారు. అవసరాన్ని బట్టి మరిన్ని ఉపకరణాలను సరఫరా చేయడానికి వ్యాపారులు సిద్ధంగా ఉన్నారని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు వెల్లడించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

# మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం:

ఆంధ్రుల హక్కు అని పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ మన ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిస్తే... ఇప్పుడు అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు అవుతున్న ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా పరిశ్రమ ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు నూతన దిక్సూచి అవుతుంది. రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఏర్పాటు అవుతున్న ఉక్కు కర్మాగారం ఉత్తరాంధ్రను ఉక్కు ఆంధ్రాగా మారుస్తుంది. ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నిర్మాణంతో ఉక్కు రంగంలో ఏపీ దేశంలో అత్యున్నత స్థానానికి చేరుకుంటుంది. గౌరవ ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లనే 21 నెలల్లో ఇంత పెద్ద ప్లాంట్‌ను రాష్ట్రానికి తీసుకురాగలిగాం. ప్లాంట్‌కు అవసరమైన ముడి ఖనిజం సరఫరా నుంచి అనుమతుల వరకు కేంద్రం వేగవంతమైన, సానుకూల నిర్ణయాలతో ప్రతి దశలోనూ ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చింది. డబుల్ ఇంజన్ సర్కారు ప్రగతిశీల నిర్ణయాల వల్లనే ఈ ప్రాంతంలో ఒక స్టీల్ సిటీ నిర్మితమవుతోంది. యువతకు లక్షల సంఖ్యలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయి. వచ్చే మూడేళ్లలోనే ఈ ప్రాంతంలో అన్ని రంగాల్లో, అన్ని విధాలా అభివృద్ధి ఫలాలు అందుతాయి. భారతదేశంలోనే అతి పెద్ద స్టీల్ ప్లాంట్‌కు అడుగులు పడిన సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రజలకు శుభాకాంక్షలు" అంటూ సీఎం చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు.

## పునర్విభజనతో మరిన్ని అవకాశాలు

పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులతో మంగళవారం విజయవాడలో సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నియోజక వర్గాల పునర్విభజన నిర్ణయం వల్ల రాష్ట్రంలో అసెంబ్లీతోపాటు పార్లమెంట్ స్థానాలు పెరుగుతాయి. ఇప్పుడున్న నియోజకవర్గాలను 50 శాతం పెంచాలన్న కేంద్రం నిర్ణయం హర్షణీయం. కేంద్రం నిర్ణయంతో 88 అసెంబ్లీ సీట్లు, 12 వరకు పార్లమెంట్ సీట్లు కొత్తగా పెరుగుతాయి. అంటే కొత్తగా 100 మంది ప్రతినిధులను చట్ట సభలకు పంపించే అవకాశం వచ్చింది. దీనిని దృష్టిలో పెట్టుకొని డీలిమిటేషన్ ఎక్కడా దుర్వినియోగం కాకుండా చూసే బాధ్యత మనపై ఉంది. డీలిమిటేషన్ పై జనసేన ఏ విధంగా ముందుకు వెళ్లాలి? ఎటువంటి కార్యాచరణ అవలంబించాలి? అనే అంశాలపై సూచనలు చేయడానికి శాసనసభ్యులతో కూడిన కమిటీ నియమించాలని పార్టీ పీఏసీ ఛైర్మన్ శ్రీ నాదెండ్ల మనోహర్ గారికి సూచిస్తున్నాను. ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా డీలిమిటేషన్ పై పార్టీ కార్యాచరణ నిర్దేశిరచుకుందాం. కొద్ది నెలల్లో రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు రానున్నాయి. కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు పని చేయాలి. క్షేత్రస్థాయిలో కూటమి పార్టీలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలి. ఏ ఎన్నిక జరిగినా గెలుపే లక్ష్యంగా కష్టపడాలి. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో అభిలషణీయమైన సంఖ్యలో గెలుపొందడం మన శ్రేణుల పోరాట పటిమకు నిదర్శనం. వచ్చే స్థానిక పోరులో గెలుపే లక్ష్యంగా సిద్ధంగా ఉండాలి. పార్టీ బలంగా ఉంటేనే ప్రజా ప్రతినిధులు బలంగా ఉంటారు. దానిని దృష్టిలో పెట్టుకొని పార్టీ బలోపేతానికి ప్రజా ప్రతినిధులు ముందుండి పని చేయాలి. ఉద్యమి సభ్యత్వం ఎంత అధికంగా ఉంటే పార్టీ అంత బలంగా ఉంటుంది. ప్రజాప్రతినిధులు ఎన్నికల ముందు వివిధ వర్గాలు ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారస్తులు, రైతులు, కార్మికులు, కర్షకులు, మహిళలను ఏ విధంగా కలిసి ఓట్లను అభ్యర్థించామో... అదే విధంగా, అదే రీతిలో ఇప్పుడు కూడా నిరంతరం వారిని కలిసి వారి కష్టసుఖాలు తెలుసుకోవాలి. కొన్ని అసాధ్యమైన కోరికలు వ్యక్తమైనప్పటికీ సాధ్యాసాధ్యాలను వారి ముందు ఉంచితే వారి మనసులు గెలుచుకోవడం కష్టం కాదు. వారంలో ఏదో ఒక రోజు నియోజకవర్గంలో ఒక ప్రాంతంలో ప్రజల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించే కార్యక్రమాన్ని తప్పనిసరిగా చేపట్టాలి. వాటి పరిష్కారానికి కృషి చేయాలి. దీని కోసం పక్కాగా ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలి. నియోజకవర్గాల అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికతో దృష్టి పెట్టాలి. వ్యవసాయం, ఉద్యోగ, ఉపాధి, పరిశ్రమలు ఇలా అన్ని రంగాలపై దృష్టి సారించి అన్ని వర్గాల ప్రజలకు దగ్గరవ్వాలి. కులాలు లేకుండా సమాజం నడవదు. ప్రతి కులాన్ని గౌరవిస్తూ ముందుకు వెళ్లాలి. ప్రతి శాసనసభ్యుడు రాజకీయ వాస్తవికతకు దగ్గరగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి.

## ఇది తెలుగుదేశం పార్టీ 3.0 వెర్షన్.. మధ్యవర్తులు ఉండరు:

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో క్లస్టర్ ఇంఛార్జ్‌ల కోసం ఏర్పాటు చేసిన శిక్షణా తరగతుల్లో భాగంగా 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో ఆయన పాల్గొని దిశానిర్దేశం చేశారు. తెలుగుదేశం పార్టీని ఒక యూనివర్సిటీతో పోల్చిన లోకేశ్, ఎంతోమంది గొప్ప నాయకులను తయారుచేసిన కార్ఖానా అని అభివర్ణించారు. "తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, రెండో ముఖ్యమంత్రి కూడా మన తెలుగుదేశం యూనివర్సిటీ నుంచి వచ్చినవారే. గతంలో గండిపేటలో నిరంతరం శిక్షణా తరగతులు జరిగేవి. వాటి ద్వారా ఎంతోమంది ఉపముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలుగా ఎదిగారు. ఇప్పుడు ఏడాదికి కనీసం 300 రోజులు శిక్షణా తరగతులు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని వివరించారు. పదవులు ఇస్తున్నప్పటికీ, వారి బాధ్యతలేమిటో స్పష్టంగా చెప్పలేకపోతున్నామని, ఈ శిక్షణ ద్వారా ఆ లోటును భర్తీ చేస్తామని తెలిపారు.

**అహంకారం వద్దు.. ప్రజలు గమనిస్తున్నారు** 2024 ఎన్నికల్లో కూటమి సాధించిన చారిత్రక విజయాన్ని లోకేశ్ గుర్తుచేశారు. "2019 నుంచి 2024 మధ్య మనపై ఎన్నో దాడులు జరిగాయి. అక్రమ కేసులు బనాయించారు. దేవాలయం లాంటి పార్టీ కార్యాలయంపై దాడి చేశారు. చంద్రబాబు గారిని 53 రోజులు అన్యాయంగా జైల్లో నిర్బంధించారు. వీటన్నిటిపై ప్రజల్లో తిరుగుబాటు వచ్చింది. ఆ ఉద్యమ స్ఫూర్తితోనే దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 94 శాతం సీట్లు గెలిచాం. వైసీపీ అహంకారం వల్లే 11 సీట్లకు పరిమితమైంది. మనం ఆ తప్పు చేయకూడదు. నాకు రాష్ట్రంలో మూడో అత్యధిక మెజార్టీ వచ్చిందని అహంకారానికి పోను. ఇది నాపై బాధ్యతను పెంచింది. ప్రజలు అహంకారాన్ని సహించరని అందరూ గుర్తుంచుకోవాలి" అని హితవు పలికారు.

**పార్టీలో సరికొత్త సంస్కరణలు** పార్టీలో అంతర్గత సంస్కరణలపై లోకేశ్ కీలక ప్రకటనలు చేశారు. "పార్టీలో ఒకే వ్యక్తి ఒకే పదవిలో మూడుసార్లు కంటే ఎక్కువగా ఉండకూడదు. క్లస్టర్ ఇంఛార్జ్ స్థాయి నుంచి పొలిట్ బ్యూరో వరకు ఎదిగేలా మార్పులు తీసుకురావాలి. గ్రామ పార్టీ అధ్యక్షుడు కూడా పొలిట్ బ్యూరోలో కూర్చోవాలి. ఈ మార్పుల కోసం నేను నాలుగేళ్లుగా పోరాడుతున్నా. జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఇది నాకు నాలుగోసారి. ఈసారి ఆ బాధ్యత వద్దని, వేరేవారికి అవకాశం ఇవ్వాలని చంద్రబాబు గారిని కోరాను" అని తెలిపారు.

## అమరావతిలో వరుస అగ్నిప్రమాదాలు

మంగళవారం అనకాపల్లి జిల్లాలో ఆర్సెల్లార్ మిట్టల్ ఉక్కు పరిశ్రమకు భూమి పూజ ఘనంగా జరిగిందని.. దీన్ని చూసి ఓర్వలేక రాజధానిలో పైపులకు నిప్పు పెట్టారా? అనే అనుమానాలు రేకెత్తుతున్నాయని మంత్రి అనిత సందేహం వ్యక్తం చేశారు. గతంలో రాజధాని అమరావతి నిర్మాణాన్ని ఓర్వలేక అరటితోటకు నిప్పు పెట్టిన ఉదాహరణలు ఉన్నాయని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. ఈ ప్రమాదంపై పోలీసు శాఖ అన్ని కోణాల్లో విచారణ చేస్తోందని మంత్రి అనిత వివరించారు.

## చంద్రబాబుతో సంజయ్ దత్ భేటీ..

అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఫిల్మ్ సిటీ నిర్మాణానికి ఉన్న అవకాశాలను సీఎం వివరించారు. విశాఖపట్నం లాంటి నగరాల్లో బాలీవుడ్ సినిమాల షూటింగ్‌లకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, సింగిల్ విండో క్లియరెన్స్ విధానంపై సీఎం క్లారిటీ ఇచ్చారు. ఏపీ ప్రభుత్వం సినిమా రంగానికి ఇచ్చే ప్రోత్సాహకాలను సంజయ్ దత్ బృందం ఆసక్తిగా అడిగి తెలుసుకుంది. కేవలం నటుడిగానే కాకుండా, చిత్ర నిర్మాణ రంగంలో కూడా అనుభవం ఉన్న సంజయ్ దత్ బృందాన్ని ఏపీలో స్టూడియోలు లేదా పోస్ట్ ప్రొడక్షన్ యూనిట్లు ఏర్పాటు చేయాలని సీఎం ఆహ్వానించారు. సినిమా షూటింగ్‌లకు ఏపీని కేంద్రంగా చేయాలన్న ప్రభుత్వ ఆలోచనలు, ఉన్న అవకాశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. ఫిలిం స్టూడియోలు, ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ పరంగా ప్రణాళికలు ఉన్నామని సంజయ్ దత్‌కు ముఖ్యమంత్రి వివరించారు. తద్వారా సినిమా, వినోద రంగాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కలిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ముఖ్యమంత్రి సంజయ్ దత్‌ను కోరారు.

# దివ్యాంగులకు సేవా కార్యక్రమాలు





**నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో**

**బనగానపల్లి దివ్యాంగురాలికి మూడు చక్రాల సైకిల్ పంపిణీ**

**20 మంది దివ్యాంగులకు 16 వేల రూపాయల విలువ చేసే నెలవారీ మందుల పంపిణీ**

**పదిమంది దివ్యాంగులకు ఐఎంఏ హెల్త్ కార్డుల పంపిణీ**

**దివ్యాంగుల సేవలు నిరంతరం కొనసాగుతాయి: డాక్టర్ రవి కృష్ణ**

**నంద్యాల సిటీ బ్యూరో మార్చి 24 ( నంది పత్రిక )** నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో దివ్యాంగులకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, అధ్యక్షులు ఎం.పీ.వి. రమణయ్య ల నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో జి.పి.వెంకటస్వామి పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహకులు గుత్తి శ్రీహరి సౌజన్యంతో బనగానపల్లె కు చెందిన దివ్యాంగురాలు బాల సుబ్బమ్మ కు మూడు చక్రాల సైకిల్ ని అందజేశారు. నంద్యాలకు చెందిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ సుష్మ సౌజన్యంతో 20 మంది దివ్యాంగులకు నెలవారి మందులను పంపిణీ చేశారు. పదిమంది దివ్యాంగులకు ఐఎంఏ నంద్యాల హెల్త్ కార్డులను ఐఎంఏ నంద్యాల కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ, రమణయ్య మాట్లాడుతూ అవసరమైన దివ్యాంగులకు నెలవారి మందులు పంపిణీ, మూడు చక్రాల సైకిళ్లు,చక్రాల కుర్చీలు,వినికిడి యంత్రాలు,చంక కర్రలు వంటి ఉపకరణాలు అందజేసే సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఐఎంఏ నంద్యాల కార్యదర్శి డాక్టర్ మొహమ్మద్ రఫీ మాట్లాడుతూ గత 15 సంవత్సరాల కాలంలో నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం ద్వారా ఐఎంఏ హెల్త్ కార్డులను దాదాపు నాలుగు వేల మందికి అందజేశామని. ఈ కార్డుల ద్వారా నంద్యాల ఐఎంఏ వైద్యుల ఆసుపత్రులలో ఉచిత ఓ.పి.డి సేవలు పొందడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఈ హెల్త్ కార్డులు అవసరమైన వారు నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం లో సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతి ఏటా పబ్బు తులసి కృష్ణ పద్మశాలియ ట్రస్ట్ తరపున దివ్యాంగులకు ఒక కుట్టు మిషన్ అందజేస్తున్న పబ్బు తులసి కృష్ణ ను, నెల రోజులు ఉచిత ఓ పి డి సేవలు అందించి ఇకపై ప్రతి గురువారం పేద వారందరికీ ఉచిత ఓపిడి సేవలు అందిస్తామని ప్రకటించిన ప్రముఖ ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు, నంద్యాల ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ లను శాలువా జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంపీ వి రమణయ్య, ఐఎంఏ నంద్యాల కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ,లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, సభ్యులు రామయ్య, పబ్బు తులసి కృష్ణ, దివ్యాంగ లబ్ధిదారులు పాల్గొన్నారు.



## ఈ నెల 28న న్యూఢిల్లీ లో స్కోచ్ అవార్డు అందు కోనున్న వై ఎస్ ఆర్ కడప జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి.

**జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన "స్మార్ట్ కిచెన్ ప్రాజెక్ట్"**




**వై ఎస్ ఆర్ కడప, బ్యూరో చీఫ్ మార్చి 24 నంది పత్రిక** డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన,రుచికరమైన మధ్యాహ్న భోజనమును అందించేందుకు జిల్లాలో వినూత్నంగా చేపట్టిన స్మార్ట్ కిచెన్ విధానము ను జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రారంభించారు..

**ఈ స్మార్ట్ కిచెన్ విధానం ఒక మోడల్ గా ఉంటూ.. మన్ననలు పొందుతోంది** ఈ నేపథ్యంలో జిల్లాలో వినూత్నంగా అమలు చేస్తున్న స్మార్ట్ కిచెన్ ప్రాజెక్ట్ కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించి...ఈ ప్రాజెక్ట్ కు గాను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి గారు ప్రతిష్టాత్మకమైన స్కోచ్ అవార్డు కు ఎంపికయ్యారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడం,ఆహార భద్రతను పరిరక్షించడం, ఆధునిక యంత్రాలతో వంటశాల మరియు ఆటోమేషన్ వినియోగం, సాంకేతికత సమర్థ వినియోగం, సరైన నిధుల వినియోగం, పంపిణీలో పారదర్శకత వంటి అంశాల్లో ఈ ప్రాజెక్ట్ విశేష ప్రతిభను చూపింది. ఈ కృషి ని గుర్తించిన స్కోచ్ సంస్థ జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ను ప్రశంసించింది. 2026 మార్చి 28 న న్యూ ఢిల్లీ లోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో జరిగే 106 వ స్కోచ్ సమ్మిట్ అవార్డు ప్రదాన కార్యక్రమంలో భాగంగా వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి వారు. స్కోచ్ అవార్డును స్వీకరించ నున్నారు.. స్కోచ్ అవార్డు అనేది భారతదేశ అభివృద్ధికి దోహదపడే వ్యక్తులు,సంస్థలు మరియు ప్రాజెక్టులను గుర్తించడానికి స్వతంత్ర స్కోచ్ గ్రూప్ ఇచ్చే ఒక పురస్కారం..

## బుడగ జంగాల కాలనీ బాధితులకు మెరుగైన వైద్యం అందించండి

**మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశం**



**నంద్యాల సిటీ బ్యూరో మార్చి 24 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని వైయస్సార్ నగర్ బుడగ జంగాల కాలనీలో నిన్న రాత్రి చోటుచేసుకున్న ఫుడ్ పాయిజన్ ఘటన చాలా బాధాకరమని రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు . ప్రస్తుతం నెల్లూరు జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి ఫరూక్ ఘటన గురించి తెలిసిన వెంటనే అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి ఫరూక్ అధికారులను ఆదేశించారు. నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గారితో ఫోన్ లో మాట్లాడిన మంత్రి ఫరూక్ ఘటన తీవ్రతను అడిగి తెలుసుకొని, బాధితులకు అవసరమైన అన్ని సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మరియు విధుల్లో ఉన్న వైద్యులతో మాట్లాడి, చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ గారు మాట్లాడుతూ బాధితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. "ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. ఎవరికీ ఎటువంటి ప్రాణాపాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం," అని తెలిపారు . తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు వెంటనే స్పందించి, బాధితులకు అవసరమైన సదుపాయాలను కల్పించాలని మరియు వారికి ధైర్యం చెప్పాలని మంత్రి ఫరూక్ సూచించారు. ప్రజారోగ్యం విషయంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## క్షయవ్యాధిపై విస్తృత అవగాహనడ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం నిర్వహణ .




**వెలుగోడు, మార్చి 24 నంది పత్రిక:** స్టార్ యూత్ అసోసియేషన్ (ఎస్‌వైఏ) ఆధ్వర్యంలో, విహెచ్ఏ సంస్థ సహకారంతో ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ దాదావలి మాట్లాడుతూ క్షయవ్యాధి లక్షణాలు, వ్యాప్తి విధానం, నివారణ చర్యలపై మహిళలకు మరియు పొదుపు సంఘాల సభ్యులకు వివరిస్తూప్రపంచ ఆరోగ్య సంస్థ 2026 సంవత్సరానికి నిర్ణయించిన ఇతివృత్తం "అవును! మనం క్షయవ్యాధిని అంతం చేయగలం!" అనే సందేశాన్ని ప్రస్తావిస్తూ, బలమైన కార్యాచరణతో పాటు ఆధునిక ఆవిష్కరణలను వేగంగా స్వీకరించడం ద్వారా ఈ మహమ్మారిని ఎదుర్కోగలమని అన్నారు. స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న చర్యలను సభ్యులకు వివరించారు. ప్రతి సంవత్సరం మార్చి 24న ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని నిర్వహించటానికి గల కారణాన్ని కూడా వివరించి 1882లో డాక్టర్ రాబర్ట్ కోచ్ క్షయవ్యాధికి కారణమైన సూక్ష్మక్రిమి "మైకోబ్యాక్టీరియమ్ ట్యూబర్క్యులోసిస్"ను కనుగొన్న రోజును గుర్తు చేసుకుంటూ ఈ దినోత్సవాన్ని నిర్వహించారని తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం లక్షలాది మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు, 2030 నాటికి క్షయవ్యాధిని నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ కృషి చేస్తోంది. 2025 నివేదిక ప్రకారం భారతదేశంలో క్షయవ్యాధి కేసులు 21 శాతం తగ్గినట్లు, మరణాల రేటు కూడా తగ్గుతున్నట్లు తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న "ని-క్షయ్ పోషణ యోజన" పథకం ద్వారా క్షయవ్యాధి రోగులకు నెలకు రూ.500 సాయం అందిస్తూ, చికిత్సతో పాటు పోషకాహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటివరకు దాదాపు 24.5 లక్షల కేసులు నమోదు అయినట్లు తెలిపారు.అలాగే 100 రోజుల ప్రత్యేక క్యాంపు నిర్వహించి పాల్గొన్న ప్రాంతాలను గుర్తించి విస్తృతంగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వైఏ సంస్థ సిబ్బంది ఖాదర్ వలి, లక్ష్మి మరియు పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు



**బండి ఆత్మకూరు నంది పత్రిక మార్చి 24 :** పశువులకు వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్త చర్యగా బండి ఆత్మకూరు మండలంలో పశు వైద్య సిబ్బంది గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని చేపట్టారు. బి కోడూరు కడప గ్రామాలలో 550 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశువైద్యాధికారి జోష్ణ ఆహాలు సమీరా, ప్రసన్న, ఉమామహేశ్వరి, గోపాలమిత్రలు శివ శేఖర్ పాల్గొన్నారు. లింగాపురంలో 4 పశువులకు చిన్నదేవలాపురం గ్రామంలో 350 పశువులకు వ్యాధి నిరోధక టీకాలను వేయడం జరిగింది జేవివోలు లక్ష్మీనారాయణ సునీల్ కుమార్ సుధాకర్ రెడ్డి రమేష్ ఆహాలు శివశంకర్ రెడ్డి గోపాలమిత్రాలు శంకర్ తోపాటు ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

**నేడు లింగాపురంలో ఉచిత ఆరోగ్య శిబిరం** లింగాపురం గ్రామంలో బుధవారం మార్కెట్ యార్డ్ వారి సౌజన్యంతో ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. దీనితోపాటు ఫెర్టిలిటీ క్యాంపును కూడా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. మార్కెట్ యార్డ్ చైర్మన్, పశు సంవర్ధక సహాయ సంచాలకులు వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, పశుపోషకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పశు వైద్య అధికారులు విజ్ఞప్తి చేశారు.



## సిరివెళ్ల పోలీస్ స్టేషన్ సమీపంలో ఘర్షణ జిల్లా ఎస్పీని ఆశ్రయించిన బాధితులు





**శిరివెళ్ల :(నంది పత్రిక)** సిరివెళ్ల మండల కేంద్రంలోని సిరివెళ్ల పోలీస్ స్టేషన్ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన ఘర్షణ విషయంలో గాయపడ్డ బాధితులు నంద్యాల జిల్లా ఎస్పీ కార్యాలయంలో కలిసి అర్జీ ఇచ్చినట్లు బాధితులు నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో తెలిపారు.ఆళ్లగడ్డ మండలం బాచపల్లి గ్రామానికి చెందిన వంకెళ్ల పుల్లమ్మను అమే కుమారులను సంటోల్ల లింగమయ్య సంటోల్ల రామలింగం సంటోల్ల భాస్కర్ సంటోల్ల నవీన్ కిట్టు సంటోల్ల బుజ్జి పాములేటి సంటోల్ల జయమ్మ సంటోల్ల రోజా, సంటోల్ల నిర్మల, చంటోళ్ల నాగలక్ష్మి, అనసూయ, ఒంకెళ్ళ లింగమ్మ తదితరులు దాడి చేసి గాయపరిచి బెదిర చగా సిరివెళ్ల పోలీసులు నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు పేర్కొన్నారు. ఇద్దరు కుమారులు శిరివెళ్ల మండలం ఇసుకపల్లె గ్రామంలో ఒకే ఇంట్లో వివాహం చేసుకున్నారని తన కుమారులకు కోడళ్ళకు మనస్పర్ధలు వచ్చి సోమవారం సాయంత్రం సిరివెళ్ల పోలీస్ స్టేషన్లో పంచాయతీ ఉందని మాకు సిరివెళ్ల పోలీసులు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా తన ఇద్దరు కుమారులతో పాటు సిరివెళ్ల పోలీస్ స్టేషన్ కు వెళ్లినట్లు ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో వివరించారు. సిరివెళ్ల పోలీస్ స్టేషన్ లో ఎస్సై ఒకపక్క వివరాలు అడుగుతుండగానే మరోపక్క దాడికి ప్రయత్నించారని అన్నారు.సుమారు 12 మంది మూకుమ్మడిగా కాళ్లు చేతులతో విచక్షణ రహితంగా కొట్టారని సిరివెళ్ల పోలీస్ స్టేషన్ సమీపంలో ఇటుకలు ఉండగా ఇటుకలను తీసుకొని ఇటుకలతో చావబాదారని పు సృహ తప్పి పడిపోగా సిరివెళ్ల పోలీసు వారు 108 వాహనం ద్వారా స్థానిక ఆసుపత్రికి మరియు నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారన్నారు. నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నామని పంచాయతీ చేసి న్యాయం చెస్తారని పోలీస్ స్టేషన్ కు వెళితే పోలీస్ స్టేషన్ ఎదురుగానే దాడి చేయడం అన్యాయమని అన్నారు. రక్షణ కల్పించి న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ గారికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

### ధర్మ రక్షణకు శంకరాచార్యుల 'చతురంగిణి సేన'..

జ్యోతిష్పీఠం శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సంచలన ప్రకటన చేశారు. హిందూ ధర్మం, గోవుల రక్షణ కోసం 2 లక్షల 18 వేల మంది సైనికులతో 'చతురంగిణి సేన'ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వారణాసిలో ఆయన ఈ ప్రకటన చేశారు. కుల, మత, లింగ భేదాలు లేకుండా ఎవరైనా ఈ సైన్యంలో చేరవచ్చని ఆయన స్పష్టం చేశారు.

## ఎలక్టర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి తీసుకొని రావాలి

**జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**




**కర్నూలు, నంది పత్రిక....**ఎలక్టర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ నుండి ఎలక్టర్ల మ్యాపింగ్ ప్రక్రియ అంశం పై ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్టర్ల మ్యాపింగ్ ప్రక్రియ ఆదోని, పాణ్యం, కర్నూలు నియోజకవర్గాల్లో నెమ్మదిగా సాగుతోందని, వేగవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. సంబంధిత నియోజకవర్గాల తహసిల్దార్ లు, బిఎల్ఓ లతో సమావేశం నిర్వహించుకుని మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి తీసుకొని రావాలని కలెక్టర్ తహసిల్దార్ లను ఆదేశించారు. ఆలూరు, కోడుమూరు లాంటి నియోజకవర్గాలు మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి బాగా తీసుకొని వచ్చారని, మిగిలిన నియోజకవర్గాల్లో కూడా అదే విధంగా పురోగతి తీసుకురావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా క్లెయిమ్స్, డెమోగ్రాఫిక్ కరెక్షన్ కి సంబంధించిన వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, తహసిల్దార్ లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం





**కర్నూలు నంది పత్రిక......** ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా డాక్టర్ ఎల్. భాస్కర్, జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ అధికారి మరియు జిల్లా కుష్టు ఎయిడ్స్ & క్షయ అధికారి, కర్నూలు ప్రప్రథమంగా ఆకుపచ్చ జెండాను ఊపి ర్యాలీ ద్వారా క్షయ వ్యాధి దినోత్సవాన్ని ప్రారంభించారు. ఈ ర్యాలీ స్థానిక కలెక్టరేట్ సముదాయము నందు గౌరవనీయులైన ఎం.కే. గాంధీ విగ్రహం నుండి కర్నూల్ మెడికల్ కాలేజీ ప్రాంగణంలోని న్యూ క్లినికల్ లెక్చర్ గ్యాలరీ వరకు కొనసాగింది. అనంతరం క్షయ వ్యాధి దినోత్సవ కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ కె. చిట్టి నరసమ్మ, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్, డాక్టర్ కే. వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కర్నూలు, డాక్టర్ సీ.ఎస్.కె. ప్రకాష్, సూపరింటెండెంట్, స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్, కర్నూలు, డాక్టర్ ఎల్. భాస్కర్, జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ అధికారి మరియు జిల్లా కుష్టు ఎయిడ్స్ & క్షయ అధికారి, కర్నూలు, డాక్టర్ ఎస్.ఎండి. జఫ్రుల్లా, డి.సి.హెచ్.ఎస్, కర్నూలు, డాక్టర్ పి. మోక్షేశ్వరుడు, విశ్రాంత జిల్లా క్షయ నివారణ అధికారి, డాక్టర్ సి. శ్రీనివాసరెడ్డి, ప్రెసిడెంట్, సేవా భారతి సంస్థ, డాక్టర్ ఏ.ఎస్. శ్రీకాంత్, హెచ్.ఓ.డి. పల్మనాలజీ, డాక్టర్ జి. మల్లికార్జున రెడ్డి, జిల్లా న్యూక్లియస్ వైద్యాధికారి, కర్నూలు మెడికల్ కాలేజీ, హాస్పిటల్ సిబ్బంది మరియు జిల్లా టీబీ కేంద్రం సిబ్బంది, ప్రభుత్వ మరియు ప్రైవేటు నర్సింగ్ కళాశాలల బృందం, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ ముందుగా క్షయ వ్యాధిని కనుగొన్న శాస్త్రవేత్త అయిన డాక్టర్ రాబర్ట్ కాక్ యొక్క చిత్రపటానికి పూలమాలలను అలంకరించి జ్యోతి ప్రజ్వలన గావించారు. తరువాత క్షయ వ్యాధిపై అవగాహన సదస్సును ప్రముఖులు ప్రారంభించారు.క్షయ వ్యాధి గురించి ఉపేక్షిస్తూ ప్రజలు క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రారంభ దశలోనే క్షయ వ్యాధిని నిర్ధారించే పరీక్షలో కర్నూలులో నందు మొదటి స్థానంలో ఉందని ఈ సందర్భంగా ప్రముఖులు వ్యాధిపై సలహాలు, సూచనలు మరియు వ్యాధిపై తగిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి, డాక్టర్ ఎల్. భాస్కర్ గారు వ్యాధిపై ప్రత్యేక ప్రసంగాన్ని అందించారు. అనంతరం డాక్టర్ కె. చిట్టి నరసమ్మ, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్, డాక్టర్ కే. వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కర్నూలు, డాక్టర్ సీ.ఎస్.కె. ప్రకాష్, సూపరింటెండెంట్, స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్, కర్నూలు, డాక్టర్ ఎల్. భాస్కర్, జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ అధికారి మరియు జిల్లా కుష్టు ఎయిడ్స్ & క్షయ అధికారి, కర్నూలు, డాక్టర్ ఎస్.ఎండి. జఫ్రుల్లా, డి.సి.హెచ్.ఎస్, కర్నూలు, డాక్టర్ పి. మోక్షేశ్వరుడు, విశ్రాంత జిల్లా క్షయ నివారణ అధికారి, డాక్టర్ సి. శ్రీనివాసరెడ్డి, ప్రెసిడెంట్, సేవా భారతి సంస్థ, డాక్టర్ ఏ.ఎస్. శ్రీకాంత్, హెచ్.ఓ.డి. పల్మనాలజీ, పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ విజయ్ ఆనంద్ బాబు మాట్లాడారు.టీ.బి. ముక్త్ పంచాయత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి 1000 మంది జనాభాలో 30 మంది జనాభా కు క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిగి ఒకటి లేదా అంతకన్నా తక్కువ కేసులు కలిగి ఉన్న పంచాయతీలలో జిల్లావ్యాప్తంగా 2025 వ సంవత్సరాలలో టీ.బి. ముక్త్ పంచాయత్ క్రింద ఎన్నికైన 40 గ్రామపంచాయతీల యొక్క సర్పంచులకు కూడా ప్రత్యేక బహుమతులను ప్రధానం చేశారు. ఈ బహుమతులను హాజరైనటువంటి ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఇచ్చారు.అనంతరం ఈ క్షయవ్యాధి వారోత్సవాల సందర్భంగా నిర్వహించినటువంటి కార్యక్రమాలలో భాగంగా క్విజ్ మరియు వ్యాసరచన పోటీలలో పాల్గొన్నటువంటి పీ.జీ. మరియు ఎం.బీ.బీ.ఎస్. (యు.జి) కోర్సులలో కర్నూలు వైద్య కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నటువంటి విద్యార్థులకు మరియు మరియు వైద్య ఆరోగ్యశాఖలో పనిచేయుచున్నటువంటి అన్ని రకాల స్థాయిలలో ఉన్నటువంటి సిబ్బంది అందరికీ ఉత్తమ బహుమతులను ప్రధానం చేశారు.

**క్షయ నినాదం-2026:** అవును! మనమందరం క్షయను అంతమొందిస్తాం – " భారత్ నేతృత్వంలో, జనభాగిదారి ద్వారా అందించబడింది".ఇంతటితో ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని జయప్రదం చేశారు.

## రైతే రాజు కావాలన్నదే ప్రభుత్వ సంకల్పం: ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి



**నందిపత్రిక -ప్యాపిలి** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకున్నప్పుడే ఆర్థికాభివృద్ధి సాధ్యమని డోన్ ఎమ్మెల్యే శ్రీ కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం ప్యాపిలి మండలం అలేబాద్ గ్రామంలో నిర్వహించిన "రైతన్న మీకోసం" అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రైతే రాజు కావాలన్నది తమ సంకల్పమని స్పష్టం చేశారు.

**నేరుగా రైతుల ఖాతాల్లోకే సాయం** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందిస్తున్న పెట్టుబడి సాయం ఎక్కడా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకే చేరుతోందని ఆయన వివరించారు. దీనివల్ల రైతులకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. సాగులో మెరుగైన ఫలితాల కోసం రైతులు పాటించాల్సిన పంచసూత్రాలపై ఎమ్మెల్యే అవగాహన కల్పించారు. రాయితీపై ప్రభుత్వం అందించే ధృవీకరించిన విత్తనాల మోతాదుకు మించి పురుగుమందులు వాడకుండా జాగ్రత్త వహించడం. అందుబాటులో ఉన్న వనరులను పొదుపుగా వాడుకోవడం.దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వ వేదికల ద్వారా మద్దతు ధర పొందడం.రాయితీ విత్తనాలు, ఎరువుల పంపిణీలో ఎక్కడా జాప్యం జరగకూడదని, వ్యవసాయ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి సాగు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. "దళారులను నమ్మి మోసపోవద్దు, ప్రభుత్వం కల్పించిన వేదికల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోండి" అని రైతులకు పిలుపునిచ్చారు.

**గిరిజన పాఠశాల సందర్శన**అనంతరం ఎమ్మెల్యే అలెబాద్ తాండాలోని గిరిజన పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని వసతులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి విద్యా ప్రమాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, నాయకులు సుదర్శన్, హార్టికల్చర్ ఆఫీసర్ కల్యాణి, అగ్రికల్చర్ ఆఫీసర్ రాజేష్, మండల వ్యవసాయ అధికారులు, స్థానిక నాయకులు,అలేబాద్ గ్రామ రైతులు పాల్గొన్నారు.



# నేర నియంత్రణలో రాజీ పడవద్దు .





**నేర నియంత్రణే లక్ష్యంగా పోలీసులు సమర్థవంతంగా పనిచేయాలి.**

**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ .**

**డ్రోన్ కెమెరాలతో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలి.**

**డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ ల పై ప్రత్యేక దృష్టి సారించాలి .**

**పెండింగ్ కేసుల దర్యాప్తులను పకడ్బందీగా చేయాలి.**

**పోలీసు అధికారులతో నెల వారి నేర సమీక్షా సమావేశం .**

**కర్నూలు నంది పత్రిక.....** నేర నియంత్రణలో రాజీ పడకుండా నేర నివారణే ప్రథమ లక్ష్యంగా పని చేయాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ పోలీసు అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైల తో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులతో మాట్లాడుతూ...జిల్లాలో నేర నియంత్రణను కట్టుదిట్టం చేయాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ ల పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ప్రజల ఫిర్యాదులను సమగ్రంగా పరిశీలించి ప్రాధాన్యత కేసులను 7 రోజుల్లో పరిష్కరించాలన్నారు.రాత్రి గస్తీలు , విజిబుల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలన్నారు.రౌడీ షీటర్ల పై నిఘా ఉంచాలన్నారు.మొబైల్ రికవరీ, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళల భద్రతపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మార్చి 28 నుంచి క్రికెట్ బెట్టింగ్ పై నిఘా ఉంచాలన్నారు.డ్రోన్ కెమెరాలతో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తులను పకడ్బందీగా చేయించాలన్నారు.గత నెలలో వివిధ కేసులలో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ నేర సమీక్ష సమావేశంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డిఎస్పీలు వెంకట్రామయ్య , ఉపేంద్రబాబు, భార్గవి , సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



## విశ్వబ్రాహ్మణుల పలు సమస్యలను పరిష్కరించండి



**కర్నూలు నంది పత్రిక...**విశ్వబ్రాహ్మణుల పలు సమస్యలను పరిష్కరించండి అని విజయవాడ బీసీ మినిస్టర్ సవితమ్మ ని వారి క్యాంప్ ఆఫీసు నందు మర్యాదపూర్వకంగా కలిసి విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణస్వీకారానికి ఆహ్వానించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మ అనంతరం విశ్వబ్రాహ్మణుల పలు సమస్యలను మంత్రిగారికి వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తునికిపాటి శివ సుతారు రాఘవేంద్ర , తదితరులు పాల్గొనడం జరిగింది...



# ఇళ్ల లేని వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: సీపీఐ

**- మండల కార్యదర్శి కేత్ం వెంకట్ శివుడు యాదవ్**

**కొత్తపల్లి - నంది పత్రిక:** రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు తక్షణమే ఇవ్వాలని లేనిపక్షంలో ప్రభుత్వ స్థలాల్లో ఎర్రజెండాలతో గుడిసెలు నిర్మించుకుంటామని మండల కార్యదర్శి కేత్ం వెంకట్ శివుడు యాదవ్ అన్నారు. మంగళవారం ఇళ్ల స్థలాల సాధనకై రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సిపిఐ ఆధ్వర్యంలో కొత్తపల్లె తాహసిల్దార్ కార్యాలయం లో డిప్యూటీ తహసిల్దార్ అరుణ కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు గూడు పట్ల కక్షపూరితంగా వ్యవహరించడం తగదని ఇల్లు నిర్మించి తాళాలు ఇస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని వాటిని వెంటనే తీర్చాలని డిమాండ్ చేశారు ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేయాలని భూమిలేని నిరుపేదలకు సాగు భూమి పంపిణీ చేయాలని జీవో ఎంఎస్ నెంబర్ 23 సడదించాలని భూ మాఫియాని అరికట్టాలని అర్హులైన పేద ప్రజలకు రేషన్ కార్డులు పింఛన్లు ఇండ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని మరియు కొత్తపల్లె మండలం ప్రతి గ్రామంలో స్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని సిపిఐ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు అమలు చేయాలన్నారు ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాలెం. నాగిరెడ్డి, భీమ లింగం, ఓబులేసు, లింగమయ్య, అంజి, గోవిందు,వెంకట్ లింగం, వెంకటేశ్వర్లు, మహేష్, లింగస్వామి నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు పాపారావు లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌ను నక్సల్ రహితంగా మారుస్తామని ప్రభుత్వం విధించుకున్న గడువుకు వారం రోజుల ముందే ఒక చారిత్రక పరిణామం చోటుచేసుకుంది. బస్తర్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న చివరి అగ్రశ్రేణి మావోయిస్టు కమాండర్ పాపారావు అలియాస్ సున్నం చంద్రయ్య అలియాస్ మంగు తన సాయుధ బృందంతో సహా పోలీసులకు లొంగిపోయాడు. ఈ పరిణామం మావోయిస్టు ఉద్యమానికి గట్టి ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. 56 ఏళ్ల పాపారావు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో సీనియర్ సభ్యుడు. ఇతను బీజాపూర్ జిల్లాలోని కుట్రు పోలీస్ స్టేషన్‌లో 17 మంది అనుచరులతో (10 మంది పురుషులు, 8 మంది మహిళలు) కలిసి లొంగిపోయాడు. వీరి నుంచి 8 ఏకే-47 రైఫిళ్లు, ఒక ఎస్ఎల్ఆర్, ఒక ఇన్సాస్ రైఫిల్‌ను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. పాపారావు తలపై రూ.2 కోట్ల రివార్డు ఉంది. హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత బస్తర్‌లో మోస్ట్ వాంటెడ్ నక్సలైట్‌గా పాపారావు ఉన్నాడు. అతడిపై 50 కేసుల వరకు ఉన్నాయి. సుక్మా జిల్లా కలెక్టర్ ను కిడ్నాప్ చేసిన ఘటనలోనూ, గతంలో 76 మంది భద్రతా సిబ్బందిని బలిగొన్న ఘటనలోనూ పాపారావు హస్తం ఉందని భావిస్తున్నారు.

# వేసవిలో జాగ్రత్తగా విధులు నిర్వహించండి.







## కమిషనర్ ఎన్.మౌర్య.

**తిరుపతి చీఫ్ బ్యూరో చీఫ్ మార్చి 24 నంది పత్రిక** వేసవిలో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తగా విధులను నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పారిశుధ్య సిబ్బందికి సూచించారు. వేసవిలో ఉద్యోగులు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుపుతూ, ఓఆర్ఎస్ పాకెట్లను కమిషనర్ ఎన్.మౌర్య, జిల్లా మెడికల్ ఆఫీసర్ బాలకృష్ణ నాయక్, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ పారిశుధ్య కార్మికులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేసవి ప్రారంభం అయ్యిందని జాగ్రత్తగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఎండలో ఎక్కువ సమయం ఉండకుండా, విధుల సమయాల్లో కూడా మార్పు చేశామని తెలిపారు. ఉదయం త్వరగా విధులకు హాజరై, సాయంత్రం చల్లని సమయంలో పనిచేయాలని తెలిపారు. మీకు ఇచ్చే ఓఆర్ఎస్ పాకెట్లను కాచి ఓడపోసి, చల్లార్చిన నీటిలో కలిపి ఒక రోజులోనే తాగాలని తెలిపారు. ఓఆర్ఎస్ కలిపిన నీరు మరుసటి రోజు త్రాగవద్దని సూచించారు. ఏదైనా అలసట వస్తే చల్లని ప్రదేశాల్లో సేదతీరాలని తెలిపారు. అస్వస్థత కు గురైతే వెంటనే డాక్టర్ ను సంప్రదించాలని తెలిపారు. నగరంలో ప్రజలకు వేసవి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వీధి కుక్కల ఆహారం అందించే ప్రాంతాల్లో కూడా నీటి వసతి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు ఎండ తీవ్రత వల్ల ఇబ్బంది లేకుండా తగు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా అందజేసేందుకు ఓఆర్ఎస్ పాకెట్లు సిద్ధంగా ఉంచామని తెలిపారు. అందులో భాగంగానే నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు పాకెట్లు పంపిణీ చేశామని తెలిపారు. ఎండల వలన, వడదెబ్బ రాకుండా, వస్తే తీసుకోవాల్సిన జాగ్రతలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ వైద్యులు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడి చేస్తే కఠిన చర్యలు

## కమిషనర్ ఎన్.మౌర్య.



**తిరుపతి బ్యూరో చీఫ్ చీఫ్ మార్చి 24 నంది పత్రిక** విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య హెచ్చరించారు. మొండి బకాయిల పన్నుల వసూళ్లలో భాగంగా వసూలుకు వెళ్లిన నగరపాలక సంస్థ సచివాలయ ఉద్యోగి పి.నాగార్జున పై దాడి చేయడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగిపై దాడి చేసిన సి.ఎన్.ప్రింటర్స్ యజమాని వసంత కుమార్ పై పోలీస్ కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆస్థి పన్ను వడ్డీ పై 50శాతం రాయితీ ప్రకటించింది. ఈ విషయాన్ని అన్ని సచివాలయాల ఉద్యోగులు ప్రజలకు తెలియజేస్తున్నారు. అందులో భాగంగా ప్రకాశం రోడ్డు లోని సి.ఎన్.ప్రింటర్స్ వారు మూడు సంవత్సరాల నుండి 1, 44,658 రూపాయల బకాయి ఉన్నారు. వడ్డీ పై 50 శాతం తగ్గిస్తే 1,25,820 రూపాయలు చెల్లించాలనే విషయాన్ని తెలియబరిచేందుకు మంగళవారం సచివాలయ కార్యదర్శి నాగార్జున ప్రింటర్స్ వద్దకు వెళ్లి వడ్డీ తగ్గింపు తెలియజేశారు. యజమాని వసంత కుమార్, తదితరులు విధి నిర్వహణలో భాగంగా వెళ్లిన ఉద్యోగి చెప్పిన మాటలు వినకుండా మమ్మల్నే బిల్లు కట్టమంటావా అంటూ దాడి చేశారు. కమిషనర్ కు సమాచారం అందిచడంతో పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయించి, కేసు నమోదు చేయడం జరిగింది. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఎన్.మౌర్య హెచ్చరించారు.

# ఇల్లు అయిన చూపండి..! అద్దెనైనా కట్టండి.







**పేదలకు గ్రామాలలో 3 సెంట్లు, పట్టణాలలో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి.**

**ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలి**

**అద్దె గృహాలలో ఉండే పేదలకు ప్రభుత్వమే అద్దె చెల్లించాలి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) డిమాండ్.**

**తహసిల్దార్ నాగమణి గారికి వినతి పత్రం అందజేత.**

**బేతంచెర్ల మార్చి 24 ( నందిపత్రిక ).** నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి,ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలి, లేకుంటే అద్దె గృహాలలో ఉండే పేదల అద్దెను ప్రభుత్వమే చెల్లించాలని, భారత కమ్యూనిస్టూ పార్టీ ( సిపిఐ ) రాష్ట్ర సమితి పిలుపు మేరకు,బేతంచెర్ల పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి భార్గవ్.యన్న ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించి, అనంతరం తహసిల్దార్ నాగమణికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారుఅనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న,సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ, పట్టణ పేదలకు నివాసయోగ్యంగా ఉండే ప్రాంతాలను గుర్తించి గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు ఇంటి పట్టాలను మంజూరు చేయాలని, పేదల ఇళ్ళు నిర్మాణానికై సిమెంటు, ఇసుక, ఇనుము, ఇటుక, కంకర, ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని, ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా 5 లక్షల చొప్పున మంజూరు చేయాలని, లేనియెడల అద్దె గృహాలలో నివాసం ఉన్న పేద కుటుంబాలకు అద్దెను ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు ఇప్పటికే గత ప్రభుత్వంలో ఇచ్చిన లేఅవుట్లను మార్పు చేసి ఇవ్వాలని రోడ్లు, విద్యుత్తు, త్రాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి నిరుపేదలైన అర్హులందరికీ న్యాయం చేయాలన్నారు, పాలకుల నిర్లక్ష్యానికి పేద ప్రజలు ఏళ్లకు ఏళ్ళు బలవుతూనే ఉన్నారని బలహీనుల పైన బలవంతులు అధికారం చెల్లాయిస్తే భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు ఇల్లు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేంతవరకు పోరాటం కొనసా గుతుందని తెలిపారు ముఖ్యమంత్రి అధికారంలోకి రాక ముందు పేదల గురించి మాట్లాడుతాడు కానీ, అధికారంలోకి వచ్చాకా వారి గురించి పట్టించుకోడం లేదని ఆరోపించారు. అనంతరం తహసీల్దారు నాగమణి స్పందించి,రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి అర్హులందరికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి డి.దస్తగిరి, సీనియర్ నాయకులు ఎర్రగుడి రాముడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు రామచంద్రుడు, సిపిఐ నాయకులు మధు, భాస్కర్, ఖదీర్, శ్రీరాములు, సోమన్న, నాగేశ్వరరావు, సుబ్బరాయుడు, బాలు, రాము, పుల్లయ్య, రాముడు, పెంచలయ్య, గోపి, బుజ్జి, పెద్ద పుల్లయ్య, విష్ణు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# తలసేమియా చిన్నారులకై స్వచ్ఛంద రక్తదానం...

## విష్ణ హాస్పిటల్ 1వ వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటు.. అనంతరం మార్చి 30వ తేదీన తలసేమియా చిన్నారులకై ఫండ్ రైసింగ్ ప్రోగ్రాం పోస్టర్ విడుదల..




**నంద్యాల మార్చి 24 నంది పత్రిక:** నంద్యాల పట్టణం లోని విష్ణ హాస్పిటల్ నందు మంగళవారం నాడు తలేసేమియా చిన్నారుల కోసం స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.విష్ణ హాస్పిటల్ మొదటి వార్షికోత్సవ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యం తలసేమియా చిన్నారుల కోసం స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి రక్తదానం చేశారు.విష్ణ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, ఆర్థోపెడిక్ డాక్టర్.జె.వికాస్ స్వయంగా రక్తదానం చేశారు.అలాగే హాస్పిటల్ సిబ్బంది మరియు యువకులు రక్తదానం శిబిరంలో పాల్గొన్నారు.అనంతరం మార్చి 30వ తేదీన జరిగే ఫన్ రైసింగ్ ప్రోగ్రాం పోస్టర్ ను విడుదల చేశారు.ఈ ప్రోగ్రాం నందు 5560 విలువగల పరీక్షలు మరియు డాక్టర్స్ కన్సల్టేషన్ ను కేవలం 499 రూపాయలకే అందిస్తున్నామని తెలిపారు.అలగే ఫండ్ రైసింగ్ ప్రోగ్రాం కు వచ్చిన నగదు మొత్తాన్ని తలసేమియా చిన్నారుల పౌష్టికార్థం మరియు మందులు,ఇతర ఖర్చులకి వారి కుటుంబాలకు అందజేస్తామని విష్ణ హాస్పిటల్ డా.జె.వికాస్ మరియు యాజమానం తెలిపారు.ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు విష్ణ హాస్పిటల్ రాబోయే రోజుల్లో చేనుందని తెలిపారు.నంద్యాల బ్లడ్ బ్యాంక్ సెంటర్ బ్లడ్ అచ్యుత్ మాట్లాడుతూ విష్ణ హాస్పిటల్ నంద్యాలలో ఎంతో సేవా కార్యక్రమాలలో పేరుగాస్తుందని,పట్టణ ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని కొనియాడారు.ఇలాంటి సేవలు చేస్తున్నందుకు మరియు తలసేమియా చిన్నారుల కోసం తమ వంతు సాయం అందిస్తున్నందుకు విష్ణ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా.వికాస్ కు మరియు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విష్ణ హాస్పిటల్ డా.వికాస్,డా.కృష్ణ సాహితీ,డా.వెంకట మనోహర్,హాస్పిటల్ జనరల్ మేనేజర్ కరీం,బ్లడ్ అచ్యుత్,బ్లడ్ ప్రవీణ్ మరియు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు .

# "క్షయ వ్యాధి పై వ్యాసరచన క్విజ్ పోటీలు"..

**కర్నూలు నంది పత్రిక....**కర్నూలు మెడికల్ కాలేజీ, కర్నూలు ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవం దేశాల ఆధ్వర్యంలో, ప్రజల శక్తితో క్షయాన్ని అంతం చేయవచ్చు" అనే థీమ్‌తో మంగళ 5వారం (మార్చి 24, 2026) కర్నూలు మెడికల్ కాలేజీలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కమ్యూనిటీ మెడిసిన్ విభాగం, పల్మనరీ మెడిసిన్ విభాగం మరియు సంయుక్త ఆధ్వర్యంలో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం వ్యాస రచన పోటీ నిర్వహించగా మొత్తం 63 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో అక్షయ పి (ఫైనల్ ఇయర్ పార్ట్ ×) ప్రథమ స్థానం, అలేఖ్య పి ద్వితీయ స్థానం, తేజశ్రీ (ఫస్ట్ ఇయర్ ఎంబిబిఎస్ తృతీయ స్థానం సాధించారు.అలాగే అన్ని విభాగాల పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం క్విజ్ పోటీ నిర్వహించబడింది. ఈ క్విజ్ పోటీలో టీమ్-ా (డా. సాయి సౌమ్య , డా. జి. శ్రీలక్ష్మి , డా. నిలోఫర్ భాను పాథాలజీ, డా. రూపకీర్తి పల్మనరీ మెడిసిన్, డా. సాయి స్వేత జనరల్ మెడిసిన్, డా. ఆర్. నవ్య రేడియోడయాగ్నోసిస్, డా. సరసుస్మిత, డా. ఆప్తాల మాల జి, డా. సాయి లాస్య రేడియాలజీ) ప్రథమ బహుమతి సాధించారు.ద్వితీయ బహుమతిని డా. సబీహా , డా. మంజుశ్రీ (పాథాలజీ), డా. నాగారిషిత్ (జనరల్ మెడిసిన్), డా. హరిప్రియా (పల్మనరీ మెడిసిన్) బృందం గెలుచుకుంది.ఈరోజు క్షయ నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఇటీవల నిర్వహించిన వ్యాస రచన మరియు క్విజ్ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయబడింది. ఈ సందర్భంగా విజేతలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్స్ ఇండియా శుభప్రదలు వారిని అభినందించడం జరిగింది. క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని, సమాజంలో అవగాహన పెంపొందించడంలో యువత కీలక పాత్ర పోషించాలని ప్రిన్సిపల్ సూచించారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్, పల్మనరీ మెడిసిన్ విభాగాల అధ్యాపకులు, వైద్యులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# విధుల్లో ఎందుకంత నిర్లక్ష్యం..



**నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అసహనం**

**రహదారుల విస్తరణల్లో జాప్యం తగదు**

**సి & డి వేస్ట్ మేనేజ్మెంట్ పటిష్టం చేయాలి**

**కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**కర్నూలు నంది పత్రిక.....** విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించడం సహించబోమని, రహదారుల విస్తరణ పనుల్లో ఆశించిన పురోగతి కనబడటం లేదని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో పట్టణ ప్రణాళిక విభాగ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రహదారుల విస్తరణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ, ఆ పనుల్లో నిర్లక్ష్యం కనిపించడం ఆందోళనకరమన్నారు. సదరు విధుల్లో నిమగ్నమైన సిబ్బందికి ఇతర పనుల నుంచి మినహాయింపులు ఇచ్చినా, పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడం సరికాదన్నారు. కిడ్స్ వరల్డ్ నుంచి బుధవారపేట బ్రిడ్జి వరకు అలాగే దామోదరం సంజీవయ్య కూడలి నుంచి ఎస్ఎస్ గార్డెన్స్ వరకు రహదారుల విస్తరణలకు సంబంధించి టిడిఆర్‌ల జారీని వేగవంతం చేయాలని ఆదేశించారు.న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో కౌంటర్లు దాఖలు చేయడం, రిట్ పిటిషన్లపై చర్యలు తీసుకోవడం, కోర్టు తీర్పులను అమలు చేయడం వంటి అంశాల్లో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సి & డి వేస్ట్ మేనేజ్మెంట్ విధానాన్ని క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేయాలని, భవన కూల్చివేతదారులకు ముందస్తు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో, గడువు అనంతరం అనధికార లేఔట్లపై తీసుకునే చర్యలను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇంచార్జీ సిటి ప్లానర్ వై.వెంకటరమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, ప్లానింగ్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



# నంద్యాల కూరగాయల మార్కెట్ వేలం పాటలపై రాజకీయ నాయకుల దృష్టి.

**వేలం పాటలపై కన్నేసిన" ఆళ్లగడ్డ " ప్రాంతం బడా రాజకీయ నాయకులు.**
**ముగ్గురు ప్రధాన రాజకీయ నాయకుల అనుచరులు వేలం పాటల్లో పాల్గొననున్నారా.**
**వేలం పాటలు సిండికేట్ కు చెక్ పడనుందా.**
**వేలం పాటలు జరిగితే అభివృద్ధికి ఆస్కారం.**
**ఈ రోజు వేలం పాటలు వాయిదా...రేపు వేలం పాటల్లో ఏమిజరగనుంది.**
**మున్సిపల్ ఎన్నికలు టార్గెట్ గా మార్కెట్ వేలం పాటలు టార్గెట్ గా ఆళ్లగడ్డ నాయకులు పావులు కదుపుతున్నారా.**
**వేలంపాటలో ఆళ్లగడ్డ కు చెందిన నాయకుల అనుచరవర్గం పాల్గొంటారా లేదా అనేది అందరిలో టెన్షన్,టెన్షన్.**

నంద్యాల సిటీ బ్యూరో మార్చి 24 ( నంది పత్రిక ) నంద్యాల కూరగాయల మార్కెట్ వేలం పాటలు ఆసక్తి రేపుతున్నాయి.మార్కెట్ వేలం పాటలకు రాజకీయం రంగు పులుముకుంది.మున్సిపల్ ఎన్నికలే టార్గెట్ గా కూరగాయల మార్కెట్ వేలం పాటలు టార్గెట్గా మారిపోతుంది.నంద్యాల కూరగాయల మార్కెట్ వేలం పాటలు జరగకుండా కొందరు రింగు కావడంతో వేలం పాటలు వాయిదా పడుతున్న విషయం మూడేళ్లుగా చూస్తున్నాం.మున్సిపాలిటీకి పన్నులే ప్రధాన ఆదాయవనరులు.మున్సిపాలిటీకి ఆదాయం వస్తేనే అభివృద్ధి చేయడానికి ఆస్కారం ఉంటుంది.అధికారులు ఎన్నిసార్లు వేలం పాటలు పెట్టినా వేలం పాట ముందుకు సాగకపోవడంతో వాయిదాలు పడుతూనే వస్తుంది.ఈ నేపథ్యంలోనే ఆళ్లగడ్డ ప్రాంతానికి చెందిన ముగ్గురు ప్రధాన రాజకీయ నాయకుల అనుచరుల దృష్టి వేలం పాటల పై దృష్టి పడినట్టు తెలుస్తోంది.ప్రస్తుతం ఈ రోజు జరిగిన వేలం పాటలు నాటకీయంగా జరిగి,నాటకీయంగా వాయిదా పడిన సంగతి విదితమే.వాయిదా పడడంతో రేపు మధ్యాహ్నం వేలం పాటలు జరుపుతామని అధికారులు ప్రకటించినా వేలం పాటలు తిరిగి రద్దు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.వివరాల్లోకి వెళితే నంద్యాల మున్సిపాలిటీలో ప్రతి ఏటా కూరగాయల మార్కెట్ వేలం పాటలు,పశువుల సంత,కూరగాయల మార్కెట్ ఖాళీ స్థలంలో సైకిల్,మోటార్ సైకిల్,ఇతర వాహనాలు పార్కింగ్ కు ఫీజు కు వేలం పాటలు జరిగేవి.వేలం పాటలు సజావుగా జరిగితే జీఎస్టీ కాకుండా మున్సిపాలిటీకి ప్రతి ఏటా దాదాపు కోటి రూపాయలు వేలం పాటల ద్వారా ఆదాయం వచ్చేది.గతంలో 2021-2022 లో 72 లక్షలు,2022-2023,2023-2024 లో ప్రతి ఏటా 61 లక్షల ప్రకారం కూరగాయల మార్కెట్ వేలం పాటల్లో మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేది.నటి నుంచి నేటి వరకు మూడేళ్లుగా వేలం పాటలు వాయిదా పడుతూ వచ్చేది.వేలం పాటల్లో పాల్గొనేవారు తనకు అనుకూలంగా నడుచుకుంటూ అందరూ రింగు కావడం,వేలం పాటలు వాయిదాలు పడుతూ వస్తుంది.వేలం పాటలు వాయిదా పడటంతో మున్సిపల్ రెవెన్యూ,అధికారులు సిబ్బంది పన్నులు వసూళ్లు చేసేవారు.దాదాపు ఏడాదికి 50 లక్షలు పై చిలుకు రావాల్సి ఉండగా అధికారులు,సిబ్బంది ఎంత వసూళ్లు చేసేది మాత్రం అడగొద్దు,అంతా గోప్యం,గోప్యం.వసూళ్లు చేసేది దండిగా చూపించేది తక్కువ అన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.గతంలో మీడియా ఎన్నో సాక్ష్యాలతో బిల్లులో ఒక లెక్క,తీసుకునేది ఒక లెక్క అని సాక్ష్యాలతో వార్తలు రాసినా విషయం పాఠకులకు విదితమే.పన్నులు సరిగా వసూళ్లు కాకపోవడం,కొందరు చేతి వారంతో మూడేళ్లుగా మున్సిపల్ ఆదాయానికి గండి పడింది.ఈ నేపథ్యంలో ఈ రోజు మార్కెట్ వేలం పాటలు జరిగే విషయం ఎవరికి తెలియకపోవడం విశేషం.మీడియా కు సైతం ఈ రోజు ఉదయం హడావిడిగా వేలం పాటలు ఉన్నాయని ఫోన్ చేసి చెప్పేంతవరకు మీడియాకి చెప్పకపోవడం విశేషం.వేలం పాటల్లో పాల్గొనాలని అనుకున్నవారికి ఎలా తెలుస్తుంది.ఇదంతా ఆ వేలం పాటదారులు,అధికారులు ఎవరికి తెలియకుండా చేస్తున్నారనే గుస,గుస లు వినిపిస్తున్నాయి.వేలం పాటలు జరిగితే మున్సిపాలిటీకి ఆదాయం,జరగక పోతే అధికారులకు ఆదాయం అన్న చందంగా మారిపోయింది.ఈ రోజు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తాపత్రం అంతా వేలం పాటలు జరగాలని గతంలో వేలం పాటల మొత్తాన్ని బేరీజు వేసుకొని వాటిలో 25 శాతం తగ్గించి సర్కార్ పాట 48 లక్షల 70 వేలకు మొదలు పెట్టడంతో వేలం పాటలకు వచ్చిన ఆ ఇద్దరే కాసేపు నాలుగుసార్లు వేలం పాటల్లో ఏదో పాట పాడాలని చివరకు 48 లక్షల 90 వేల వద్ద నిలిపి వేయడంతో అధికారులు పాట ముందుకు సాగదని గ్రహించి వేలం పాట వాయిదా వేశారు.ఈ నేపథ్యంలోనే వేలం పాటలు జరగకుండా,ఎవరికి తెలియకుండా చేస్తున్నారని సమాచారాన్ని ఆళ్లగడ్డకు చెందిన కొందరు రాజకీయ నాయకుల చెవిలో వేసినట్టు సమాచారం.మున్సిపాలిటీలో చొచ్చుకొని పోవడానికి ఇదే మంచి అవకాశం అనే భావించినా ఆ ముగ్గురు రాజకీయ నాయకులు తమ అనుచరులతో రేపు జరగబోయే వేలం పాటల్లో డబ్బులు,సాల్వెంట్ సర్టిఫికెట్ సమర్పించి వేలం పాటల్లో పాల్గొనాలని నిచ్చయించుకున్నట్టు సమాచారం.వేలం పాటలు జరిగితే మున్సిపాలిటీకి ఆదాయంతో పాటు అభివృద్ధి చెందుతుంది అన్నది వాస్తవం.ఆళ్లగడ్డ ప్రాంతానికి చెందిన వారు వేలం పాటల్లో పాల్గొంటే వారు తప్పకుండా పన్నులు వసూళ్లు చేసుకొని మున్సిపాలిటీకి కట్టే డబ్బు చెల్లిస్తారని ఆశిస్తున్నారు.కొన్నేళ్లుగా సిండికేట్ గా మారి నంద్యాల అభివృద్ధికి చెక్ పెడుతున్న సిండికేట్ కు భారీ చెక్ పెట్టనున్నట్టు తెలుస్తోంది.మరో వైపు మార్కెట్ వేలం పాటల్లో ఆళ్లగడ్డకు చెందిన నాయకుల అనుచరులు పాల్గొంటారా లేదా అన్న టెన్షన్ అన్ని వర్గాల్లో మొదలైంది.ప్రధానంగా మార్కెట్ వేలం పాటలు జరగకుండా సిండికేట్ కావాలని వెనకుండి నడిపిస్తున్న నాయకులు ఏ విధంగా పావులు కదుపుతారో వేచి చూద్దాం.




# వర్క్‌షాప్‌లు విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి




నంద్యాల ప్రతినిధి. మార్చి 24 . (నంది పత్రిక ):శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో "మైక్రోసాఫ్ట్ అజ్యూర్ ఏఐ ఫండమెంటల్స్ పై ఒకరోజు హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ వర్క్‌షాప్‌కు ముఖ్య వనరుల వ్యక్తిగా శుభ్ర ప్రకాష్ మోడల్ హాజరై, అజ్యూర్ వేదికపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన ప్రాథమిక అంశాలు, ప్రాక్టికల్ వినియోగం గురించి విద్యార్థులకు సమగ్రంగా వివరించారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వి. సుబ్రహ్మణ్యం ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆచరణలో నేర్చుకోవాలని సూచించారు. విభాగాధిపతి డా. జే. డేవిడ్ సుకీర్తి కుమార్ మాట్లాడుతూ, ఇటువంటి వర్క్‌షాప్‌లు విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా పి. జేకబ్ విజయ కుమార్ గారు వ్యవహరించారు. అలాగే స్టూడెంట్ బ్రాంచ్ మరియు ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి.ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులు సర్టిఫికేషన్‌కు సంబంధించిన అవగాహనతో పాటు ప్రాక్టికల్ అనుభవాన్ని కూడా పొందారు.

# జాతీయ స్థాయి ఖో-ఖో పోటీలకు శాంతీరామ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని టీ. వెంకటేశ్వరి ఎంపిక



నంద్యాల ప్రతినిధి. మార్చి 24 . (నంది పత్రిక ):నంద్యాలలోని శాంతీరామ్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడవ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ చదువుతున్న టీ. వెంకటేశ్వరి, జాతీయ స్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపికై కళాశాలకు గర్వకారణంగా నిలిచారు.అనంతపురంలోని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో మార్చి 18వ తేదీన జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, అనంతపురం ఖో-ఖో జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు.ఈ పోటీలలో వెంకటేశ్వరి తన అద్భుతమైన క్రీడా ప్రతిభను చాటి యూనివర్సిటీ జట్టులో స్థానం సంపాదించుకున్నారు. ఈమె ఏప్రిల్ 1 నుండి 4 వరకు కర్ణాటకలోని దావణగెరె యూనివర్సిటీలో జరగనున్న దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల ఖో-ఖో టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. వెంకటేశ్వరి సాధించిన ఈ విజయం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. సుబ్రహ్మణ్యం, ఫిజికల్ డైరెక్టర్ చంద్రారెడ్డి, హెడ్ ఫారూక్, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.

# అర్హులైన పేదలకు ఇండ్లు, ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి 5లక్షలు ఇవ్వాలి.



**టిడ్కో ఇల్లు లబ్ధిదారులకు స్వాధీనం, సాగు భూమి ఇచ్చే వరకూ పోరాటంఆగదు**
**బద్వేల్ ఆర్ డి ఓ కార్యాలయం ముట్టడి**
**పి హరినాథ్ రెడ్డి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు**
**ఎన్నికల హామీలు అమలు చేయకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే కూటమి ప్రభుత్వానికి పడుతుంది**
**బద్వేల్ నియోజకవర్గంలో భూ మాఫియా ను అరికట్టి పేదలకు భూములు పంచాలి**
**అనుభవంలో ఉన్న పేదలకు పట్టాలివ్వాలి**

బద్వేల్ మార్చి 24నంది పత్రిక : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలం తో పాటు ఇంటి నిర్మాణానికి 5 లక్షల ఆర్థిక సహాయం, టిడ్కో ఇల్లు లబ్ధిదారులకు స్వాధీనం, భూమిలోని నిరుపేదలకు సాగు భూమి పంపిణీ చేసి, బాడుగ ఇంట్లో ఉండే పేదవారికి అద్దె చెల్లించాలని కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీలు అమలు చేసే వరకూ పోరాడతామని మంగళ వారం స్థానిక ఆర్ డి ఓ కార్యాలయం ముట్టడి లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి హరినాథ్ రెడ్డి హెచ్చరించారు.ఈ సందర్భంగా స్థానిక సిపిఐ కార్యాలయం వద్ద నుండి భారీగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇండ్లు ఇస్తాం ! ఇంటి స్థలం ఇస్తాం !! రేషన్ కార్డు , పెన్షన్ తోపాటు మౌలిక సదుపాయాలైన రోడ్లు కాలువలు వీధిలైట్లు 24 గంటలు త్రాగునీరు అందించి భూమి లేని నిరుపేదలకు సాగు భూమి పంపిణీ చేసి ఆర్థిక రాజకీయ సామాజిక సమానత్వానికి సాధికారతకు పెద్దపీట వేస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చి ఓట్లు దండుకొని అందలమెక్కగానే ఎన్నికల వాగ్దానాలు పూర్తిగా పక్కకు నెట్టి ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడడం పరిపాటిగా మారిందన్నారు. పేదవాడికి జానెడ జాగా ఇవ్వడానికి నిరాకరిస్తున్న పాలక ప్రభుత్వాలు, వారికి వత్తాసు పలికే అధికారులు విలువైన ప్రభుత్వ వంక వాగు చెరువు రస్తా అసైన్డ్ దేవాదాయ ఈనాం వక్ఫ్ అటవీ భూములను యదేచ్చగా ఆక్రమించి అమ్ముకుని సొమ్ము చేసుకునే భూ మాఫియా కొమ్ముకాస్తున్నారు అని, భూమి లేని నిరుపేదలకు భూమి పంపిణీ చేసే అసైన్మెంట్ కమిటీ పోరాడి సాధించుకుంటే చట్టాన్ని సమూల మార్పులు చేసి ఫ్రీ హోల్డ్ పేరుతో ఒక్క సారిగా దళితులను భూమికి దూరం చేసే దుస్సాహసానికి ఒడిగట్టారు అని విమర్శించారు. పారిశ్రామిక అవసరాల పేరుతో, సంస్థల పేరుతో అయిన వారికి ఐదు లక్షల విలువ చేసే ఎకరా భూమిని అర్ధ రూపాయికి కట్టబెట్టడం, ఎక్కడ, ఎవరికి భూమి కావాలన్నా దళితులు,పేదల చేతుల్లో ఉన్న భూములే గుర్తుకు వచ్చే పాలక ప్రభుత్వాలు ఎవరున్నా దోపిడీలో సారూప్యత, సమన్వయం, సఖ్యతను చాటే మేక వన్నె పులులను ఎదుర్కోవాలంటే సామాన్య,పేద, మధ్య తరగతి ప్రజలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి అన్నారు.ఒకవైపు కేంద్ర ప్రభుత్వం అందరికీ ఇల్లు అనే నినాదంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి కనీసం గుణాదికి కూడా సరిపోని 1లక్ష 50వేలు అందిస్తామంటూ, ఇంటి స్థలం, రోడ్లు మౌలిక సదుపాయాల కల్పన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనంటూ ప్రధాన బాధ్యత నుండి తప్పుకుంటున్నది.రాష్ట్రంలో గత ప్రభుత్వ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా 68,000 ఎకరాల్లో, 17000 కాలనీలు 32లక్షల మందికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 1లక్ష 50 వేల తో పాటు అదనంగా 30 వేలు జోడించి 1లక్షా 80 వేలతో ఒక సెంటు స్థలంలో ఇంటి నిర్మాణానికి 30.75 లక్షల మందికి బలవంతపు రిజిస్ట్రేషన్లు చేయించి ఆరు మాసాల్లో పూర్తి చేయకపోతే రద్దు చేస్తామంటూ హుకుం జారీ చేయడంతో 7.43 లక్షల మంది ఐదు రూపాయలు వడ్డీ రుణాలు తెచ్చి అప్పుల పాలై ఆ ఇంటి నిర్మాణం పూర్తి కాకుండానే అమ్మకానికి పెట్టినవారు, ఒక్క సెంటు స్థలం సరిపోదంటూ 21.76 లక్షల మంది ససేమీరా ఒప్పుకొని వారు, నిర్మాణ వ్యయం పెంచాలన్న వారి ఆలోచనలకు ఆజ్యం పోస్తూ తాను అధికారంలోకి రాగానే పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి 4 లక్షలు ఆర్థిక సహాయం, భూమి లేని నిరుపేదలకు సాగు భూమి పంపిణీ చేస్తానంటూ నమ్మబలికి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలు కావస్తున్న అమలు చేయడంలో తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ డొంక తిరుగుడు షరతులతో పేదల నోట్లో మట్టి కొట్టాలని చూస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల్లో అతి ముఖ్యమైన ఇండ్లు ఇంటి స్థలం వాగ్దానం అమలు చేయాలని సిపిఐ చేపట్టిన దశల వారి పోరాటాలకు దిగివచ్చి +.వా.వీం.చీశీ.23 (27-01-2025) విడుదల చేసింది. ఈ జీవో ప్రకారం దరఖాస్తు చేసుకునేవారు జీవితంలో ఇప్పుడే గాని ఎక్కడ గాని ఇంటి స్థలం పొందినట్లు గాని, ఇంటి పన్ను, కరెంట్ బిల్లు తన పేరు మీద ఉండరాదని చివరకు జగనన్న కాలనీలో ఇంటి పట్టా పొంది ఇండ్లు కట్టుకోకపోయినా ఇంటి స్థలం పొందడానికి అనర్హులంటూ చావు కబురు చల్లగా చెప్పినట్లు చంద్రబాబు ప్రభుత్వం పేద ప్రజల ఆశలపై నీళ్లు చల్లారు అన్నారు.ఇంటి స్థలం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన షరతులు సడలించి గత ప్రభుత్వంలో ఇంటి నిర్మాణం చేపట్టని వారికి, ఇంటి స్థలం తీసుకొని వారికి, ఇంటి స్థలం మంజూరు కాని వారికి ప్రస్తుత ప్రభుత్వం పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు కేటాయించి, పెరిగిన సిమెంటు స్టీలు ఇసుక కంకర ఇటుక కూలి ధరలకు అనుగుణంగా ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల ఆర్థిక సహాయం అందించాలని, రోజువారి కూలీకి పోయినా పూట గడవక అద్దె చెల్లించలేక అవస్థ పడుతున్న కుటుంబాలకు అద్దె చెల్లింపుకు ప్రభుత్వ ఆర్థిక భరోసా అందించి ఆదుకోవాలని, భూమిలేని గ్రామీణ నిరుపేదలకు సాగు భూమి పంపిణీ చేయాలనీ, టిడ్కో ఇండ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని, అనుభవం లో ఉన్న తిరుపతి రెడ్డి కాలనీ, భగత్ సింగ్ నగర్, సి ఆర్ నగర్, ఏబీ బర్ధన్ కాలనీ, ఎద్దుల ఈశ్వర్ రెడ్డి కాలనీ వాసులకు ఇంటిపట్టాలు, పాస్ బుక్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్ డి ఓ చంద్రమోహన్ కు వినతిపత్రం ఇచ్చి సమస్యలు వివరించగా అభ్యంతరం లేని సమస్యలన్నీ పరిష్కారానికి కృషి చేస్తానని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు పోతానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, కార్యవర్గ సభ్యులు వి వీరశేఖర్, పి బాల ఓబయ్య, గంగా సురేష్, మస్తాన్, ఇమ్మాన్యుయేల్, పివి రమణ, పడిగే వెంకట రమణ, రవికుమార్, పెంచలయ్య, నాగరాజు, శేషారెడ్డి, కేశవ, సునీల్, ప్రసాద్, విజయమ్మ, వెంకటయ్య, పిరయ్య, సఫా,ఓబులపతి, తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ లో సహకరించాలి

**జిల్లా ఎన్నికల అధికారి /జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**



కర్నూలు, నంది పత్రిక.....రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ ల మ్యాపింగ్ ప్రక్రియలో సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి /జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి రాజకీయ ప్రతినిధులను కోరారు. మంగళవారం కలెక్టరేట్ లో ఓటర్ల మ్యాపింగ్, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి /జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఓటర్ల మ్యాపింగ్ కార్యక్రమం చురుకుగా జరుగుతోందని, ఇందులో ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకుని రావాలని కోరారు. అలాగే రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు పార్టీల బూత్ ఏజెంట్లు ఈ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తయ్యేందుకు వీలుగా సహకరించాలని కోరారు. ప్రభుత్వం తరపున బిఎల్వోలు ఇంటింటికి తిరిగి ఓటర్లను మ్యాపింగ్ చేస్తున్నారని, బూత్ లెవెల్ ఏజెంట్లు వారి పార్టీల తరపున బీఎల్ ఓ లకు సహకరించాలని పార్టీల ప్రతినిధులకు తెలియజేశారు. అర్హులైన ఓటర్లను నమోదు చేయించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు.ఓటర్ ల మ్యాపింగ్, ఓటర్ల నమోదు కార్యక్రమం పై ప్రజలకు , విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీల ప్రతినిధులు జిల్లా ఎన్నికల అధికారి / జిల్లా కలెక్టర్ ను కోరారు.అంతకుముందు జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ కార్యాలయం కాంప్లెక్స్ లో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ల గోడౌన్ ను తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రతకు సంబంధించి ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఈవీఎం లకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ పర్యవేక్షణ, డబుల్ లాక్ విధానం, ఎంట్రీ-ఎగ్జిట్ రిజిస్టర్ నిర్వహణ వంటి తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీ మరియు సమావేశంలో బహుజన సమాజ్ వాదీ పార్టీ తరపున డిస్ట్రిక్ట్ ఇంచార్జ్ అరుణ్ కుమార్, బిజెపి పార్టీ తరపున పి.టి.సాయి ప్రదీప్, నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున బజారన్న, తెలుగుదేశం పార్టీ తరపున ఎల్.వి. ప్రసాద్, సత్రం రామకృష్ణుడు , వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ తరుపున ఎస్ ఏ షరీఫ్ , జనసేన పార్టీ తరపున తల్లా మంజునాథ్ ( డైరెక్టర్ , వాల్మీకి కార్పొరేషన్) , ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు..



## బేతంచెర్ల గృహ నిర్మాణ శాఖ ఏ ఈ గా కేశవ్ బాధ్యతలు స్వీకరణ.



**బేతంచెర్ల మార్చి 24 (నందిపత్రిక ).** బేతంచర్ల మండలం అసిస్టెంట్ ఇంజనీర్ గా కేశవ్ మంగళవారం భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కేశవ్ మాట్లాడుతూ ప్రభుత్వ బదిలీల్లో భాగంగా అవుకు నుండి బేతంచెర్ల మండలం లో భాద్యతలు నిర్వహించుటకు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇక్కడ పనిచేసిన ఏ ఈ శ్రీనాథ్ నాయుడు అవుకు మండలానికి బదిలీ అయ్యారు. బేతంచెర్ల మండల ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ, ప్రజలకు ఏ ఇబ్బంది వచ్చిన తనను నేరుగా కలవ వచ్చునని, అలా కలిసిన వారికి తక్షణమే పరిష్కరిస్తానని,అర్హులైన పేదలందరికీ గృహాల మంజూరు చేయిస్తానని ఎఈ కేశవ్ తెలిపారు.

## మార్చి 30 వ తేదీ సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయండి

### ఆప్షన్ 3 గృహాలలో స్లాబ్ మరియు రెక్టిఫికేషన్ పనులను వెంటనే పూర్తి చేయాలి - జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



**కర్నూలు, నంది పత్రిక....**హౌసింగ్ కి సంబంధించి ఈ నెల 30వ తేదీన అన్ని నియోజకవర్గాల్లోనూ సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం నిర్వహించాలని అందుకు తగిన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఎంపిడిఓ, హౌసింగ్ ఇంజనీర్ లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి హౌసింగ్ అంశం పై మండల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన అన్ని నియోజకవర్గాల్లో సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం జరుగుతుందన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రూఫ్ లెవెల్ కి వచ్చిన ఇళ్లను ప్రాధాన్యతతో పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం విషయంలో పురోగతి సాధించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద మరిన్ని పని దినాలను కల్పించాలన్నారు. ఆప్షన్3 కింద కాంట్రాక్టర్ లు నిర్మించిన ఇళ్లలో 2 వేల 522 ఇళ్లలో నిర్మాణ లోపాలను గుర్తించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 1685 ఇళ్ల నిర్మాణాల లోపాలను సరిచేయడం జరిగిందని, మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.వీడియో కాన్ఫరెన్స్ లో హౌసింగ్ పిడి చిరంజీవి, మండల స్పెషల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు, ఎంపిడిఓ లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ క్షయవ్యాధి నివారణా దినోత్సవం జయప్రదం చేయండి

### పర్యావరణ హితంగా జీవించడానికి అవగాహన అవసరం
### ప్రతి విద్యా సంస్థ హరిత వనం కావాలి
### జెవి రత్నం వ్యవస్థాపక కార్యదర్శి గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ




**మహానంది మార్చి 24 (నంది పత్రిక):-** ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం జయప్రదం చేయండి, క్షయ వ్యాధిని పారద్రోలండి అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు.మంగళవారం మహానంది మండలం కేంద్రం తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేషనల్ గ్రీన్ కోర్ ఎపి రాష్ట్ర విభాగం జిల్లా సమన్వయ కర్త సి చంద్ర శేఖర్ రెడ్డి అధ్యక్షతన ప్రకృతి కార్యశాల నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలో చాలా వరకూ క్షయ వ్యాధి నివారింపబడింది అన్నారు.ఇందుకుగాను ప్రభుత్వం చేసిన కృషి అభినందనీయం అన్నారు.విద్యార్థులకు ప్రకృతి కార్యశాల నిర్వహించడం అవసరం అని, దీని ద్వారా పర్యావరణ హితంగా జీవించడానికి అవగాహన కలుగుతుంది అని వివరించారు. అలాగే ప్రతి విద్యా సంస్థ హరిత వనం కావాలన్నారు. అలాగే ప్రతి విద్యార్థి పశు పక్ష్యాదుల పరిరక్షణ కోసం కృషి చేయాలనే ఆలోచన కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయ కర్త సి.చంద్ర శేఖర్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత అని పేర్కొన్నారు.ప్రతి విద్యార్థీ పర్యావరణ హితంగా జీవించడానికి నేషనల్ గ్రీన్ కోర్ అవగాహన కల్పించడం జరుగుతుంది అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ జి సి పర్యావరణ పరిరక్షణ కోసం సుషిక్షితులైన సైనికులు గా శిక్షణ ఇవ్వడం జరిగుతోందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పార్వతమ్మ ,స్వర్ణ, హరిత, హనుమంతు, ప్రసాదు, రామకృష్ణారెడ్డి, రమణ, మౌలాబి, నాగరాజు పిడి తదితరులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ముందుగా గ్రీన్ క్లైమేట్ రత్నం విద్యార్థులు చేత బియ్యం పిండితో ముగ్గులు వేయించారు. దీని వల్ల చీమలకు, చిన్న చిన్న పక్షులకూ ఆహారం లభిస్తుంది అన్నారు. ఇతర ముగ్గు పిండి ముగ్గులు వేసే వారికి అనారోగ్యం కలిగిస్తుంది అని వివరించారు. అలాగే పశుపక్ష్యాదులకు నీరు, ఆహారం పెట్టె పాత్రలూ, గూళ్ళు తయారు చేయడం మీద శిక్షణ ఇచ్చారు.



### 13 ఏళ్లు కోమాలో ఉండి... తుది శ్వాస విడిచిన హరీశ్ రాణా

హరీశ్ రాణా మంగళవారం తుదిశ్వాస విడిచారు. ప్రమాదవశాత్తు గాయపడి 13 ఏళ్ల క్రితం కోమాలోకి వెళ్లిపోయిన ఘజియాబాద్‌కు చెందిన హరీశ్ రాణా మృతి చెందినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇటీవలే హరీశ్ తల్లిదండ్రులు కారుణ్య మరణం కోసం కోరగా, సుప్రీంకోర్టు రెండు వారాల కిందట ఆమోదం తెలిపింది. దీనితో ఢిల్లీలోని ఎయిమ్స్ వైద్యులు అతడికి చికిత్స నిలిపివేశారు. హరీశ్ రాణా పంజాబ్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న సమయంలో 2013 ఆగస్టు 20న హాస్టల్ భవనం రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో కోమాలోకి వెళ్లిపోయాడు.

## రాజనగరం గ్రామంలో భక్త చింతామణి నాటక ప్రదర్శన.



**సిరివెళ్ల (నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని రాజనగరం గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా 26వ తారీకు రాత్రి 8 గంటలకు భక్త చింతామణి పూర్తి నాటకం ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని పుల్లయ్య చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ వెంకట లక్ష్మీ దుర్గ నాట్యమండలి తెనాలి వారిచే ఆంధ్ర ప్రదేశ్ లో అఖండ కీర్తి గడిచిన రంగస్థలం నటి నటులచే గొప్ప ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో అంతర్జాతీయ రంగస్థలం నటులు కిసే ఏవి సుబ్బారావు గారి కుమారుడు, దామోదర భాస్కరరావు అభినవ నటులు తెనాలి. చింతామణి శ్రీమతి రత్న శ్రీ ఆంధ్ర నాట్య మయూరి కడప, పూలరంగడు జబర్దస్త్ అప్పారావు సినీ టీవీ ఆర్టిస్ట్ హైదరాబాద్, శ్రీహరి. ఎం సీతారాం క్యారెక్టర్ యాక్టర్ విజయవాడ, గుడివాడ కుమారి చలాకి డాన్సర్ హార్మోనియం సత్య బాబు, డోలక్ వీర్రాజు తదితరులు రాజనగరం గ్రామంలో భక్త చింతామణి నాటక ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని పుల్లయ్య చౌదరి తెలిపారు. కావున సిరివెళ్ల మండల పరిసర గ్రామ ప్రాంత ప్రజలందరూ వేలాదిగా విచ్చేసి స్వామివారిని దర్శించుకుని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## కర్నూలు మెడికల్ కాలేజీ న్యూ లెక్చర్ గ్యాలరీ లో జరిగిన టీబీ-ముక్త్ భారత్ అభియాన్ అవగాహన సదస్సు



**కర్నూలు నంది పత్రిక...** కర్నూలు మెడికల్ కాలేజీ న్యూ లెక్చర్ గ్యాలరీ లో జరిగిన టీబీ-ముక్త్ భారత్ అభియాన్ అవగాహన సదస్సు లో పాల్గొన్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డా ఖ. వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఖ. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ :- 2025 నాటికి క్షయ రహిత దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'టీబీ-ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకగా అమలు చేస్తున్నాయని అన్నారు.క్షయ వ్యాధి పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి సరైన చికిత్స అందించడం ద్వారా మరణాల రేటును పూర్తిగా తగ్గించవచ్చు అన్నారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో టీబీ రోగులకు ఉచిత వైద్యంతో పాటు, వారి పౌష్టికాహారాన్నీ బాధితులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్. వెంకటేశ్వర్లు తో పాటు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ మరియు డాక్టర్ భాస్కర్ (డిస్ట్రిక్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ) డా జఫ్రుల్లా ( డిస్ట్రిక్ కోఆర్డినేటర్ హెల్త్ సర్వీసెస్ ) మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పబ్లిక్ ప్రాసిక్యూటర్ భాస్కరరావును అభినందించిన... కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్



**కర్నూలు నంది పత్రిక.....** మంగళవారం జరిగిన నేర సమీక్ష సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ భాస్కరరావును జిల్లా పోలీస్ కార్యాలయంలో కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు.

**జరిగిన విషయం...** హైదరాబాద్ నుండి బెంగుళూరు వెళ్తున్న బస్సులో రూ. 25 లక్షల దొంగతనం జరిగిన కేసులో, డోన్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ గౌరవ ఎస్. జ్యోతి మార్చి 10వ తేదీ ముద్దాయిలకు 2 సంవత్సరాల జైలు శిక్ష విధించారు. 25.10.2025న జరిగిన ఈ దొంగతనం ఘటనలో, ఫిర్యాదు మేరకు క్రిష్ణగిరి పిఎస్ లో కేసు నమోదు చేసారు.

**27.10.2025న**

1) మహమ్మద్ షహీద్, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం 2) సుహేబ్ , ఉత్తర్ ప్రదేష్ రాష్టం

ఈ పై ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు.

కోర్టు విచారణ అనంతరం లకు 2 సంవత్సరాల పాటు జైలు శిక్ష విధించారు.ఈ కేసులో కీలక పాత్ర పోషించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ భాస్కరరావు ని, అలాగే దర్యాప్తు నిర్వహించిన అప్పటి వెల్దుర్తి సీఐ మధుసూదన్ రావు , ప్రస్తుతం వెల్దుర్తి సీఐ యుగంధర్ , క్రిష్ణగిరి ఎస్సై కృష్ణమూర్తిలను ఎస్పీ అభినందించారు.అదేవిధంగా లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు పరిష్కారం చేసినందుకు గాను కర్నూల్ త్రీ టౌన్ సీఐ శేషయ్యను, ఒక దొంగతనం కేసులో రికవరీ చేసినందుకు గాను కర్నూల్ నాల్గవ పట్టణ సీఐ విక్రమ సింహను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

## ఘనంగా ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం.

**నందికొట్కూరు /మిడ్తూర్ మార్చి 24( నంది పత్రిక)** క్షయ వ్యాధి పై ప్రజలు పూర్తిగా తెలుసుకోవాలని క్షయ వ్యాధి నివారణకు ప్రభుత్వాస్పిటల్ నందు గల్ల పరీక్షలు, మైక్రోస్కోపిక్ ద్వారా ఎక్రే, ద్వారా సిబి నాట్ మరియు ఆర్టిసిపిఆర్ ఆధునిక పరికరాల ద్వారా పరీక్షలు చేసి, మందులు కూడా ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని, వ్యాధి కలిగిన వారికి ప్రతి నెల 1000 రూపాయలు ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తుందని, దీంతో పోస్ట్ ఆహారం తీసుకొని మందులు అయితే ఆరు నెలలో ఈ వ్యాధి పూర్తిగా నయమవుతుందని ఆందోళన అవసరం లేదని డాక్టర్ సారా ప్రజలకు తెలియజేశారు. మంగళవారం మిడుతూరు మండల సామాజిక ఆరోగ్య కేంద్రం నందు ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం వైద్యులు డాక్టర్ అశ్విన్, డాక్టర్ సారా, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపి బ్యాక్టీరియాను కనుగొన్నటువంటి ప్రముఖ శాస్త్రవేత్త అయిన రాబర్ట్ కాక్ చిత్రపటానికి వైద్యులు పూలమాలు వేసి ఘనంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ సారా, అశ్విన్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ సత్యనారాయణలు వివిధ వ్యాధుల, టీబి, క్షయ వ్యాధి నివారణపై, మరియు ప్రభుత్వం అందించే ప్రోత్సాహం నగదు, ప్రభుత్వ వైద్యశాల నందు అందించే వైద్య సేవలపై ప్రజలకు వివరించారు. 2030 కళ్ళ భారతదేశాన్ని క్షయ వ్యాధి రహిత దేశంగా చేయవలసిన బాధ్యత మన అందరి పైన ఉందని, ఎందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషి అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ ఆఫీసర్ శ్రీజ, స్టాఫ్ నర్స్ ప్రశాంతి, శ్యామలమ్మ, సువేద మరియు వైద్య సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.



## రోళ్ళపాడులో ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు





**మిడుతూరు. మార్చి 24 . (నంది పత్రిక ):**శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ ఆధ్వర్యంలో మిడుతూరు మండలం, రోళ్ళపాడు గ్రామంలోని శ్రీరామాలయం నందు ధార్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ధర్మప్రచారకులు కె. సిద్దారెడ్డి శ్రీరామపట్టాభిషేకంపై ఉపన్యసించారు.తదనంతరం స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలను నిర్వహించారు. తితిదే ఇలాంటి కార్యక్రమాలను మారుమూల గ్రామాలలో కూడా ఏర్పాటు చేయడం అభినందనీయమని సర్పంచ్ పేరెడ్డి వేంకట రామిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమాలు మంగళవారం నుండి శనివారం వరకు ప్రతిరోజు ఉపన్యాసం, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. మాజీ సర్పంచ్ నాగారెడ్డి రామస్వామి రెడ్డి, ధర్మప్రచారకులు బొంతు రామ్మోహన్, ధర్మప్రచార మండలి సభ్యులు అంబటి శివశంకర రెడ్డి, విశ్వహిందూ పరిషత్ నాయకులు ఎన్.చిన్న నారాయణ, అర్చకులు టి.మనోహర్ శర్మ, ఇ. వెంకటేశ్వర్లు గౌడు, ఇ. నారాయణ గౌడు, యోగి ఎల్లయ్యతో పాటు భజన మండలి సభ్యులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధం.

### రూ 2 లక్షల ఆస్తి నష్టం.



**రుద్రవరం ప్రతినిధి మార్చి 24 (నంది పత్రిక):** మండలంలోని హరినగరం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున సంభవించిన అగ్ని ప్రమాదంలో గుడిసె దట్టమయింది. గ్రామస్తుల వివరాల మేరకుగ్రామానికి చెందిన భేతి కనకమ్మ ఇంటిలో తెల్లవారుజామున హఠాత్తుగా మంటలు వ్యాపించి గుడిసెపూర్తిగ దగ్ధమైందన్నారు. ఈ ప్రమాదంలో వంట సామాగ్రి, దుస్తులు, ధాన్యం, టీవీ, తదితర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి అన్నారు. ప్రమాదంలో దాదాపు 2 లక్షల దాకా నష్టం వాటిల్లి ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఇంటిలో మంటలు వ్యాపించడంతో గ్రామస్తులు సకాలంలో స్పందించి మంటలను ఆర్పీ వేశారు. కాలిన గుడిసెను విఆర్ఓ పుల్లయ్య పరిశీలించారు. నష్టం వివరాలను నివేదిక గా తయారుచేసిరెవెన్యూ అధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు.

## నీటి నాణ్యత పై శిక్షణ కార్యక్రమం.



**రుద్రవరం ప్రతినిధి మార్చి 24 (నంది పత్రిక):** స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో నీటి నాణ్యత - ఎఫ్.టి.కె (ఫీల్డ్ టెస్ట్ కిట్) పై అవగాహన మరియు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డివిజనల్ ఇంజనీర్ వినోద్ కుమార్, ఎంపీడీవో భాగ్యలక్ష్మి, మరియు ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడంలో క్షేత్రస్థాయి సిబ్బంది పాత్రను వివరించారు. కలుషిత నీరు తాగడం వల్ల మానవ శరీరంపై కలిగే దుష్ప్రభావాలను వివరించి, ఫీల్డ్ టెస్ట్ కిట్ ద్వారా పి.హెచ్, ఫ్లోరైడ్, క్లోరైడ్, నైట్రేట్, ఐరన్ వంటి ఎనిమిది రకాల పరీక్షలను ఎలా నిర్వహించాలో ప్రత్యక్షంగా చూపించారు. పంచాయతీ కార్యదర్శులు మరియు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తమ పరిధిలోని గృహాలు, పాఠశాలలు మరియు అంగన్‌వాడీ కేంద్రాలలో క్రమం తప్పకుండా నీటి పరీక్షలు నిర్వహించాలని, ముఖ్యంగా క్లోరిన్ శాతం సున్నా పాయింట్ రెండు పి.పి.ఎమ్ కంటే తక్కువగా ఉంటే వెంటనే ఉన్నత స్థాయి ల్యాబ్‌లకు నమూనాలను పంపాలని ఆదేశించారు. ఈ పరీక్షల ఫలితాలను తప్పనిసరిగా డబ్ల్యూ.క్యూ.ఎమ్.ఐ.ఎస్ లేదా ఆర్‌డబ్ల్యూఎస్ వన్ యాప్‌లో నమోదు చేయాలని, గ్రామ స్థాయిలో శిక్షణ పొందిన మహిళల సహకారంతో ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులు సూచించారు.



# కర్నూలు ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ వైస్ చైర్మన్ గా కార్తీక్, జనరల్ సెక్రెటరీగా ముద్దు కృష్ణ నియామకం







**కర్నూలు నంది పత్రిక....** కర్నూలు ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ వైస్ చైర్మన్ గా కార్తీక్, జనరల్ సెక్రెటరీగా ముద్దు కృష్ణ నియామకం చేయడం జరిగిందని ఏనుకొన్నట్లు నేషనల్ చైర్మన్ డా!సాయి రమేష్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ చైర్మన్ డా!సురేష్ బాబు నియామక పత్రాలను, మున్సిపల్ కమిషనర్ రాజేష్ చంద్ర , డ్రగ్స్ కంట్రోల్ ఆశ, మరియు శాలువాలో కప్పి ఘనంగా సన్మానించారు. వైస్ చైర్మన్ గా కార్తీక్, జనరల్ సెక్రెటరీగా ముద్దు కృష్ణ నూతనంగా ఎన్నుకున్నారు. వారిని ఘనంగా శాలువాలు మరియు షీల్డ్ బహూకరించారు.కడప నిర్మల ఫార్మసీ కాలేజీ నందు అందించారు. చైర్మన్ అభ్యర్థి రామకృష్ణ నాయక్ మాట్లాడుతూ, మీ సొంత అవసరాల కోసం ఏదైనా వస్తువు, సేవలను కొనుగోలు చేసి ఉపయోంచుకొనే వారిని వినియోగదారిని అంటారని, వినియోగదారులు హక్కుల, రక్షణ చట్టం 1986 గురించి వివరిస్తూ, మళ్ళీ ఈ చట్టాన్ని 2019 లో మార్పులు చేసి 2020 లో కొత్తగా వచ్చిన మార్పుల గురించి వివరించారు. ఈ చట్టం ప్రకారం ప్రతి వినియోగదారునికి కొన్ని హక్కులుంటాయని అవి భద్రతహక్కు, సమాచారం పొందే హక్కు,ఎంపిక చేసుకొనే హక్కు,వినబడేహక్కు, పరిహారం పొందేహక్కు, వినియోగ దారుల విద్యాహక్కు. అని అలాగే హక్కులతో పాటి బాధ్యతలు కూడా తెలియజేశారు. ఏదైనా వస్తువు కొనేటప్పుడు బిల్ కచ్చితంగా తీసుకోవాలని, నాణ్యమైన ఐ. ఎస్. ఓ.,, ఎఫ్. ఎస్. ఎస్. ఐ., ఐ. ఎస్. ఐ., లీగల్ మెట్రోలజీ సర్టిఫికెట్ కలిగి తయారు చేసే వాటర్ ను మాత్రమే వాడాలని కర్నూల్ జిల్లాలో 80 శాతం సర్టిఫికెట్ లేకుండా, నాణ్యమైన వాటర్ ఇవ్వకుండా కొన్ని వాటర్ ప్లాంట్స్ తక్కువ ఖర్చుతో ఎక్కువ లాబాలు పొందుతున్నారని, కొన్ని రెస్టారెంట్ లలో టేస్ట్ కోసం రకరకాల పొడులు కలుపుతున్నారని,కొన్ని స్వీట్ స్టాల్ దగ్గర విపరీతమైన ఈగలు ఉన్నాయని, మెడికల్ స్టోర్ లో అర్హతలేని వారు ఇష్టమొచ్చినట్లు ఆంటిబయోటిక్, షెడ్యూల్ డ్రగ్స్ అమ్ముతున్నారని, ఫార్మసీ యాక్ట్ 1948 సెక్షన్ 42,డ్రగ్ అండ్ కాస్మెటిక్ యాక్ట్ 1940 సెక్షన్ 65 ప్రకారం ప్రతి మందుల షాప్ లో ఫార్మసిస్ట్ ఉండాలి కానీ అది కను మరుగైపోతుందని దీనివలన వినియోగదారుడు చాలా నష్టపోతున్నాడని. ఎవరైనా వస్తువులు కొని నష్టపోతే కన్స్యూమర్ కోర్టులో కేస్ వేయాలని డిస్ట్రిక్ట్ కోర్టులో 0---నుండి 5 లక్షల వరకు వేయొచ్చని, స్టేట్ కన్స్యూమర్ కోర్టులో 5 లక్షల నుండి 2 కోట్ల వరకు నష్టపరిహారాంపై కోర్టును ఆశ్రయ్యించవచ్చని, 2 కోట్ల నుండి ఆ పైన ఎందైనా నేషనల్ కన్స్యూమర్ కోర్టులో కేస్ వేసి పరిహారం పొందవచ్చని తెలియజేశారు.

## సిపిఐ ఎమ్. ఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు సన్మానించిన గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు.



**నందికొట్కూరు మార్చి 24 ( నంది పత్రిక)** ఉమ్మడి జిల్లాలలో సిపిఐ ఎంఎల్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు ను వాల్మీకి బోయ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు శాలువతో పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలలో సిపిఐ ఎమ్ ఎల్ లిబరేషన్ పార్టీ బలోపేతం చేయడంపై సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగత బంగారు రావ్ నందికొట్కూరు పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక పార్టీ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కిలి వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నందికొట్కూరు పట్టణానికి విచ్చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారురావును ఏపీ వాల్మీకి బోయ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ను అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. అనంతరం సమాజంలో వాల్మీకి బోయలు ఎదుర్కొంటున్న సమస్యలను, చేస్తున్న ఉద్యమ పోరాట డిమాండ్లను ఆయన వారికి వివరించారు. వాల్మీకి పోయాల ఎస్టి రిజర్వేషన్ పునర్ధరణ పై అంశంపై వాల్మీకి బోయలు చేపట్టే ఉద్యమాలకు తమ పార్టీ మద్దతు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎమ్ ఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## చెట్లను పెంచి అడవులను సంరక్షించాలి

### డీఆర్వో హైమావతి







**మహానంది మార్చి 24 (నంది పత్రిక):-** అడవులు చెట్లు సమృద్ధిగా ఉన్నప్పుడే మనుషలకు సంపూర్ణమైన ఆరోగ్యం చేకూరుతుందని మహానంది డిప్యూటీ రేంజ్ అధికారి హైమావతి అన్నారు. మహానంది మండల కేంద్రం తిమ్మాపురం గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు అడవుల అవగాహనలో భాగంగా పచ్చర్ల లోని జంగిల్ ట్రిప్ ఏర్పాటు చేశారు.ఆమె మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా జీవించేందుకు అడవులు చెట్లు ఎంతో దోహదపడతాయని , ప్రతి ఒక్కరూ చెట్లను పెంచాలని, అడవులను పరిరక్షించాలని అన్నారు. అడవి అందాలను ఆస్వాదిస్తూ అడవుల ఆవశ్యకతను వివరించారు.మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మణరావు మాట్లాడుతూ అడవి అమ్మ లాంటిదని అన్నారు. అమ్మ తన పిల్లలను అక్కున చేర్చుకొని వాళ్లను లాలించి, పాలించి విద్యాబుద్ధులు నేర్పించి, ఆరోగ్యవంతులుగా తయారుచేసిన విధంగా అడవి తల్లి కూడా సమస్త ప్రజలు జీవించడానికి అవసరమైన అన్ని ఆహార పదార్థాలు చెట్టు నుంచి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీనివాసులు, చాలా ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, మౌనిక, శ్రీలత, రమణయ్య విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు..

## ఆవోపా ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరాల పంపిణీ



**ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 24, నంది పత్రిక** ఆవోపా మహిళా విభాగ్ సేవానిధి ఆధ్వర్యంలో దివంగత కొప్పరపు పద్మనాభయ్య జ్ఞాపకార్థం ఆయన సతీమణి శ్రీదేవి, కుటుంబ సభ్యులు మంగళవారం ఆళ్లగడ్డలోని ఆవోపా కార్యాలయంలో 20 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవోపా మహిళా అధ్యక్షురాలు కసెట్టి సుజాత మాట్లాడుతూ దివంగత పద్మనాభయ్య జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు పేదలకు చీరల పంపిణీ చేయడం ఆదర్శనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, నాగమణి, ఆవోపా మహిళా సభ్యులు కాత్యాయిని, సునంద, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తగిలి జూనియర్ లైన్ మ్యాన్ కు గాయాలు



**కొత్తపల్లి - నంది పత్రిక:** మండలంలోని శివపురం గ్రామానికి చెందిన జూనియర్ లైన్మెన్ ఇబ్రహీం కు విద్యుత్ షాక్ తగిలి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మంగళవారం శివపురం చెంచుగూడెంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం. కలగడం వల్ల జూనియర్ లైన్మెన్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో ఒక్కసారిగా వంటిపై దుస్తులు కాలుతూ పక్కన ఉన్న ముల్ల పొదల్లో పడ్డాడు. అపార్శక స్థితిలోకి పడిపోయిన ఇబ్రహీంను గమనించిన స్థానికులు వంటిపై మండుతున్న మంటలను ఆర్పివేసి వెంటనే 108కు సమాచారం తెలిపారు. హుటాహుటిన 108 సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు ఇబ్రహీంకు ప్రథమ చికిత్స అందించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం కర్నూల్ వైద్యశాలకు తరలించారు. అయితే జూనియర్ లైన్మెన్ ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## సౌజన్య డోర్ ఆధ్వర్యంలో టోపీలు పంపిణీ



**కొత్తపల్లి - నంది పత్రిక :** మండలంలో పనిచేస్తున్న పత్రికా విలేకరులకు సౌజన్య డోర్స్ యజమాని జయన్న ఆధ్వర్యంలో టోపిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల విలేకరులు వార్తల నిమిత్తం ప్రతిరోజు గ్రామాలకు వెళ్తున్న సమయంలో వేసవి కాలంలో వడదెబ్బ సోకకుండా కొంతవరకు టోపీలు రక్షణగా ఉంటాయన్నారు. ఎండ తాకిడి తగలకుండా వడదెబ్బ రాకుండా వారి శ్రేయస్సు కోసం చిన్న ఆర్థిక సహాయం గా టోపీలు అందించడం జరిగింది అన్నారు. మండల కేంద్రమైన కొత్తపల్లిలో మంగళవారం సీనియర్ రిపోర్టర్ భూపాల్ ఆధ్వర్యంలో విలేఖర్లకు టోపీలు అందించే కార్యక్రమం చేయడం జరిగింది అన్నారు. ఉదయం నుండి రాత్రి పగులు అనకుండా వార్తలు సేకరణ కోసం నిత్యం ప్రజల్లో ఉండి సేవ చేస్తున్న వారిని గుర్తించి వడదెబ్బ ఎండ దెబ్బ తగలకుండా టోపీలు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఎండాకాలంలో వడదెబ్బ సోక కుండా టోపీలే రక్షణగా ఉంటాయన్నారు. మండలంలోని విలేకరులు టోపీలు అందించిన వారికి కృతజ్ఞత తెలిపారు. ఈ టోపీల కార్యక్రమంలో మండల విలేకరులు ఉన్నారు.

## టీబీ చికిత్సలో ఆయుర్వేదం... భారత్ కీలక ముందడుగు

ప్రపంచ క్షయవ్యాధి (టీబీ) దినోత్సవం సందర్భంగా భారత్ ఒక కీలక ముందడుగు వేసింది. టీబీకి అందించే ప్రామాణిక చికిత్స (ఏటీటీ)కు అదనంగా ఆయుర్వేదాన్ని ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలపై శాస్త్రీయంగా అధ్యయనం చేసేందుకు ప్రపంచంలోనే తొలి క్లినికల్ స్టడీని ప్రారంభించినట్లు కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. ఇవాళ (మార్చి 24) ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా ఈ ప్రకటన వెలువడింది. బయోటెక్నాలజీ విభాగం, ఆయుష్ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఈ అధ్యయనాన్ని నిర్వహిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఎనిమిది సంస్థలలో, కొత్తగా క్షయ వ్యాధి నిర్ధారణ అయిన 1,250 మంది రోగులను ఈ పరిశోధన కోసం ఎంపిక చేయనున్నారు. ప్రామాణిక చికిత్సతో పాటు ఆయుర్వేద మందులు ఇవ్వడం వల్ల రోగుల శరీర బరువు, పోషకాహార ఫలితాలు, వ్యాధి తీవ్రత, జీవన నాణ్యత, భద్రత వంటి అంశాలపై ఎలాంటి ప్రభావం ఉంటుందో అంచనా వేయడమే ఈ అధ్యయనం ముఖ్య ఉద్దేశం. ఈ స్టడీ 'హోల్-ఆఫ్-సైన్స్' (సంపూర్ణ విజ్ఞానం) స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు.

## మాకు న్యాయం చేయండీ సారూ




**కొత్తపల్లి - నంది పత్రిక:** ఎన్ హెచ్ 167 కె నిర్మాణంలో భూమి కోల్పోయిన నష్టపరిహారం అందలేదని మాకు న్యాయం చేయాలని రైతు పాలెం మద్దిలేటి ఆవేధన వ్యక్తం చేశాడు. మంగళవారం పాతమాడుగుల గ్రామ శివారుల్లోని పొలంలో మాకు న్యాయం చేయాలంటూ బ్యానర్ నిరసన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధేశ్వరం రెవెన్యూ సరిహద్దుల్లోని పాతమాడుగుల గ్రామంలో సర్వే నెంబర్ 250 బి లో 1.5 ఎకరాలకు గాను 60 సెంట్లు భూమిని ఎన్హెచ్ 167 కె జాతీయ రహదారి నిర్మాణానికి భూమిని సేకరించారు. అయితే 1బి, అడంగల్, ఇతర దృవపత్రాలు తన పేరుపై ఉన్నాయని కాకపోతే అధికారుల నిర్లక్ష్యం కారణంగా తనకు పడాల్సిన నష్టపరిహారం తన తండ్రిఅయిన పాలెం సుంకన్న బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం డబ్బులు వేసిందన్నారు. మా మధ్య ఉన్న ఇంటి సమస్యల వల్ల తనకు డబ్బులు ఇవ్వడంలేదని వాపోయారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్, ఆత్మకూరు ఆర్డీఓ, కొత్తపల్లి తహసీల్దార్, గ్రామ' వీఆర్వోలకు ధరఖాస్తు పెట్టుకున్నా, తన బాధను మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేధన వ్యక్తం చేశారు. అయితే ఎన్హెచ్ రహదారి అధికారులు తనపాలంలో పనులు ప్రారంభించారని నాకు నష్టపరిహారం ఇవ్వకుండా ఏలా పనులు జరుపుతారని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు తనకు న్యాయం చేయాలని కోరారు.

## సపోటాపండులో ఎలుకల మందు పెట్టి రెండేళ్ల కూతురును చంపిన తండ్రి

తెలంగాణ రాష్ట్రం, యాదాద్రి జిల్లాలో దారుణం జరిగింది. సంస్థాన్నారాయణపురం మండలం, లచ్చులగూడెంలో ఒక కసాయి తండ్రి సపోటా పండులో ఎలుకల మందుపెట్టి కన్నకూతురిని హతమార్చాడు. మూడు రోజులక్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వరికుప్పల రవికి మూడేళ్ల క్రితం స్వాతితో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు రెండేళ్ల మేఘన, తొమ్మిది నెలల మయూరి ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో స్వాతి తన చిన్నకూతురుతో కొద్దిరోజులుగా పుట్టింట్లో ఉంటోంది. పెద్ద కూతురు మేఘన తండ్రివద్ద ఉంటోంది. మేఘనను కూడా తన వద్దకు పంపించాలని స్వాతి కొద్దిరోజులుగా కోరుతోంది. భర్త ఎంతకూ పంపించకపోవడంతో ఆమె మాడ్గులపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. అక్కడి పోలీసులు నారాయణపురం పోలీస్ స్టేషన్కు సమాచారం

## ఉద్యోగులకు పీఆర్సీ వెంటనే పిఆర్సి ప్రకటించాలి - యుటిఎఫ్



**మంత్రాలయం , న్యూస్ :-** ఉద్యోగులకు పిఆర్సి వెంటనే ప్రకటించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు కౌలన్న, సురేష్ బాబు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు చంద్రపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉద్యోగుల ఆర్థిక సమస్యల పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపట్టినట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 1 2023 నుంచి 12వ పిఆర్సి అమలు చేయవలసి ఉండగా, 32 నెలలు పూర్తయినప్పటికీ ఇప్పటికీ అమలు చేయలేదని ఆవేధన వ్యక్తం చేశారు. అదేవిధంగా నాలుగు డీఏ లు పెండింగ్లో ఉన్నాయని వెంటనే విడుదల చేయాలని కోరారు. సిపిఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, మెమో నెంబర్ 57 ను అమలు చేయాలని తెలిపారు. పదవీవిరమణ పొందిన ఉద్యోగులకు గ్రాడ్యుటీ, కమ్యూటేషన్, పిఎఫ్ లోన్లు, ఈఎల్స్ వెంటనే విడుదల చేయాలని, ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులకు మెడికల్ బిల్స్, ఈఎల్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఓంకార్, లింగరాజు, ప్రశాంత్ భూపాల్, జిక్రియ, ఉసేన్, శాంతన్న, అశోక్ కుమార్, లోకనాథ్, విజయ్, రవి, భాస్కర్, రాజు, రామదాసు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## క్షయవ్యాధిపై అవగాహన ర్యాలి

**మహానంది మార్చి 24 (నంది పత్రిక):-** క్షయవ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.మండల పరిధిలోని తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వేణు కార్తికేయ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ ఈ ఓ హుస్సేన్ రెడ్డి, అమినాబీ, శివ, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



# టీబీ వ్యాధి నివారణ పై ప్రజల్లో అవగాహన పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత






### జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి

**భీమవరం బ్యూరో చీఫ్: మార్చి 24, నంది పత్రిక.** క్షయ వ్యాధి నివారణకు సంబంధించి వైద్య చికిత్సలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించడం అందరి బాధ్యత అని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం భీమవరం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించిన క్షయ వ్యాధి అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, టీబీ వ్యాధి నివారణపై ప్రజల్లో అవగాహన పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. టీబీ వ్యాధిగ్రస్తులు పూర్తిగా కోలుకునే వరకు తప్పనిసరిగా డాట్స్ వైద్యం కొనసాగించాలని ఆయన తెలిపారు. జిల్లాలో సుమారు 200 మంది ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించామని, డాట్స్ చికిత్స ద్వారా 95 శాతం వరకు ఈ వ్యాధిని నయం చేయవచ్చని చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ ఈ దిశగా సమర్థవంతమైన సేవలు అందిస్తున్నదని తెలిపారు. ప్రజలకు డాట్స్ చికిత్సపై పూర్తి అవగాహన ఉండాలని, అలాగే మంచి పోషకాహారం తీసుకోవడం ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేసుకోవచ్చని ఆయన సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించే టీబీ మందులు అత్యంత సమర్థవంతంగా పనిచేస్తాయని, వాటిపై ఉన్న అపోహలను నమ్మవద్దని హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సరైన చికిత్స అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స అందుతున్నదని, వైద్యులు ఇచ్చే సూచనలు పాటిస్తే టీబీ వ్యాధి నుండి పూర్తిగా కోలుకోవచ్చని తెలిపారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి ఈరోజు "టీబీ-ముక్త భారత్ అభియాన్" 100 రోజుల అవగాహన ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా "టీబీ-ముక్త భారత్ అభియాన్" 100 రోజుల అవగాహన గోడపత్రికను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. అంతకు ముందు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా వైద్యులు, వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి. గీతాబాయి, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రవిబాబు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మణ్ జిత్ ఆనంద్, ఆసుపత్రి వైద్యులు, ఏఎన్ఎంలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి.. సీపీఐ




**మహానంది, మార్చి నంది పత్రిక 24):-** ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఐ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.మంగళవారం భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపు మేరకు మహానంది లోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా మండల కార్యదర్శి సామేలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.అర్హులైన పేదలకు గ్రామాలలో 3 సెంట్ల ఇంటి స్థలాన్ని ఇవ్వాలని కోరారు.దళితులకు స్మశాన స్థలాలు ఏర్పాటు చేయాలన్నారు.అబ్బీపురం చెంచు కాలనీ వారికి పక్కా గృహాలు నిర్మించాలని కోరారు. అర్హులైన పేదలకు సాగు భూమి ఇవ్వాలన్నారు. అంత్యోదయా బియ్యం కార్డులు మంజూరు చేయాలని కోరారు.బుక్కాపురం గ్రామ సమీపంలో గుర్తించిన ప్రభుత్వ స్థలాన్ని పేదలకు ఇంటి స్థలాలుగా అందించాలని అన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలోని ఆర్ ఐ సుబ్బారావు కు అందజేశారు.ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, లక్ష్మణ్, దస్తగిరి, గురుమూర్తి, లక్ష్మయ్య, వెంకట రామిరెడ్డి, నరసింహ, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పీఎం సూర్య ఘర్ పథకాన్ని అమలు చేయాల్సిన బాధ్యత విద్యుత్ శాఖ అధికారులపై ఉంది





### జిల్లా కలెక్టర్ చదలబడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్: మార్చి 24, నంది పత్రిక** పీఎం సూర్య ఘర్ పథకాన్ని విజయవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత విద్యుత్ శాఖ అధికారులపై ఉందని, లక్ష్యానికి మించి ప్రగతిని సాధించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్య గర్ పథకం పురోగతిపై జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మంగళవారం కలెక్టర్ ఛాంబర్ నందు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సోలార్ ప్యానల్స్ అమరిక జరగకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా భీమవరం, ఆకివీడు, పాలకోడేరు సబ్ డివిజన్ల పనుల పురోగతి తక్కువగా ఉండటంపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ప్యానల్స్ ఏర్పాటు పురోగతి మందగించడానికి గల కారణాలను సమగ్రంగా పరిశీలించి వెంటనే సరిదిద్దే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీఎం సూర్య గర్ పథకం కింద గృహాలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు ద్వారా విద్యుత్ ఖర్చును తగ్గించడమే కాకుండా పునరుత్పత్తి శక్తి వినియోగాన్ని పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనాలు చేకూరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. భీమవరం, ఆకివీడు, పాలకోడేరు మండలాల్లో పెండింగ్‌లో ఉన్న సోలార్ యూనిట్ల స్థాపనను అత్యవసరంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన లక్ష్యాలను సమయపాలనతో పూర్తి చేయాలని, ఈ విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ప్రతి గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను ఈ పథకం వైపు ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి సబ్సిడీల వివరాలు, దరఖాస్తు విధానం గురించి పూర్తి సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ/వార్డు సచివాలయాల స్థాయిలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి లక్ష్య సాధనకు కృషి చేయాలని తెలిపారు. అలాగే పథకం అమలులో ఎదురయ్యే సాంకేతిక, పరిపాలనా సమస్యలను తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం పెంచి పనులు వేగవంతం చేయాలని చెప్పారు. అలాగే ఎస్సీ లబ్ధిదారుల గృహాలకు సోలార్ ప్యానల్స్ అమరిక లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యుత్ శాఖ అధికారి పులి ఉషారాణి, ఈఈలు ఎన్.వెంకటేశ్వరరావు, కె.నరసింహమూర్తి, కె.మధు కుమార్, ఏడీఈలు ఏ.సతీష్, టి.వెంకటేశ్వరరావు, యు.శ్రీనివాసరావు, సి.హెచ్.రామకృష్ణ, డి.రాజీవ్, డి.రామకృష్ణ, బి.దివాకర్, ఎస్.రామకృష్ణ, బి.రామకృష్ణ, పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు, వృద్ధుల ఆదరణ సామాజిక బాధ్యత

## నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ మార్చి 24 నంది పత్రిక** జిల్లా కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ మరియు సంరక్షణ చట్టంపై నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మన దేశంలో తల్లిదండ్రులను కదిలే దేవుళ్లుగా భావిస్తారని, అలాంటి దేశంలో వృద్ధుల సంరక్షణ కోసం ప్రత్యేక చట్టం చేయాల్సి రావడం దురదృష్టకరమన్నారు. చిన్ననాటి నుంచే తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని నేర్చుకున్నప్పటికీ ఆచరణలో లోపం ఉండటంతో వృద్ధుల ఫిర్యాదులు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను, వృద్ధులను గౌరవించి ఆదరించడం ద్వారా సమాజంలో మంచి వ్యక్తులుగా నిలవాలని సూచించారు. మనమందరం ఒక దశలో వృద్ధాప్యాన్ని ఎదుర్కొంటామని గుర్తుంచుకోవాలని, మన ప్రవర్తనే భవిష్యత్తులో మన పిల్లల ప్రవర్తనకు ఆదర్శమవుతుందని పేర్కొన్నారు. యువత తమ లక్ష్యాల మధ్యలో కూడా ఇంటి పెద్దలతో కొంత సమయం గడపాలని, వారితో మాట్లాడడం ద్వారా వారి ఆరోగ్యకరమైన జీవనానికి తోడ్పడవచ్చని తెలిపారు. తల్లిదండ్రుల ఆస్తులపై ఆశ పెట్టుకోకుండా స్వయంగా ఎదగాలని, ప్రేమ, వాత్సల్యంతో వారిని ఆదరించినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి వృద్ధుడు తన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, వృద్ధుల ఫిర్యాదులను స్వీకరించినప్పుడు కుటుంబ సభ్యులతో చర్చించి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రెవిన్యూ, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, చట్టంపై అవగాహనతో పాటు ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. వృద్ధులకు అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి టి.రామ్ కుమార్, నరసాపురం ఆర్డీవో దాసిరాజు, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ కె.చిట్టి వెంకయ్య, భీమవరం యూనిట్ జనరల్ సెక్రటరీ బోనం పాండురంగారావు, కౌన్సిలేషన్ అధికారులు డివిఎస్ చంద్రజీ, ఎం.వెంకటేశ్వరరావు, సభ్యులు ఎస్.ఎస్.ఎన్. రాజు, లీగల్ అథారిటీ ప్రతినిధులు, పోలీస్ అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో ఆర్డబ్ల్యూఎస్ అధికారులు కృషి చేయాలి





### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం: బ్యూరో చీఫ్ మార్చి 24, నంది పత్రిక** జిల్లాలోని ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన త్రాగునీరు అందించే లక్ష్యంతో ఆర్డబ్ల్యూఎస్ అధికారులు కృషి చేయాలని, ఎక్కడా ఫిర్యాదులు రాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సున్నితంగా హెచ్చరించారు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జల జీవన్ మిషన్ పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులు, మెయిల్ ఏజెన్సీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో జల జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలని, పైపులైన్ల నిర్మాణంలో అన్ని శాఖలతో సమన్వయం ఉండాలని సూచించారు. ప్రత్యేకంగా ఆర్ & బి రహదారులు, కాలువల వెంబడి పైపులైన్ పనులు చేపట్టేటప్పుడు సంబంధిత శాఖల అధికారుల సమక్షంలో పనులు జరగాలని తెలిపారు. పైపులైన్ల నిర్మాణంలో ఆక్రమణలు అడ్డువస్తే జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని, వాటి తొలగింపునకు రెవెన్యూ, పోలీస్ శాఖల ద్వారా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో రూ.1400 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన జల జీవన్ మిషన్ పనులు పూర్తయితే 16 మండలాల్లోని 862 గ్రామాలకు సమగ్ర త్రాగునీటి సౌకర్యం అందుతుందని పేర్కొన్నారు. తదనంతరం నిర్వహించిన జిల్లా వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ సమావేశం లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో త్రాగునీటి సమస్యలపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. నిబంధనల ప్రకారం ప్రతి 15 రోజులకు ఒకసారి ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపరచి, శుభ్రపరిచిన తేదీని బోర్డుపై నమోదు చేయాలని ఆదేశించారు. త్రాగునీటి కొరత ఎక్కడా లేకుండా చూడడంతో పాటు క్లోరినేషన్ చేసిన స్వచ్ఛమైన నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పైపులైన్ లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మత్తు చేసి నీరు కలుషితం కాకుండా చూడాలని ఆదేశించారు. కలుషిత నీటి కారణంగా డయేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఇ కె. శ్రీనివాస్, ఆర్ & బి ఎస్.ఇ ఎస్. శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఎస్.ఇ పి. ఉషారాణి, డిపిఓ ఎం.రామనాథరెడ్డి, మెయిల్ గుత్తేదారుడు పీతల వాసు, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# లొల్లలో రూ.3.80 కోట్లతో నిర్మించనున్న బ్రిడ్జికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...

### బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే వాడపల్లి వెళ్లే భక్తులకు మరింత సౌకర్యం...

### వాడపల్లి అభివృద్ధికి ని రంతరం కృషి...



**కొత్తపేట బ్యూరో చీఫ్ మార్చి 24 నందిపత్రిక** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లెల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు.లొల్ల - వాడపల్లి మార్గంలో రూ.3.80 కోట్లతో నిర్మించనున్న బ్రిడ్జికి ఆయన మంగళవారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే లొల్ల మీద నుంచి వాడపల్లి వెళ్ళే భక్తులకు మరింత సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. వేగంగా పనులు పూర్తి చేసి వీలైనంత త్వరగా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. కోనసీమ తిరుమల వాడపల్లి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఉచ్చిలి గ్రామంలో ముదునూరి వీరబాబు స్వంత నిధులు రూ.5లక్షలతో నిర్మించిన మంచినీటి కుళాయిని ప్రారంభించారు. వేసవిలో తాగునీటి కొరత రాకుండా ఈ కుళాయి ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ముదునూరి వీరబాబును అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ,ముదునూరి వెంకటరాజు, కంఠంశెట్టి శ్రీనివాస్, కాయల జగన్నాథం, కొసంపూడి రామకృష్ణరాజు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# మూడేళ్లుగా వరల్డ్ బ్యాంకు 'రెడ్' కేటగిరీలో బంగ్లాదేశ్... కారణం ఇదే!

పొరుగు దేశం బంగ్లాదేశ్‌ను తీవ్రమైన ఆహార ద్రవ్యోల్బణం పట్టి పీడిస్తోంది. దాదాపు మూడేళ్లుగా ఆ దేశం, ఆహార ద్రవ్యోల్బణ ప్రమాదం అధికంగా ఉన్న దేశాల 'రెడ్' కేటగిరీ నుంచి బయటపడలేకపోతోంది. ప్రభుత్వం మధ్యంతరంగా కొన్ని చర్యలు తీసుకోవడంతో మొత్తం ద్రవ్యోల్బణం కాస్త తగ్గినా, గత ఐదు నెలలుగా ఆహార వస్తువుల ధరలు మళ్లీ పెరగడం ఆందోళన కలిగిస్తోందని బంగ్లాదేశ్ మీడియాలో వచ్చిన ఒక కథనం పేర్కొంది. ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన నివేదికలో కూడా బంగ్లాదేశ్ 'రెడ్' కేటగిరీలోనే ఉన్న విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. గత 10 నెలలుగా ఆ దేశంలో ఆహార ద్రవ్యోల్బణం అత్యధిక స్థాయిలో కొనసాగుతోందని నివేదిక స్పష్టం చేసింది. దీని అర్థం బంగ్లాదేశ్‌లో ఆహార అభద్రత ముప్పు ఏమాత్రం తగ్గలేదని, పైగా ప్రస్తుతం కొనసాగుతున్న మధ్యప్రాచ్య సంక్షోభం కారణంగా ఇది మరింత పెరిగే అవకాశం ఉందని ఢాకాకు చెందిన 'ప్రథమ్ ఆలో' పత్రిక విశ్లేషించింది. ఈ జాబితాలో బంగ్లాదేశ్‌తో పాటు మరో 13 దేశాలు (ఇథియోపియా, మొజాంబిక్, అంగోలా, ఘనా, రష్యా, ఉక్రెయిన్ తదితర దేశాలు) కూడా ఉన్నాయి. ఆహార ద్రవ్యోల్బణం ఈ స్థాయిలో పెరగడం చాలా ఆందోళనకరమని ప్రైవేట్ పరిశోధనా సంస్థ 'సౌత్ ఏషియన్ నెట్‌వర్క్ ఆన్ ఎకనామిక్ మోడలింగ్' (ఎస్ఏఎన్ఈఎం) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సెలిమ్ రైహాన్ అన్నారు. మధ్యప్రాచ్య సంక్షోభం ఇలాగే కొనసాగితే, అది దేశ దిగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ఫలితంగా ద్రవ్యోల్బణం మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. పొరుగు దేశాలతో పోలిస్తే ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడంలో బంగ్లాదేశ్ చాలా వరకు విఫలమైందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఏజెన్సీల ప్రకారం ద్రవ్యోల్బణం 8.5 శాతం నుంచి 9 శాతం మధ్య ఉందని చెబుతున్నప్పటికీ, వాస్తవానికి ఇది ఇంకా ఎక్కువగానే ఉందని నివేదికలు చెబుతున్నాయి.

# మతం మారితే ఎస్సీ హక్కులు కోల్పోతారు

**క్రిష్టియానిటిలో కుల వ్యవస్థ లేదు**

**క్రిష్టియన్ మతం స్వీకరిస్తే ఎస్సీ,ఎస్టీ హక్కులు ఉండవు**

**హిందువుల,సిక్కు, బౌద్ధ మత్‌స్థులకే కుల హక్కులు**

**ఎపి హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం కోర్టు**

మతమార్పిడికి సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మతం మారిన ఎస్సీలకు ఆ హోదా ఉండదని స్పష్టం చేసింది. క్రిష్టియన్‌లోకి మారిన వారికి ఎస్సీ కింద లభించే వెసలుబాటు ఉండదని తేల్చింది. మతం మారితన తరవాత అట్రాసిటీ చట్టం కింద కేసులపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. క్రైస్తవంలోకి మారిన వారు ఎస్సీ హక్కులు పొందలేరని స్పష్టం చేసింది. హిందువులు, బౌద్ధులు, సిక్కులు మాత్రమే ఆ హక్కులు పొందుతారని పేర్కొంది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ చింతాడ ఆనంద్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టి.. మంగలశారం తుది ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలో పాస్టర్ చింతాడ ఆనంద్ ఎటువంటి అనుమతులు లేకుండా చర్చి నిర్వహించడంపై అక్కల రామిరెడ్డితో పాటు స్థానికులు అభ్యంతరం తెలిపారు. వారిపై అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఆనంద్ కేసు పెట్టారు. ఆ కేసును కొట్టివేయాలంటూ రామిరెడ్డి, స్థానికులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. చింతాడ ఆనంద్ పాస్టర్‌గా పనిచేస్తుండటంతో క్రైస్తవుడవుతారని.. రాజ్యాంగం ప్రకారం షెడ్యూలు కులాలకు సంబంధం ఉండదని రామిరెడ్డి తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. పుట్టుకతో హిందువు అయినా.. క్రైస్తవం స్వీకరించడంతో ఆనంద్ షెడ్యూల్ కులానికి చెందరని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అట్రాసిటీ చట్టంలోని సెక్షన్లు ఆయనకు వర్తించవని, ఫిర్యాదు చట్ట వ్యతిరేకమని.. తమపై పెట్టిన కేసుకు విచారణార్హత లేదని వాదించారు. రామిరెడ్డి తరఫు న్యాయవాదుల వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. క్రైస్తవ మతంలో కులవ్యవస్థ లేదని పేర్కొంది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన వారికే ఎస్సీ హక్కులు పొందే అర్హత ఉంటుందని స్పష్టం చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆనంద్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ అంజరియా ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు తీర్పును సమర్థించింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లోని వారు మాత్రమే ఎస్సీ హోదాకు అర్హులని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలా కాకుండా మతం మారితే ఎస్సీ హోదా రద్దవుతుందని తేల్చి చెప్పింది. క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరని స్పష్టం చేసింది. పాస్టర్ ఆనంద్ దశాబ్దానికి పైగా క్రైస్తవంలో ఉన్నారని.. తిరిగి మారలేదని నిరూపణ అయిందని ధర్మాసనం పేర్కొంది.

## విజయవాడ హైవేలో ఎలివేటెడ్ కారిడార్

## అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి కోమటిరెడ్డి

రాష్ట్రంలో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం అధికా ప్రాధాన్యం ఇస్తోందని ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళికలో చేర్చిన తర్వాత డీపీఆర్ తయారు చేస్తారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ట్రాఫిక్ రద్దీగా ఉందని, రామోజీ ఫిల్మ్ సిటీ దాటిన తర్వాత ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు కావాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో.. ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై నారాయణరెడ్డి ప్రశ్నించారు. తన నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ దాటిన తర్వాత పనామా వద్ద ఫ్లై ఓవర్ మంజూరు చేయించినందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. విజయవాడకు రెండు, మూడు గంటల్లో చేరే విధంగా.. డబుల్‌డెక్కర్ రోడ్డును మంజూరు చేయించుకున్నామన్నారు.

## అంబేడ్కర్ ఓవర్సీస్ పథకంతో 2వేల మందికి లబ్ది

విదేశీ విద్య ఉపకార వేతనాల పథకాన్ని ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. 2023 నుంచి ఇప్పటి వరకు అంబేడ్కర్ ఓవర్సీస్ పథకం ద్వారా సుమారు 2వేల మంది విద్యార్థులకు విదేశీ విద్య ద్వారా ఉపకార వేతనాలు చెల్లించామని చెప్పారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. దీనికోసం ఇప్పటి వరకు రూ.607 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. విదేశాల్లో చదువుకునే వారికి ఈ పథకం కింద నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తుందని చెప్పారు. అంతకుముందు కేటీఆర్ మాట్లాడుతూ 2025 అక్టోబర్‌లో విదేశీ విద్య ఉపకార వేతనాలు ఇస్తామని చెప్పినా ఇవ్వలేదన్నారు. విదేశాలకు వెళ్లిన విద్యార్థులు దీనికోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. అక్కడ ఫీజులు కట్టలేక.. ఇక్కడికి రాలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం దీన్ని ప్రాధాన్య అంశంగా తీసుకుని అమలు చేయాలని కోరారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ విదేశీ విద్య ఉపకార వేతనాలు ఎస్సీ వర్గాలకే మేలు చేస్తాయన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ఎ÷-లాన్‌ను వంద శాతం అమలు చేయాలని.. దీంతో ఆయా వర్గాలకు న్యాయం జరగుతుందని చెప్పారు. ఇప్పటి వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయలేదని.. కోనేరు రంగారావు సిఫార్సులను అమలు చేయడం లేదన్నారు. మాల, మాదిగలకు వేర్వేరు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని చెప్పినా.. ఇప్పటి వరకు దానికి సంబంధించిన విధి విధానాలు రూపొందించలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

# జిహెచ్ఎంసి అభివృద్ధికి ప్రణాళికలు

**రూ.15 వేల కోట్లు నిధులు మంజూరు**

**మేడ్చెల్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్న మల్లారెడ్డి**

**అసెంబ్లీలో సమాధానం ఇచ్చిన మంత్రి శ్రీధర్ బాబు**

బిఆర్ఎస్ ప్రభుత్వం మొదలు పెట్టిన పనులకు తాము నిధులు మంజూరు చేశామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మున్సిపల్ శాఖ అభివృద్ధికి సంబందించి.. సిఎం రేవత్ రెడ్డి ఓ ప్రణాళికను తీసుకున్నారని అన్నారు. అసెంబ్లీలోలో సభ్యులు అడిగిన ప్రశ్నల సందర్భంగా శ్రీధర్

బాబు మున్సిపల్ శాఖ అభివృద్ధికి సంబందించిన విషయంపై మాట్లాడారు. జిహెచ్ఎంసి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు నిధులు మంజూరు చేశామని, రూ. 122 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఎమ్మెల్యేలు చెప్పారని తెలియజేశారు. 2016 లో ఎస్ఆర్ డిపిని తీసుకువచ్చారని, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. 15 రోజుల్లో పనులు ప్రారంభిస్తామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. జవహర్ నగర్ ప్రాంతం తన గుండెకాయ అని మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. హైదరాబాద్ చెత్త అంత అక్కడే వేస్తున్నారని అన్నారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై ఆయన ప్రస్తావించారు. ఇన్ చార్జి మంత్రి శ్రీధర్ బాబు అంటే తనకు చాలా అభిమానం అని తెలియజేశారు. చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హయాంలో ఏర్పాటు చేశారని, మేడ్చల్ నియోజకవర్గాన్ని అతలాకుతలం చేశారని విమర్శించారు. జవహర్ నగర్ చెత్తతో రెండున్నర లక్షల మంది అవస్థలు పడుతున్నారని, వాసన భరించలేకపోతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేగా ఎందుకు గెలిచానా అని అనిపిస్తుందని, తనపై కుట్ర పన్నుతున్నారని మల్లారెడ్డి ధ్వజమెత్తారు. మేడ్చల్ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని అన్నారు. మేడ్చల్ ప్రాంతాన్ని జీహెచ్ఎంసీ పరిధిలోకి తీసుకొచ్చారు. కానీ, కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ మోరీలు, కరెంటు స్తంభాలు లేవు. జవహర్‌నగర్‌లో చెత్త కొండ పేరుకుపోతోంది. వాతావరణ కాలుష్యంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీధరన్నా మీకు దండం పెడతా. మాపై పగపట్టకండి. దయచేసి మేడ్చల్ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించండి' అని మల్లారెడ్డి కోరారు. అలాగే గత పదేళ్లుగా రోడ్లు, డ్రైనేజీలు లేవని వ్యాఖ్యానించారు. దీనిపై శ్రీధర్ బాబు స్పందించారు. నిజాలు చెప్పినందుకు మల్లారెడ్డిని అభినందించారు. గత పదేళ్లగా అభివృద్ధి జరగలేదని తాము అంటున్నామని అన్నారు. ఇదిలావుంటే రేవంత్ రెడ్డిని సీఎంని చేసింది తానేనని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. రెడ్డి సామాజిక వర్గంలో రేవంత్ తప్ప మరెవరూ పవర్‌ఫుల్ నాయకుడు లేరని రెడ్డి సంఘం సమావేశంలో తానే చెప్పానని గుర్తుచేశారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ చేశారు. ఎవరు అవునన్నా, కాదన్నా తాను, రేవంత్ అన్నదమ్ములమేనని చెప్పారు.

# సీట్లు పెరిగితే రాజకీయ పార్టీలకు పండగే !

రాజకీయ పార్టీలు కోరుకున్నట్లుగానేడిలీమిటేషన్‌కు రంగం సిద్ధం అవుతోంది. దీంతో పార్లమెంట్ సీట్లు, అసెంబ్లీ సీట్లు పెరగడం ద్వారా రాజకీయ పార్టీలకు బహుళ ప్రయోజనం కలుగనుంది. ఆయా పార్టీలకు మరికొందరు ఎంపిలు, ఎమ్మెల్యేలు వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే పునర్విభజన జరితే బాగా ఆనందించేది రాజకీయ పార్టీలు తప్ప ప్రజలు కాదు. ఈ విభజన ద్వారా సీట్లు పెకిగితే ప్రజలకు ఒరిగేదేమీ లేదు. రాజకీయ నాయకుల్లో రిజర్వేషన్లు పెట్టాలి. గతంలో ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన వారు మరోమారు ఆ పదవులకు అనర్హులుగా ప్రకటించాలి. ఈ బిల్లులో అలాటి ప్రతిపాదన ఏదైనా పెడితే మంచిది. కేవలం రెండు టర్మ్‌లే పదవి అన్న రూల్ రావాలి. కానీ ఈ చట్టం తెస్తున్నవారు, తేవాలని కోరుకుంటున్న వారంతా పదవులకు అతుక్కుపోయిన వారే. అందువల్ల ఇప్పట్లో ఇది సాధ్యం కాదు. ఎంపిలు, ఎమ్మెల్యేలు పెరిగితే దేశం మీద మరింత ఆర్థిక భారం పడనుంది. వారి జీతభత్యాలు, పెన్షన్లు తడిసి మోపెడు అవుతాయి. ఇదంతా ప్రజలు కట్టే పన్నులనుంచే చెల్లిస్తారు. కనీసం ప్రజాప్రతినిధులకు జీతభత్యాలు, పెన్షన్లు లేకుండా చేసినా మంచిదే. రెండేసి పెనషన్లు ముందుగా ఎత్తేయాలి. అదికూడా చేస్తారని అనుకోవడానికి లేదు. దేశం ఏమయినా ఫర్వాలేదు..వీరికి జీతాలు, పెన్షన్లు రావాల్సిందే. అయితే మహిళా రిజర్వేషన్ల వల్ల వారి సీట్లు పెరగడం, వారి ప్ఆరతినిధ్యం పెరగడం ఒక్కటే ఆనందించదగ్గ విషయం. ఇకపోతే దేశంలో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనను 2011 జనాభా లెక్కల ఆధారంగా జరిపించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలాగే.. లోక్‌సభలో, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం కోటా కల్పించే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని కూడా 2011 జనాభా లెక్కల ఆధారంగా అమలు చేసేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే ఈ మేరకు రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. ఈ బిల్లుల ఆమోదం కోసం శని, ఆదివారాలు కూడా పార్లమెంట్ సమావేశాలు జరిపించాలని, అవసరమైతే సమావేశాలను ఏప్రిల్ 2 నుంచి మరో వారం వరకు పొడిగించాలని ప్రభుత్వం భావిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపును వ్యతిరేకించడంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీని ప్రకారం ప్రతి రాష్ట్రంలోనూ ఇప్పుడున్న నియోజకవర్గాల్లో 50 శాతం అదనంగా నియోజకవర్గాలు చేరే అవకాశాలున్నాయి. ఫలితంగా లోక్‌సభ సభ్యుల సంఖ్య 816కు చేరే అవకాశం ఉంది. 816 సీట్లయితే.. అందులో 273 సీట్లు మహిళలకు రిజర్వు అవుతాయి. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే.. తెలంగాణలో లోక్‌సభ సీట్లు 25 లేదా 26కు, అసెంబ్లీ సీట్లు 178 లేదా 179కి పెరిగే అవకాశాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు ప్రస్తుతం ఉన్న 25 నుంచి 37-38కి, అసెంబ్లీ సీట్లు 262-263కు పెరగొచ్చు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దీనిపై తెలుగుదేశం, బిజూ జనతాదళ్, వైసీపీ, శివసేన (యూబీటీ), మజ్లిస్ తదితర పార్టీలతో చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో డిలిమిటేషన్ కూడా ఉంది. తెలుగు రాష్ట్రాల రాజకీయ నేతలు ఎంతో కాలంగా డీలిమిటేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గాల పునర్విభజన, సీట్ల పెంపు అన్నీ కూడా 2029 సాధారణ ఎన్నికల నుండి అమలులోకి రానున్నాయి. ఈ పరిణామంతో ఇరు రాష్ట్రాల్లోని ప్రధాన రాజకీయ పార్టీల్లో నూతనోత్సాహం నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో అప్పుడే లెక్కలు వేసుకుంటున్నారు. నాయకులు కూడా ఇప్పటి నుంచే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటారు. బిజెపి కూడా యా రాష్ట్రాల్లో సీట్లు పెరగాలని, తమ ప్రాతినిధ్యం కూడా పెరగాలని కోరుకుంటోంది. ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రులు అమిత్ షా, కిరణ్ రిజిజు, అర్జున్ రామ్ మేఘవాల్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా, దేశవ్యాప్తంగా లోక్‌సభ మరియు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను 50 శాతం మేర పెంచాలని కేంద్రం భావిస్తోంది. దీనికి సంబంధించిన బిల్లును ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టేలా పావులు కదుపుతోంది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా లోక్‌సభ స్థానాలు 543 నుండి 816కి పెరుగుతాయి. అన్ని రాష్ట్రాల్లోని మొత్తం అసెంబ్లీ స్థానాలు 4,123 నుండి 6,185కి చేరుతాయి. ఇకప ఎపిలో ప్రస్తుతం ఉన్న 175 నుండి 263కి పెరుగుతాయి.ప్రస్తుతం ఉన్న 25 ఎంపి స్థానాలు 38కి పెరుగుతాయి. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 119 నుండి 179కి పెరుగుతాయి.

లోక్‌సభ స్థానాలు ప్రస్తుతం ఉన్న 17 నుండి 26కి పెరుగుతాయి. నియోజకవర్గాల పునర్విభజనకు 2011 లేదా 2027 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకునే అవకాశం ఉంది. వచ్చే ఏడాది మార్చి నాటికి దేశవ్యాప్తంగా జనగణన పక్రియ పూర్తి కానుంది. ఆ నివేదిక రాగానే పునర్విభజన పనులను వేగవంతం చేయాలని అధికారులు భావిస్తున్నారు. సాధారణంగా జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల పెంపులో అన్యాయం జరుగుతుందనే ఆందోళన ఉంది. అయితే, అన్ని రాష్ట్రాల్లోనూ సమానంగా 50 శాతం సీట్లు పెంచడం ద్వారా ఈ వ్యత్యాసాన్ని తగ్గించవచ్చని కేంద్రం అంచనా వేస్తోంది. ఈ ప్రతిపాదనపై ప్రతిపక్ష కాంగ్రెస్ మరియు ఇతర మిత్రపక్షాల స్పందన ఎలా ఉంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అయితే పెంపుదల అందరూ కోరుకుంటున్నదే కనుక ఇందులో ఏకాభిప్రాయం తప్పకుండా వస్తుంది. మిగా విషయాల్లో కానరాదు.

## నగరంలో పెట్రోల్,డీజిల్ కొరత లేదు

## బంకుల వద్ద బారులు తీరవద్దు

:హైదరాబాద్ నగరంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత ఉందంటూ వస్తున్న వార్తలపై నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ స్పందించారు. నగరంలో ఇంధన నిల్వలు నిండుకున్నాయనేది కేవలం అపోహ మాత్రమేనని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.నగరవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీల దగ్గర సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా ఎక్కడా ఆగిపోలేదని సీపీ తెలిపారు. కొరత ఉందన్న ఆందోళనతో పెట్రోల్ బంక్‌ల వద్ద భారీగా క్యూ కట్టవద్దని, అనవసరంగా ఇంధనాన్ని నిల్వ చేసుకోవడానికి ప్రయత్నించవద్దని ఆయన పౌరులకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ సిటీ పోలీస్ యంత్రాంగం ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని, రవాణా సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటు న్నామని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను వదంతులను నమ్మవద్దని, వాటిని ఇతరులకు షేర్ చేయవద్దని సీపీ హెచ్చరించారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని సూచించారు. నగరంలో సాధారణ పరిస్థితులు కొనసాగేందుకు ప్రజలందరూ సహకరించాలని సీపీ కోరారు. రద్దీ వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, అత్యవసరమైతే తప్ప బంక్‌ల వద్ద బారులు తీరవద్దని సూచించారు. సోషల్ మీడియా పుకార్లు నమ్మవద్దన్నారు.

## భద్రాద్రిలో కళ్యాణోత్సవానికి భారీగా ఏర్పాట్లు

## 27న కళ్యాణం, 28న పట్టాభిషేక మహోత్సవాలు

భద్రగిరిలో శ్రీరామనవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేం దుకు చురుకుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ మేరకు జిల్లా యంత్రాంగం నిమగ్నమయ్యింది. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ప్రభుత్వం కూడా ఆదేశించింది. గవర్నర్, సిఎంలకు కూడా ఇప్పటికే ఆహ్వానాలు అందచేశారు. 27న జరిగే సీతారాముల కల్యాణం, 28న జరిగే మహా పట్టాభిషేకం కార్యక్రమాలను ఎలాంటి లోటుపాట్లు, అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పూర్తిచేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అధికారులను ఆదేశించారు. దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావుతో కలిసి ఆమె హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ నిర్వంహించారు. ఈ వీసీకి భద్రాచలం సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ అంకిత్, సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ హాజరయ్యారు. ఈ సందర్భంగా శైలజారామయ్యర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి తగిన కార్యాచరణతో పని చేయాలన్నారు. ఇక నవమి రోజున 27న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాద్రి రానున్నారని, అదేరోజు ఆయన చేతుల మీదుగా ఆలయాభివృద్ధి పనులకు భూమి పూజ కార్యక్రమం ఉంటుందని.. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లతో పాటు శిలాఫలం ఏర్పాటు పనులు పూర్తి చేయాలన్నారు. ఇక పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ , తదిత భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. మిథిలా స్టేడియంలో ప్రజాప్రతినిధులు, వీవీఐపీలు, వీఐపీలతో పాటు రామయ్య దర్శనానికి వచ్చే సాధారణ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. భద్రాచలంలో మిథిలా స్టేడియంలో జరుగుతున్న శ్రీరామనవమి ఏర్పాట్లను కలెక్టర్ అంకిత్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేడియంలో విధులు నిర్వహించే సెక్టార్ అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. 26న ఉదయం 9గంటల వరకు సబ్‌కలెక్టరు కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. సక్రమంగా విధులు నిర్వహించాలని, భక్తులకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు.

## మార్చి 25న ప్రారంభమయ్యే సదరం స్లాట్ బుకింగ్‌ను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**భీమవరం బ్యూరో చీఫ్ మార్చి 24 నంది పత్రిక** జిల్లాలోని దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ల జారీని మరింత పారదర్శకంగా, సులభతరం చేయడానికి డిజిటల్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ మేరకు మార్చి 25 నుండి సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభం కానుందని వెల్లడించారు. దివ్యాంగత్వ నిర్ధారణ పరీక్షల నిర్వహణ కోసం మార్చి 30, 31 తేదీలతో పాటు ఏప్రిల్, మే నెలల్లో కూడా టోకెన్లు జారీ చేయనున్నట్లు తెలిపారు. దివ్యాంగులు ముందుగా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని నిర్ణీత తేదీల్లో హాజరై పరీక్షలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇకపై సదరం సర్టిఫికెట్లు పూర్తిగా డిజిటల్ విధానంలోనే జారీ చేయబడతాయని తెలిపారు. దీంతో సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు, పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. గతంలో అమలులో ఉన్న కుష్ఠ నయం, దృష్టి లోపం, వినికిడి లోపం, లోకోమోటర్ (చలనం) వైకల్యం, మానసిక వైకల్యం, మల్టిపుల్ డిసేబిలిటీ, ఆటిజం తదితర 21 రకాల వైకల్యాలతో పాటు, తాజాగా మరిన్ని వైకల్యాలను కూడా జాబితాలో చేర్చినట్లు తెలిపారు. ముఖ్యంగా యాసిడ్ దాడి బాధితులు, స్పీచ్ అండ్ లాంగ్వేజ్ డిసార్డర్, అభ్యాస వైకల్యం, ఆటిజం స్పెక్ట్రమ్ డిసార్డర్, బహుళ వైకల్యం వంటి కొత్త కేటగిరీలను చేర్చడం ద్వారా మరింత మంది అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనం కలగనున్నదన్నారు. సదరం సర్టిఫికెట్ పొందాల్సిన అర్హులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సర్టిఫికెట్లు పొందాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అలాగే దరఖాస్తు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు.

## ఏప్రిల్ 26న కడప లో బ్రాహ్మణ సమ్మేళనం, వివాహ పరిచయ వేదిక..

**వధూ వరుల వివరాలు 20 వ తేదీ లోపల పంపించండి.....**

**బ్రాహ్మణ చైతన్య వేదిక నంద్యాల జిల్లా అధ్యక్షుడు కె.పి.వి. సుబ్బారావు.....**



**ఆళ్లగడ్డ, ప్రతినిధి మార్చి24 నంది పత్రిక నంది పత్రిక** ,వచ్చే ఏప్రిల్ నెల 26 వతేదీన కడపలో బ్రాహ్మణ సమ్మేళనం మరియు వివాహపరిచయ వేదికను రాష్ట్రబ్రాహ్మణ చైతన్య వేదిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు బ్రాహ్మణచైతన్య వేదిక నంద్యాల జిల్లా అధ్యక్షులు కె. పి. వి. సుబ్బారావు పేర్కొన్నారు.ఆయన ఆళ్లగడ్డ పట్టణములో మీడియా సమావేశములో మంగళవారము మాట్లాడారు. వచ్చే ఏప్రిల్ నెల 26వ తేదీ కడపలోబ్రాహ్మణ సమ్మేళనం మరియువివాహ పరిచయ వేదిక కార్య క్రమాన్ని నంద్యాల జిల్లాబ్రాహ్మణ బంధువులు, బ్రాహ్మణ వధూ వరులు, తల్లి తండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని బ్రాహ్మణ చైతన్య వేదిక నంద్యాల జిల్లాఅధ్యక్షులు కె.పి.వి. సుబ్బారావు బ్రాహ్మణ బంధువులందరికీ పిలుపు నిచ్చారు. వధూ,వరుల వివరాలను ఏప్రిల్ నెల 20వ తేదీ లోగా కెపివి సుబ్బారావు బ్రాహ్మణ చైతన్య వేదిక నంద్యాల జిల్లా అధ్యక్షులు మొబైల్ నెంబర్ 9440351012 కు వాట్సప్ ద్వారా తల్లితండ్రులు పంపించాలనివధూవరుల తల్లి తండ్రులకు ఆయన విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాలకు పై ఫోన్ నెంబర్ కు కాంటాక్ట్ చేసి తెలుసుకోవచ్చునని కూడా ఆయన తెలిపారు.

## పేదలకు ఇల్లస్థలాలు ఇవ్వాలని సీపీఐ నిరసన



**బనగానపల్లె మార్చి 24నందిపత్రిక** బనగానపల్లె పట్టణంలో ఇల్లులేని నిరుపేదలకు ఇల్లాస్థలాలు ఇవ్వాలని మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో బనగానపల్లె పట్టణం లో పెట్రోల్ బంక్ కూడలి నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు వందలాది మంది బాధితులతో నిరసన ర్యాలీ చేపట్టి ఆర్డీఓ కార్యాలయం వద్ద కు చేరుకొని అక్కడ తమ నిరసన గళాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మాట్లాడుతూ బనగానపల్లె పట్టణంలో నివసిస్తున్న నిరుపేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని గ్రామీణ ప్రాంతాల్లో నివసించే నిరుపేదలకు మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు ఇవాళ సిమెంటు ఇటుక ఇసుక కంకర ధరలు ఆకాశం అంటుతున్న వేళ ముడి సరుకులు తీసుకుపోవాలంటే ఇవాళ ప్రభుత్వం తీసుకొచ్చిన విధానం రాయల్టీ విధానం పేద ప్రజలపై భారం పడుతుంది వారి సమస్యలు అడిగినప్పుడు ఇల్లు అద్దెలు కట్టలేక ఇబ్బంది పడుతున్నాం నిత్యావసర ధరలు పెరుగుతున్న వేళ స్కూల్లో ఫీజులు పెరుగుతున్న వేళ ఒక్కరోజు అద్దె కట్టడం లేట్ అయితే నాన్న మాటలు అంటున్నారు ఇంటి యజమానులు ఒక పూట పస్తులున్న సరే ఇంటి అద్దె కట్టాల్సిందే అని ప్రజలు వారి గోడు వెల్లడించడం జరిగింది కావున నియోజకవర్గ శాసనస భ్యులు రోడ్లు భవనాల శాఖ మంత్రి గౌరవ శ్రీ బీసీ జనార్దన్ రెడ్డి గారికి నిరుపేదల పక్షాన ఆపిల్ చేస్తూ పల్లెల్లో పనులు లేక ప స్తువులతో చావలేక బనగానపల్లె పట్టణంలో చిన్న కొట్టు పెట్టుకొని బజ్జీల బండి పెట్టుకొని చిన్న వ్యాపారం పెట్టుకొని పిల్లల చదివించుకుంటూ జీవనం కొనసాగించాలని నమ్ముకుని ఎంతోమంది నిరుపేదలు జీవనం సాగిస్తున్న అలాంటి పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించుకోవడానికి ఆర్థిక సహాయం ఇవ్వాలని గ్రామీణ ప్రాంతాల్లో నివసించే నిరుపేదలకు స్థలం ఇచ్చి నిర్మించుకోవడానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని పేదల పక్షాన విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు సుబ్బారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎర్రి స్వామి సిపిఐ మండల ఏపీ మహిళా సమాఖ్య మండల కార్యదర్శి స్వరూప మండల సమితి సభ్యులు శివ నాగయ్య, సిపిఐ మాల మహానాడు నాగరాజు సిపిఐ నాయకులు సుబ్బయ్య,నారాయణ గంగన్న తెలుగు రాముడు రాళ్ల కొత్తూరు రాధాకృష్ణ దాదాపుగా భారీ సంఖ్యలో బాధిత మహిళలు పాల్గొన్నారు

## కొనసాగనున్న ఆర్డీటి సేవలు

## కేంద్రం అనుమతితో యధావిధిగా కార్యక్రమాలు

తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న ఆర్డీటీ కార్యకలాపాలు ఇకపై నిరంతరాయంగా కొనసాగనున్నాయి. ఆర్డీటీ సేవలు ఆగిపోకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వంతో ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ ప్రకారం ఆర్డీటీకి అవసరమైన అనుమతులు మంజూరయ్యాయి. దీంతో సంస్థకు ఎదురైన పరిపాలనా అడ్డంకులు తొలగిపోయాయి. ఆర్డీటీ డైరెక్టర్ మంచో ఫెర్రర్ స్థాపించిన ఈ సంస్థ ద్వారా దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల్లో అందుతున్న సేవలు వెలకట్టలేనివి.అనంతపురం జిల్లాతో పాటు యావత్ రాయలసీమ ప్రాంత అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ కు కేంద్ర ప్రభుత్వం నుంచి ఈఅఖీం పునరుద్ధరణ లభించడం ఒక చారిత్రాత్మక విజయంగా నిలిచింది. అనంతపురం జిల్లా సామాజిక, ఆర్థిక చిత్రపటాన్ని మార్చేసిన ఆర్డీటీ సంస్థకు ఉన్న అతిపెద్ద అడ్డంకి తొలగిపోయింది.

# మతం మారితే ఎస్సీ హక్కులు కోల్పోతారు

**క్రిస్టియానిటిలో కుల వ్యవస్థ లేదు**

**క్రిష్టియన్ మతం స్వీకరిస్తే ఎస్సీ,ఎస్టీ హక్కులు ఉండవు**

**హిందువుల,సిక్కు, బౌద్ద మతస్థులకే కుల హక్కులు**

**ఎపి హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం కోర్టు**

మతమార్పిడికి సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మతం మారిన ఎస్సీలకు ఆ హోదా ఉండదని స్పష్టం చేసింది. క్రిష్టియన్‌లోకి మారిన వారికి ఎస్సీ కింద లభించే వెసలుబాటు ఉండదని తేల్చింది. మతం మారితన తరవాత అట్రాసిటీ చట్టం కింద కేసులపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. క్రైస్తవంలోకి మారిన వారు ఎస్సీ హక్కులు పొందలేరని స్పష్టం చేసింది. హిందువులు, బౌద్ధులు, సిక్కులు మాత్రమే ఆ హక్కులు పొందుతారని పేర్కొంది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ చింతాడ ఆనంద్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టి.. మంగలశారం తుది ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలో పాస్టర్ చింతాడ ఆనంద్ ఎటువంటి అనుమతులు లేకుండా చర్చి నిర్వహిం చడంపై అక్కల రామిరెడ్డితో పాటు స్థానికులు అభ్యంతరం తెలిపారు. వారిపై అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఆనంద్ కేసు పెట్టారు. ఆ కేసును కొట్టివేయాలంటూ రామిరెడ్డి, స్థానికులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. చింతాడ ఆనంద్ పాస్టర్‌గా పనిచేస్తుండటంతో క్రైస్తవుడ వుతారని.. రాజ్యాంగం ప్రకారం షెడ్యూలు కులాలకు సంబంధం ఉండదని రామిరెడ్డి తరఫు న్యాయవాదులు వాద నలు వినిపించారు. పుట్టుకతో హిందువు అయినా.. క్రైస్తవం స్వీకరించడంతో ఆనంద్ షెడ్యూల్ కులానికి చెందరని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అట్రాసిటీ చట్టంలోని సెక్షన్లు ఆయనకు వర్తించవని, ఫిర్యాదు చట్ట వ్యతిరేకమని.. తమపై పెట్టిన కేసుకు విచారణార్హత లేదని వాదించారు. రామిరెడ్డి తరఫు న్యాయవాదుల వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. క్రైస్తవ మతంలో కులవ్యవస్థ లేదని పేర్కొంది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన వారికే ఎస్సీ హక్కులు పొందే అర్హత ఉంటుందని స్పష్టం చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆనంద్ సుప్రీంకోర్టును ఆశ్ర యించారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ అంజరియా ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు తీర్పును సమర్థించింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లోని వారు మాత్రమే ఎస్సీ హోదాకు అర్హులని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలా కాకుండా మతం మారితే ఎస్సీ హోదా రద్దవుతుందని తేల్చి చెప్పింది. క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరని స్పష్టం చేసింది. పాస్టర్ ఆనంద్ దశాబ్దానికి పైగా క్రైస్తవంలో ఉన్నారని.. తిరిగి మారలేదని నిరూపణ అయిందని ధర్మాసనం పేర్కొంది.

## ఆసుపత్రి నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాతలకు సన్మానం



బనగానపల్లె మండలంలోని పసుపల గ్రామంలో ప్రభుత్వ వైద్యశాల ఏర్పాటుకు గ్రామానికి చెందిన మఠం రామలింగయ్య శాస్త్రి కుమారులు మఠం విశ్వనాథ శాస్త్రి, మఠం సిద్ధ రామస్వామి లో 7 సెంట్లు స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. మంగళవారం గ్రామ పెద్దలు ఎస్ జనార్ధన్ రెడ్డి, ఎన్ రామస్వామి, మొట్టి. రామదాసు,మధుసూద నాయుడు,నాగశేఖరప్ప, రామయ్య, పి నాగరాజు, నాగలింగమయ్య,బాల నాయుడు,పరమేశ్వరప్ప స్థలం విరాళం ఇచ్చిన దాతలుమఠం విశ్వనాథ శాస్త్రి, మఠం సిద్ధ రామస్వామి సన్మానించారు ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ పసుపుల గ్రామానికి చెందిన మఠం విశ్వనాథ శాస్త్రి, మఠం సిద్ధ రామస్వామి ప్రస్తుతం కర్నూల్ లో నివాసం ఉంటున్న గ్రామం పై ప్రేమతో ఏడు సెంట్ల స్థలాన్ని వైద్యశాల నిర్మాణానికి విరాళంగా ఇచ్చారని తెలిపారు. గ్రామానికి 7 సెంట్లు స్థలాన్ని రాసి ఇచ్చారని ,ప్రభుత్వానికి సొంత ఖర్చులతో రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వైద్యశాల నిర్మాణానికి 7 సీట్లు స్థలాన్ని ఇచ్చిన దాతలకు గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

## విజయవాడ హైవేలో ఎలివేటెడ్ కారిడార్

### అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి కోమటిరెడ్డి

రాష్ట్రంలో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం అధికా ప్రాధాన్యం ఇస్తోందని ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళికలో చేర్చిన తర్వాత డీపీఆర్ తయారు చేస్తారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ట్రాఫిక్ రద్దీగా ఉందని, రామోజీ ఫిల్మ్ సిటీ దాటిన తర్వాత ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు కావాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో.. ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై నారాయణరెడ్డి ప్రశ్నించారు. తన నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ దాటిన తర్వాత పనామా వద్ద ఫ్లై ఓవర్ మంజూరు చేయించినందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. విజయవాడకు రెండు, మూడు గంటల్లో చేరే విధంగా.. డబుల్‌డెక్కర్ రోడ్డును మంజూరు చేయించుకున్నామన్నారు.

## అంబేడ్కర్ ఓవర్సీస్ పథకంతో 2వేల మందికి లబ్ది

### అసెంబ్లీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వెల్లడి

విదేశీ విద్య ఉపకార వేతనాల పథకాన్ని ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. 2023 నుంచి ఇప్పటి వరకు అంబేడ్కర్ ఓవర్సీస్ పథకం ద్వారా సుమారు 2వేల మంది విద్యార్థులకు విదేశీ విద్య ద్వారా ఉపకార వేతనాలు చెల్లించామని చెప్పారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. దీనికోసం ఇప్పటి వరకు రూ.607 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. విదేశాల్లో చదువుకునే వారికి ఈ పథకం కింద నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తుందని చెప్పారు. అంతకుముందు కేటీఆర్ మాట్లాడుతూ 2025 అక్టోబర్‌లో విదేశీ విద్య ఉపకార వేతనాలు ఇస్తామని చెప్పినా ఇవ్వలేదన్నారు. విదేశాలకు వెళ్లిన విద్యార్థులు దీనికోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. అక్కడ ఫీజులు కట్టలేక.. ఇక్కడికి రాలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం దీన్ని ప్రాధాన్య అంశంగా తీసుకుని అమలు చేయాలని కోరారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ విదేశీ విద్య ఉపకార వేతనాలు ఎస్సీ వర్గాలకే మేలు చేస్తాయన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను వంద శాతం అమలు చేయాలని.. దీంతో ఆయా వర్గాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ఇప్పటి వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయలేదని.. కోనేరు రంగారావు సిఫార్సులను అమలు చేయడం లేదన్నారు. మాల, మాదిగలకు వేర్వేరు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని చెప్పినా.. ఇప్పటి వరకు దానికి సంబంధించిన విధి విధానాలు రూపొందించలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

## జిహెచ్ఎంసి అభివృద్ధికి ప్రణాళికలు

**రూ.15 వేల కోట్లు నిధులు మంజూరు**

**మేడ్చెల్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్న మల్లారెడ్డి**

**అసెంబ్లీలో సమాధానం ఇచ్చిన మంత్రి శ్రీధర్ బాబు**

బిఆర్ఎస్ ప్రభుత్వం మొదలు పెట్టిన పనులకు తాము నిధులు మంజూరు చేశామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మున్సిపల్ శాఖ అభివృద్ధికి సంబందించి.. సిఎం రేవత్ రెడ్డి ఓ ప్రణాళికను తీసుకున్నారని అన్నారు. అసెంబ్లీలోలో సభ్యులు అడిగిన ప్రశ్నల సందర్భంగా శ్రీధర్ బాబు మున్సిపల్ శాఖ అభివృద్ధికి సంబందించిన విషయంపై మాట్లాడారు. జిహెచ్ఎంసి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు నిధులు మంజూరు చేశామని, రూ. 122 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఎమ్మెల్యేలు చెప్పారని తెలియజేశారు. 2016 లో ఎస్ఆర్ డిపిని తీసుకువచ్చారని, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. 15 రోజుల్లో పనులు ప్రారంభిస్తామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. జవహర్ నగర్ ప్రాంతం తన గుండెకాయ అని మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. హైదరాబాద్ చెత్త అంత అక్కడే వేస్తున్నారని అన్నారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై ఆయన ప్రస్తావించారు. ఇన్ చార్జి మంత్రి శ్రీధర్ బాబు అంటే తనకు చాలా అభిమానం అని తెలియజేశారు. చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హయాంలో ఏర్పాటు చేశారని, మేడ్చల్ నియోజకవర్గాన్ని అతలాకుతలం చేశారని విమర్శించారు. జవహర్ నగర్ చెత్తతో రెండున్నర లక్షల మంది అవస్థలు పడుతున్నారని, వాసన భరించలేకపోతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేగా ఎందుకు గెలిచానా అని అనిపిస్తుందని, తనపై కుట్ర పన్నుతున్నారని మల్లారెడ్డి ధ్వజమెత్తారు. మేడ్చల్ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని అన్నారు. మేడ్చల్ ప్రాంతాన్ని జీహెచ్ఎంసీ పరిధిలోకి తీసుకొచ్చారు. కానీ, కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ మోరీలు, కరెంటు స్తంభాలు లేవు. జవహర్‌నగర్‌లో చెత్త కొండ పేరుకుపోతోంది. వాతావరణ కాలుష్యంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీధరన్నా మీకు దండం పెడతా. మాపై పగపట్టకండి. దయచేసి మేడ్చల్ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించండి' అని మల్లారెడ్డి కోరారు. అలాగే గత పదేళ్లుగా రోడ్లు, డ్రైనేజీలు లేవని వ్యాఖ్యానించారు. దీనిపై శ్రీధర్ బాబు స్పందించారు. నిజాలు చెప్పినందుకు మల్లారెడ్డిని అభినందించారు. గత పదేళ్లగా అభివృద్ధి జరగలేదని తాము అంటున్నామని అన్నారు. ఇదిలావుంటే రేవంత్ రెడ్డిని సీఎంని చేసింది తానేనని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. రెడ్డి సామాజిక వర్గంలో రేవంత్ తప్ప మరెవరూ పవర్‌ఫుల్ నాయకుడు లేరని రెడ్డి సంఘం సమావేశంలో తానే చెప్పానని గుర్తుచేశారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ చేశారు. ఎవరు అవునన్నా, కాదన్నా తాను, రేవంత్ అన్నదమ్ములమేనని చెప్పారు.

## బోర్డర్ లో 'కాఫీ షాప్' తెరిచిన భారత సైన్యం

భారత సైన్యం అరుణాచల్ ప్రదేశ్‌లోని మారుమూల సరిహద్దు ప్రాంతంలో ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'ఆపరేషన్ సద్భావన'లో భాగంగా తవాంగ్ జిల్లా జెమితాంగ్ గ్రామంలో 'బోర్డర్ బ్రూ కేఫ్' పేరిట ఓ కాఫీ షాప్ ను ప్రారంభించింది. స్థానిక గిరిజన సమాజ అభివృద్ధి, పర్యాటకాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు రక్షణ శాఖ అధికారులు మంగళవారం తెలిపారు. ఈ కేఫ్ ద్వారా స్థానిక మోన్పా గిరిజన తెగ వారికి సాధికారత కల్పించడం, స్థిరమైన జీవనోపాధి అవకాశాలు సృష్టించడం ముఖ్య ఉద్దేశం. ఈ కేఫ్ నిర్మాణంలోనే ఒక ప్రత్యేకత ఉంది. జెమితాంగ్ లోయ గుండా ప్రవహించే న్యామ్జంగ్ చు నదిపై, వాడకంలో లేని పాత బ్రైలీ వంతెన మీద దీనిని నిర్మించారు. ఒక వారసత్వ కట్టడాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా మార్చి వినియోగించడం ఈశాన్య రాష్ట్రాల్లోనే ఇది మొదటిసారని రక్షణ శాఖ ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ మహేంద్ర రావత్ తెలిపారు. ఈ కేఫ్ ఈ సుందరమైన సరిహద్దు ప్రాంతాన్ని సందర్శించే పర్యాటకులకు ఒక ఐకానిక్ గమ్యస్థానంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## రైతు సంబరాల విజేతలకు బహుమతులు



**బనగానపల్లె మార్చి 24నందిపత్రిక** నందవరం చౌడేశ్వరి మాత జ్యోతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన రైతు సంబరాల్లో సీనియర్స్ విభాగంలో గెలుపొందిన ఎడ్ల జతల యజమానులకు ఆలయ చైర్మన్ నాగార్జున రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కుమార్ రెడ్డి మంగళవారం విజేతలకు బహుమతులు అందజేశారు గెలుపొందివారిలో సీనియర్ విభాగం మార్తల చంద్ర ఓబుల్ రెడ్డి చౌటపల్లి ప్రొద్దుటూరు 3613.8 అడుగులు లాగి మొదటి బహుమతి గెలుచుకోగా రెండవ బహుమతి కాసేనేని రాజా చౌదరి వల్లభనేని మోహన్ రావు గన్నవరం విజయవాడ 3341.7 3 సుంకి సురేందర్ రెడ్డి హుజూర్నగర్ సూర్యాపేట జిల్లా 3177 4వ ది పెరుమాళ్ళ శివకృష్ణ యాదవ్ కల్లూరు ప్రొద్దుటూరు మండలం కడప జిల్లా 3141.9, 5వది బో రెడ్డి కేశవరెడ్డి పెద్దకోటల నంద్యాల మండలం నంద్యాల జిల్లా 2893 6 వది పావులూరు వీరాస్వామి చౌదరి బల్లికురవ 2811.5,7 వది రామ సుబ్బారెడ్డి హుస్సేనాపురం&& బొజ్జ విద్య ఓబుల్ రెడ్డి రోకవారిపల్లె 2721.4,8వది తోట తిరుపాలరెడ్డి మేడిమాకులపల్లి అనంతపురం జిల్లా 2700 9 వది గుత్తి ఆదిల్ అక్కంపేట గ్రామం కమలాపురం మండలం కడప జిల్లా 2334.3 గెలుపొందినట్లు నిర్వాహకులు తెలిపారు పోటీలకు వ్యాఖ్యాతగా గంగారు చంద్రమోహన్ రెడ్డి వ్యవహరించినట్లు తెలిపారు.

## తర్తూరు శ్రీ శ్రీ శ్రీ రంగనాథ స్వామి రథోత్సవానికి మరియు శ్రీరామ వేడుకలకు ఎమ్మెల్యే గిత్త జయసూర్యకు ఆహ్వానం




**జూపాడుబంగ్లా :మార్చి: 24: (నంది పత్రిక )** మండల పరిధిలోని తుడిచెర్ల గ్రామం కనకయ్య కొట్టాల గ్రామ ప్రజలకు సంయుక్తముగా నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాలకు మరియు తర్తూరు గ్రామంలో శ్రీశ్రీ శ్రీ రంగనాథ స్వామి రథోత్సవ జాతరకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈసందర్భంగా ఈ మేరకు ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.మీరు ముఖ్యఅతిథిగా విచ్చేసి జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మా గ్రామ ప్రజల తరఫున కోరుకుంటున్నాము. ఈ కార్యక్రమం టిడిపి నాయకులు రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, తర్తూరు రమణారెడ్డి, తర్తూరు దేవస్థానం కమిటీ చైర్మన్ మందడి నారాయణరెడ్డి, దొరబాబు రెడ్డి కడియం పుల్లన్న యాదవ్, కాగుల శంకర్ యాదవ్, కొట్టు పుల్లయ్య, మహంకాళి గురువయ్య, జంపాల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి నాణ్యత గురించి (ఎఫ్ టి కే )శిక్షణ..

### ఆర్ డబ్ల్యుఎస్ డిఈ శ్రీనివాస్ రెడ్డి



**జూపాడుబంగ్లా: మార్చి: 24: (నంది పత్రిక)** మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం తాగునీటి నాణ్యత గురించి (ఎఫ్ టి కే) పై పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు,శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్డబ్ల్యూఎస్ డి ఈ శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డి ఈ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి గుణాత్మకతకును స్థానికముగా పరీక్షించడానికి ఎఫ్ టి కే అంటే ఫీల్డ్ టెస్ట్ కిట్ ఇది ఒక చిన్న కిట్ దీని సహాయముతో నీటిలో ఉన్న కొన్ని ముఖ్యమైన రసాయనాల స్థాయిని అక్కడికి అక్కడే పరీక్షించుకోవచ్చు.. గ్రామాల్లో తాగునీటి నాణ్యతను స్థానికముగా పరీక్షించడం ప్రజలకు సురక్షితమైన నీరు అందించడం జరుగుతుంది అన్నారు.శుభ్రమైన బాటల్ ఉపయోగించడం కాలుష్యం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్షలు చేయడానికి ముందు చేతులు శుభ్రంగా ఉండాలన్నారు. గ్రామాలలో నీటి కాలుష్యం త్వరగా గుర్తించవచ్చు ఆరోగ్య సమస్యలు ఫ్లోరోసిన్ మొదలైనవి నీటి వ్యాధులు నివారించవచ్చు. పరీక్ష ఫలితాలను నమోదు చేయాలి అని తెలిపారు. నీరు ఆమ్లము లేదా క్షార లక్షణము కలిగిందో తెలుసుకోవచ్చు అన్నారు. కిట్టు గడుపుతేది చెక్ చేసుకోవాలి. ప్రతి పరీక్ష తర్వాత పరికరాలను శుభ్రం చేయాలి. నిలువ నీటి కంటే ప్రవాహ నీటిని తీసుకోవడం మంచిది అన్నారు. మసకదనం నీరు ఎంత స్పష్టంగా ఉందో చూపుతుంది అన్నారు. నీటి నమూనాను సరిగా సేకరించండి పరీక్ష ఫలితాలను సరిగా గమనించండి రియా జెంట్లను ఉపయోగించి నీటి నమూనాను పరీక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్రబాబు, డిప్యూటీ ఎంపీడీవో జె .మోహన్ నాయక్, పంచాయతీ కార్యదర్శులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఆర్డబ్ల్యూఎస్ మరియు సంబంధించిన సిబ్బంది పాల్గొన్నారు.




## మూడేళ్లుగా వరల్డ్ బ్యాంకు 'రెడ్' కేటగిరీలో బంగ్లాదేశ్...

పొరుగు దేశం బంగ్లాదేశ్‌ను తీవ్రమైన ఆహార ద్రవ్యోల్బణం పట్టి పీడిస్తోంది. దాదాపు మూడేళ్లుగా ఆ దేశం, ఆహార ద్రవ్యోల్బణ ప్రమాదం అధికంగా ఉన్న దేశాల 'రెడ్' కేటగిరీ నుంచి బయటపడలేకపోతోంది. ప్రభుత్వం మధ్యంతరంగా కొన్ని చర్యలు తీసుకోవడంతో మొత్తం ద్రవ్యోల్బణం కాస్త తగ్గినా, గత ఐదు నెలలుగా ఆహార వస్తువుల ధరలు మళ్లీ పెరగడం ఆందోళన కలిగిస్తోందని బంగ్లాదేశ్ మీడియాలో వచ్చిన ఒక కథనం పేర్కొంది. ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన నివేదికలో కూడా బంగ్లాదేశ్ 'రెడ్' కేటగిరీలోనే ఉన్న విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. గత 10 నెలలుగా ఆ దేశంలో ఆహార ద్రవ్యోల్బణం అత్యధిక స్థాయిలో కొనసాగుతోందని నివేదిక స్పష్టం చేసింది.

## స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన ఉత్తరాంధ్రకు చారిత్రాత్మక మలుపు:

### ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**విజయవాడ బ్యూరో చీఫ్ మార్చి 24 నంది పత్రిక**

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధికి నూతన దిశగా అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్‌నిప్పాన్ స్టీల్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న భారీ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన చారిత్రాత్మక ఘట్టమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య అన్నారు. మంగళవారం నాడు తన కార్యాలయంలో విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త యుగానికి నాంది పలుకుతోందని పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్రాజెక్టులలో ఒకటిగా రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్టుకు సోమవారం కేంద్రమంత్రి కుమారస్వామి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేయడం రాష్ట్రానికి గర్వకారణమని ఆమె తెలిపారు. సుమారు రూ.1,35,964 కోట్ల పెట్టుబడితో నిర్మితమవుతున్న ఈ సమీకృత ఉక్కు కర్మాగారం దేశ ఉక్కు తయారీ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామిక రంగంలో ముందంజలో నిలబెడుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా లక్షకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు కలుగనున్నాయని, ముఖ్యంగా స్థానిక యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక శిక్షణ వంటి దీర్ఘకాలిక అవకాశాలు లభించనున్నాయని తంగిరాల సౌమ్య వివరించారు. స్కిల్ డెవలప్మెంట్, టెక్నికల్ ట్రైనింగ్, అనుబంధ పరిశ్రమల విస్తరణతో ఉత్తరాంధ్ర యువత భవిష్యత్తు బలపడుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న "స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్", పారదర్శక పారిశ్రామిక విధానాలు, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడంలో కీలక పాత్ర పోషించాయని ఆమె పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్ రాకతో ఉత్తరాంధ్ర ప్రాంతం ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందని, పోర్టు కనెక్టివిటీ, రహదారులు, రైల్వే సదుపాయాలు మెరుగుపడి లాజిస్టిక్స్ రంగం బలోపేతం అవుతుందని ఆమె అన్నారు. ఎంఎస్ఎంఈలు, చిన్న పరిశ్రమలు, అనుబంధ వ్యాపారాలు అభివృద్ధి చెంది స్థానిక ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఎత్తున ఊతం లభిస్తుందని వెల్లడించారు. విశాఖను రాష్ట్ర ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దే దిశగా ఈ ప్రాజెక్టు కీలకమని, రాష్ట్ర జీడీపీ వృద్ధి, పారిశ్రామిక విస్తరణ, పెట్టుబడుల ప్రవాహం పెరగడానికి ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందని తంగిరాల సౌమ్య అభిప్రాయపడ్డారు. "ఇది కేవలం ఒక స్టీల్ ప్లాంట్ కాదు.. ఆంధ్రప్రదేశ్ యువత భవిష్యత్తును మార్చే ఉపాధి యంత్రం" అని ఆమె వ్యాఖ్యానించారు. ఈ పరిశ్రమ రాకపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా హర్షం వ్యక్తం చేస్తూ స్పందించడం ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను మరింత స్పష్టం చేస్తోందని ఆమె తెలిపారు. రెండు దశల్లో నిర్మాణం పూర్తి కానున్న ఈ స్టీల్ ప్లాంట్‌ను 5,465 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారు. మొదటి దశలో ఏడాదికి 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం, రెండో దశలో 10.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2030 జూన్ నాటికి తొలి బ్లాస్ట్ ఫర్నేస్, అదే ఏడాది డిసెంబరు నాటికి రెండో బ్లాస్ట్ ఫర్నేస్ అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు.

స్టీల్ ప్లాంట్‌తో పాటు 50 ఎంటీపీఏ సామర్థ్యంతో క్యాప్టివ్ పోర్టును కూడా అభివృద్ధి చేయనున్నారని తెలిపారు. రూ.11,192 కోట్లతో 316 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఈ పోర్టు ద్వారా మరో 6 వేల మందికి ఉపాధి లభించనుంది. పోర్టును జాతీయ రహదారితో అనుసంధానించేలా నాలుగు లేన్ల రహదారి నిర్మాణం కూడా చేపట్టనున్నారని చెప్పారు. మొత్తంగా ఈ ప్రాజెక్టు ఉత్తరాంధ్రను పారిశ్రామిక, ఆర్థిక, ఉపాధి కేంద్రంగా తీర్చిదిద్దే చారిత్రాత్మక నిర్ణయమని, రాష్ట్ర అభివృద్ధి పటంలో ఇది సువర్ణాక్షరాలతో నిలిచిపోతుందని తంగిరాల సౌమ్య పేర్కొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ వాడపల్లి వేంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవాలు...





## భక్తుల సౌకర్యాలే ప్రథమ కర్తవ్యంగా చర్యలు... స్వామివారి దివ్య కళ్యాణోత్సవ కరపత్రాల ఆవిష్కరణ, సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు..

**కొత్తపేట బ్యూరో చీఫ్ మార్చి 24 నంది పత్రిక** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక దివ్య కళ్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవ ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ఉత్సవ కమిటీ సమీక్షా సమావేశంలో ఆయన ఆలయ పాలకమండలి చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు పాలకమండలి సభ్యులు, వివిధ శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ స్వామివారి కల్యాణోత్సవములు ఈనెల 28వ తేదీ తేదీన సాయంత్రం 5 గంటలకు ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయని తెలిపారు. ఏప్రిల్ మూడో తేదీ వరకు ఏడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయని వెల్లడించారు. భక్తుల సౌకర్యాలే ప్రథమ కర్తవ్యంగా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకొని భారీ స్థాయిలో కళ్యాణోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులకు ఎక్కడ ఎటువంటి లోటుపాట్లు లేకుండా, ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసామన్నారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, హెల్త్, ఫైర్, హెడ్ వర్క్స్ తదితర శాఖల అధికారులు ఈ క్రతువులో నిమగ్నులవుతారని తెలిపారు. ఇప్పటికే ఏడు వారాల వెంకన్న, ఏడు శనివారాలు, ఏడు ప్రదక్షిణలు, ఏడేడు జన్మల పుణ్యఫలంగా స్వామివారి ఘనకీర్తి ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తుందన్నారు. ఈ వైభవాన్ని ఇంకా ఇనుమడింప చేయడం కోసం అందరం బాధ్యతగా వ్యవహరిస్తున్నామన్నారు. మన స్వామి వారు, మన వాడపల్లి,మన స్వామివారి కల్యాణోత్సవం అనే భావనతో అందరూ కలిసి ఈ కళ్యాణోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.





# జనగణనలో ఖచ్చితత్వం, ప్రమాణాలను తూచా పాటించాలి..!!

### డిఆర్వో & జిల్లా గణన అధికారి విశ్వేశ్వర నాయుడు



**కడప, బ్యూరో చీఫ్ మార్చి 24 : నంది పత్రిక** సమాచారం సేకరణలో ఖచ్చితత్వం మరియు ప్రమాణాలను పాటించే విధానాలపై దృష్టి సారించాలని జిల్లా రెవెన్యూ అధికారి మరియు జిల్లా గణన అధికారి విశ్వేశ్వర నాయుడు ఫీల్డ్ ట్రైనర్లకు సూచించారు.మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో భారత సెన్సస్2027 జనగణన కార్యక్రమంకు సంబంధించి నిర్వహణకు సంబంధించి.. మూడవ స్థాయి శిక్షణలో భాగంగా ఫీల్డ్ ట్రైనర్లకు 2వ రోజు శిక్షణ కార్యక్రమానికి డీఆర్ఓ విశ్వేశ్వర నాయుడు ముఖ్య అతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ.. మే 1 నుండి 30 వరకు నిర్వహించనున్న జిల్లాలో జరగనున్న సర్వే కి సంబంధించి ఫీల్డ్ ట్రైనర్స్ కు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 2027 జనాభా గణన రెండు దశల్లో జరుగుతుందని తెలిపారు. మొదటి దశలో ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణన మరియు రెండవ దశలో జనాభా గణన నిర్వహించబడుతుందన్నారు. రెండవ దశలో కుల గణన కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. మొదటి దశను మే 1 నుంచి మే 30 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణలో జనాభా గణన జిల్లా ఇంచార్జి మరియు మాస్టర్ ట్రైనర్ మోహన్ రమణ మాట్లాడుతూ.. మూడవ దశ శిక్షణలో భాగంగా రెండవ రోజు నిర్వహించిన సెషన్‌లో, గృహ జాబితా మరియు గృహ గణనలో అడగబోయే మొత్తం 34 ప్రశ్నలను ఫీల్డ్ ట్రైనర్లకు విశదంగా వివరిస్తూ, సమాచారం సేకరణలో ఖచ్చితత్వం మరియు ప్రమాణాలను పాటించే విధానాలపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 2027 జనాభా గణనను సమగ్రంగా డిజిటల్ విధానంలో నిర్వహించాలన్నారు. అదేవిధంగా, హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ (ుూు) యాప్ యొక్క ముఖ్య ఫీచర్లు, వినియోగ విధానం పై సమగ్ర అవగాహన కల్పించారు. స్వీయ గణన (ూవశ్రీట జుఅబఎవతీఝఅశీఅ) విధానపు ప్రాముఖ్యతను, దాని ద్వారా సమయపాలన, ఖచ్చితత్వం, పారదర్శకత వంటి ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో సెన్సెస్ ఆఫ్ ఇండియా విభాగం నుండి ప్రత్యేక అధికారుల ద్వారా ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో నిర్వహించే జనగణన సర్వే నిర్వహణపై జిల్లా, మున్సిపల్, ఛార్జ్ లెవెల్ సెన్సెన్ సర్వే నిర్వాహకులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు.15 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఈ జన గణన కార్యక్రమం 2027 ఇప్పటి వరకు 16 గణాంక సర్వేగా నమోదవుతుందన్నారు. స్వాతంత్ర్యానంతరం 1952 మొదటగా ప్రారంభం కాగా ప్రస్తుతం 8వ జన గణన కార్యక్రమం నిర్వహించుకోవడం జరుగుతోంది. రూ. 13 వేల కోట్ల అంచనా వ్యయంతో.. 16 ప్రాంతీయ భాషల్లో డిజిటల్ విధానంలో కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించడం జరుగుతోందన్నారు. కాగా మాస్టర్ ట్రైనర్లు ప్రొఫెసర్లు శ్రీనివాసులు, సుదర్శన్ రెడ్డి, ఆదిలక్ష్మి, ఫీల్డ్ ట్రైనర్లకు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనగణన ఇన్‌చార్జ్ మోహన్ రమణ, డిప్యూటీ కలెక్టర్ కిరణ్ కుమార్. తదితరులు పాల్గొన్నారు.

# దేశానికే అత్యుత్తమ మోడల్ గా స్మార్ట్ కిచెన్ వ్యవస్థ..!

### న్యూఢిల్లీలో "నేషనల్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ సమ్మిట్ 2026" లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి




**వై ఎస్ ఆర్ కడప, బ్యూరో చీఫ్ మార్చి 24 నంది పత్రిక:** వైఎస్ఆర్ కడప జిల్లాలో వినూత్నంగా చేపట్టిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ విధానం ద్వారా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం విద్యార్థుల సంక్షేమానికి ఒక మైలురాయిగా నిలుస్తోందని... స్మార్ట్ కిచెన్ వ్యవస్థ రాష్ట్రానికే కాక దేశంలోనే ఒక ఉత్తమ నమూనాగా నిలుస్తోందని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సగర్వంగా తెలిపారు.సోమవారం న్యూఢిల్లీ ప్రగతి విహార్ లోని స్కోప్ కన్వెన్షన్ సెంటర్ లో ఈ నెల 23,24 వ తేదీలలో రెండు రోజుల పాటు"నేషనల్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ సమ్మిట్ 2026" నిర్వహించగా... సమ్మిట్ లో మంగళ వారం 2వ రోజు కార్యక్రమంలో.. వైఎస్ఆర్ కడప జిల్లా లో వినూత్నంగా అమలవుతున్న స్మార్ట్ కిచెన్ ప్రాజెక్ట్ నిర్వహణపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. స్మార్ట్ కిచెన్లతో వైఎస్ఆర్ కడప జిల్లాలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం విద్యార్థుల ఆరోగ్యం మరియు విద్యార్థుల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని అమలు చేస్తున్న ఈ మధ్యాహ్న భోజన పథకం నకు సాంకేతికత సహాయంతో కొత్త దశను చేరుకుంది. స్మార్ట్ కిచెన్ల వినియోగం ద్వారా ఈ పథకం అమలు విధానం పారదర్శకంగా, సమర్థవంతం గా మారి,విద్యార్థుల జీవితాల్లో స్పష్టమైన మార్పును తీసుకొస్తోందన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్లలో పెద్ద మొత్తంలో మధ్యాహ్న భోజన తయారీకి అనుకూలంగా స్మార్ట్ కిచెన్ ని రూపొందించడం జరిగిందన్నారు.అందులో భాగంగా.. జూతీవంంబతీఅంవస రైస్ , కుకింగ్ మరియు బల్క్ కుకింగ్ యూనిట్లు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. స్టీమ్ ఆధారిత వంట విధానాన్ని అవలంభించడం ద్వారా పోషక విలువలను కాపాడేందుకు దోహదం చేస్తుందన్నారు. అత్యధిక నాణ్యత ప్రమాణాల ప్రకారం పదార్థాల నిల్వ పూర్తి గా శుభ్రతను పాటించే కిచెన్ పరిసరాలు (×ూు ప్రమాణాలకు సమానం) లను వినియోగించడం ద్వారా చిన్నపాటి మానవ తప్పిదాలు కూడా తగ్గి,ప్రతి రోజు ఒకే స్థాయి నాణ్యతతో భోజనం తయారు చేయడం జరుగుతోందన్నారు. స్మార్ట్ కిచెన్ల నిర్వహణలో విద్యార్థులకు పోషక విలువలతో కూడిన రుచికరమైన భోజనం అందడమే కాకుండా.. స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు కూడా కల్పించ గలుగుతున్నామన్నారు. వారికి శిక్షణ ఇచ్చి కిచెన్ కార్యకలాపాల్లో భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా గ్రామీణ ఆర్థికాభివృద్ధి కి కూడా దోహదం జరుగుతోందన్నారు. ఈ స్మార్ట్ కిచెన్ వ్యవస్థ అమలు ను పర్యవేక్షించేందుకు ఆధునిక డిజిటల్ వ్యవస్థలు అమలు చేస్తున్నామని, ఃూు ట్రాకింగ్ ద్వారా వాహనాల కదలికలు, కిచెన్ కార్యకలాపాలు మానిటరింగ్ చేయడం వల్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంచ గలుగుతున్నామన్నారు. 2025 సెప్టెంబర్ 2న రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్ గారి చేతుల మీదుగా ప్రారంభించబడిన స్మార్ట్ కిచెన్ వ్యవస్థ.. ప్రస్తుతం జిల్లాలోని నాలుగు మండలాల్లో 5 స్మార్ట్ కిచెన్లు, 13 వాహనాల ద్వారా 133 పాఠశాలల్లో 10,512 మంది విద్యార్థులకు మధ్యాహ్న బడి భోజనాన్ని సరఫరా చేయడం జరుగుతోందన్నారు. స్మార్ట్ కిచన్ల ద్వారా ఇప్పటివరకు 9,33,232 భోజనాలను విద్యార్థులకు అందించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 33 మండలాలలో స్మార్ట్ కిచెన్ విధానం ను అమలు చేసేందుకు నిర్మాణ పనులు త్వరితగతిన జరుగు తున్నాయని,మరో మాసంలో పనులను పూర్తి చేసి వాటిని ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.విద్యార్థుల తల్లిదండ్రులు 100% సంతృప్తిని వ్యక్తం చేయగా.. వైఎస్ఆర్ కడప జిల్లాలో విజయవంతంగా అమలు అవుతున్న ఈ స్మార్ట్ కిచెన్ వ్యవస్థ రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు కూడా ఆదర్శంగా నిలుస్తోందన్నారు. భవిష్యత్తులో ఈ విధానాన్ని మరింత విస్తరించేందుకు ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు కూడామొగ్గుచూపుతున్నాయన్నారు. జిల్లా యంత్రాంగం సంకల్పానికి సాంకేతికత, ప్రభుత్వ సహకారం, సమర్థవంతమైన అమలు మొదలైన మూడింటి కలయికతో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం నిర్వహణ.. ఒక విజయగాథగా నిలిచిందన్నారు.ఇది కేవలం భోజన పథకం మాత్రమే కాదని,ఇది విద్యార్థుల ఆరోగ్యానికి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది అని జిల్లా కలెక్టర్ వివరించారు.

# భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్న కూటమి ప్రభుత్వం.





### -మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు .

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో చీఫ్, మైలవరం, 24 నంది పత్రిక** ఏపీ రాష్ట్ర ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం బలమైన పునాదులు వేస్తోందని, దీంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు.మైలవరం మండలంలోని పొందుగల గ్రామంలో రూ.36 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.12 లక్షల ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ నిధులతో నిర్మించిన సిమెంట్ రహదారిని ప్రారంభించారు. తొలుత గ్రామంలో శివాలయంలో స్వామివారిని, దేవతా మూర్తులను దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు మాట్లాడుతూ అనకాపల్లిలో స్టీల్ ప్లాంట్ ద్వారా ఏపీకి రూ.1.50 లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షకు పైగా ఉద్యోగాలు వస్తాయన్నారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం దిశగా దార్శనికులు సీఎం చంద్రబాబు గారు కృషి చేస్తున్నారన్నారు. ఒక్క మార్చి నెలలో దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించే 'దివ్యాంగ శక్తి' పథకాన్ని అమలు, 10 వేల పోస్టులతో భారీ జాబ్ క్యాలెండరు, ఏటా డీఎస్సీ ద్వారా 25 వేల టీచర్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. ఇమామ్లు, మౌజన్ల వేతనాలు రూ.45 కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అయిన స్త్రీ శక్తి, తల్లికి వందనం, దీపం 2.0, అన్నదాత సుఖీభవ, పేదలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇచ్చిన హామీలే కాకుండా, ఇవ్వని హామీలను కూడా కూటమి ప్రభుత్వం నెరవేర్చుతుందన్నారు.మైలవరం నియోజకవర్గంలో ఇప్పటివరకు పేదల సంక్షేమ పథకాల అమలుకు సుమారు రూ.ఇప్పటికి మొత్తం రూ.446.05 కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశామన్నారు. పల్లెపండుగలో భాగంగా రూ.32.92కోట్లతో సీసీ రోడ్లు నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) గారు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి



### ఘనంగా ముగిసిన నెట్టకల్ క్రికెట్ టోర్నమెంట్ ముఖ్యఅతిథిగా హాజరైన టిడిపి యువ నాయకులు సిద్ధార్థ నాయుడు

**ఆదోని నంది పత్రిక ప్రతినిధి** విద్యతోపాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని టిడిపి యువ నాయకులు సిద్ధార్థ నాయుడు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నెట్టేకల్ గ్రామంలో ఉగాది పండుగ పురస్కరించుకొని నెట్టేకల్ ఛాలెంజర్స్ ట్రోఫీ క్రికెట్ పోటీలు నిర్వహించారు. మంగళవారం ఫైనల్ మ్యాచ్లో తారాపురం వర్సెస్ నెట్టేకల్ టీములో పోటీ పడగా తారాపురం విజయం సాధించింది. ఫైనల్ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సిద్ధార్థ నాయుడు ముందుగా గెలుపు పొందిన తారాపురం జట్టుకు మరియు రన్నప్ గా నిలిచిన నెట్టకల్ టీములకు ఆయన షీల్డ్ తో పాటు నగదు అందించారు. మొదటి బహుమతి సిద్ధార్థ నాయుడు 20016లో అందించడం జరిగింది. రెండవ బహుమతి మహేష్ యాదవ్ 15016 ను అందించడం జరిగింది. ఈ సందర్భంగా సిద్ధార్థ నాయుడు మాట్లాడుతూ గ్రామాలలో ఇలాంటి క్రీడలు నిర్వహించడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసమని, క్రీడలతో కూడా ఉన్నత స్థాయిలో ఉండొచ్చని తెలిపారు. ఆదోని నియోజకవర్గం లో చాలా గ్రామాలలో ఇలాంటి టోర్నమెంట్ నిర్వహించడం తమకెంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఇలాంటి టోర్నమెంట్ నిర్వహించే వారందరికీ కూడా తమ పార్టీ అండదండలు ఉంటుందని పేర్కొన్నారు.నెట్టకల్ గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోటీలు నిర్వహించిన వారందరికీ ఆయన ప్రశంసించారు. అనంతరం మహేష్ యాదవ్ మాట్లాడుతూ నెట్టేకల్ ఛాలెంజర్స్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ కు సహకరించిన ప్రతి ఒక్కరికి కూడా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. క్రీడలకు కాకుండా నెట్టేకల్ గ్రామ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు మరియు ఉమాపతి నాయుడు ఎప్పుడు కూడా సహాయ సహకారాలు అందిస్తారని పేర్కొన్నారు. అదే బాటలో యువ నాయకులు సిద్ధార్థ నాయుడు మరియు మారుతి నాయుడు కూడా క్రీడలతోపాటు గ్రామ అభివృద్ధికి ఎప్పుడూ కూడా ముందుంటారు అన్న విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి క్రీడల వల్ల ఐక్యతతో పాటు నైపుణ్యం కూడా ఉంటుందని పేర్కొన్నారు. నెట్టేకల్ టిడిపి నాయకులు రవీంద్ర సింగ్,ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ వైబి ఈరన్న, వీరారెడ్డి యాదవ్, వీరాంజనేయులు గ్రామ ప్రజలు క్రీడాకారులు పాల్గొన్నారు.





printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com